




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY — నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 25 బుధవారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 98

Navabhoomi daily fallows..









## బంగారు బొమ్మ రావేమే.. పందిట్లో పెళ్లి జరిగేనే..

బాడ్మింటన్ స్టార్ పివి సింధు వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టారు. పొసిడెక్స్ టెక్నాలజీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దత్త సాయితో ఆమె వివాహం రాజస్థాన్‌లోని ఉదయ్‌సాగర్ సరస్సులో ఉన్న రఫల్స్ హోటల్ వేదికగా ఘనంగా వివాహం జరిగింది. వివాహ వేడుకకు సంబంధించిన ఫోటోలను సింధు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. పెళ్లి ఆదివారంనాడు జరిగింది.

# ఒడిశా గవర్నర్‌గా కె.హరిబాబు



- ఐదురాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం
- పలు రాష్ట్రాల గవర్నర్లలో కేంద్రం మార్పులు
- మణిపూర్ గవర్నర్‌గా ఉన్న హరిబాబు ఒడిశాకు
- తక్షణమే విధులు అమల్లోకి వస్తాయన్న రాష్ట్రపతి

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు నియామకయ్యారు.తెలుగోడికి ఒడిశా బాధ్యతలు అప్పగించారు. దేశంలో పలు రాష్ట్రాలకు కేంద్రం గవర్నర్లను నియమించింది. అలాగే పలువురు గవర్నర్లు వివిధ రాష్ట్రాలకు బదిలీ అయ్యారు. దేశంలోని పలు రాష్ట్రాల గవర్నర్లలో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేశారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు, మణిపూర్ గవర్నర్‌గా అజయ్ కుమార్ భల్లా, మిజోరాం గవర్నర్‌గా విజయ్ కుమార్ సింగ్, బిహార్ గవర్నర్‌గా అరిఫ్ మహ్మద్ ఖాన్, కేరళ గవర్నర్‌గా రాజేంద్ర అర్లేకర్‌లను నియమించారు. గవర్నర్ల నియామకాలు బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి అమలులోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మిజోరం గవర్నర్‌గా ఉన్న డాక్టర్ కంభంపాటి హరిబాబు ఒడిశా గవర్నర్‌గా నియమితులయ్యారు. కంభంపాటి హరిబాబు ప్రకాశం జిల్లాలోని తిమ్మసముద్రం గ్రామంలో జన్మించారు. విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌చేశారు. తర్వాత అదే విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలోనే అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసి 1993లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. తరువాత క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన ఏపీ భాజపాలో కీలకంగా వ్యవహరించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగానూ సేవలందించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ తల్లిని విజయమ్మని ఓడించిన నేతగా కంభంపాటి హరిబాబుకు మంచి గుర్తింపు ఉంది. 2021 జులైలో తొలిసారి ఆయన మిజోరం గవర్నర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. తాజాగా ఆయనకు ఒడిశా బాధ్యతలు అప్పగించారు.

# వలసల ముప్పు!?

- హైదరాబాద్,బెంగుళూరు,పుణే నగరాలకు డేంజర్ బెల్స్
- కాలుష్యం అంచున భారత్‌లోని నగరాలు
- కల్కి సినిమాల్లోలాగా కాంప్లెక్సుల్లోకి జనం
- వచ్చే పాతికేళ్లల్లో వాతావరణంలో మార్పులు
- భారత్‌ను భయపెట్టబోతున్నట్లు డేంజర్ బెల్స్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

పెను ప్రమాదంలో హైదరాబాద్, పుణె, బెంగళూరు హైదరాబాద్, బెంగళూరు, పుణె లాంటి నగరాలకు వలసల భయం పట్టుకోబోతోంది. ఇంతకీ దక్షిణాది దిక్కునే పరిస్థితి ఎందుకు ఇలా రాబోతోంది? దానికి కారణం ఏంటి? ఇంతకీ దక్షిణాది దిక్కునే పరిస్థితి ఎందుకు ఇలా రాబోతోంది? దానికి కారణం ఏంటి? డేంజర్ బెల్స్.. పెను ప్రమాదంలో హైదరాబాద్, పుణె, బెంగళూరు..! ఆ నగరాలకు పొంచి ఉన్న ముప్పు ఏంటి? నిజంగా కల్కి సినిమాలా జీవితాలు మారబోతాయా? భూమిపై జనావాసం తగ్గి కాంప్లెక్స్‌ల్లోకి నివాసాలు చేరిట్లు కాలుష్య నగరాలు, గ్రామాల నుంచి సేఫ్ జోన్ సిటీలకు మాస్ మైగ్రేషన్ పెరగబోతోందా? అవును.. వచ్చే పాతికేళ్లలో క్లైమేట్‌లో మార్పులు భయపెట్టబోతున్నాయి. దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలు నివాసానికి కష్టంగా మారబోతు న్నాయి. హైదరాబాద్, బెంగళూరు, పుణె లాంటి నగరాలకు వలసల భయం పట్టుకోబోతోంది. ఇంతకీ దక్షిణాది దిక్కునే పరిస్థితి ఎందుకు ఇలా రాబోతోంది? దానికి కారణం ఏంటి? హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాలకు వలసల ముప్పు..! దేశంలో వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం.. ఇవన్నీ పెను ప్రమాదానికి సంకేతాలుగా మారబోతున్నాయి. ఈ క్లైమేట్ చేంజస్ ముదిరే కొద్దీ

# మరోసారి చంద్రబాబు, రేవంత్ భేటీ

- దావోస్‌లో కలవబోతున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు
- వీరితో బాటే మహారాష్ట్ర సీఎం దేవంద్ర ఫడ్నవీస్
- చంద్రబాబు,రేవంత్‌రెడ్డి ఇప్పటికి 3సార్లు భేటీ
- దావోస్ మీట్‌లో వీరిద్దరి కలిస్తే ఏం చర్చిస్తారు?

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

మరోసారి చంద్రబాబు, రేవంత్ భేటీ. అయి ఏం చర్చించబోతున్నారు..? ఏపీలో చంద్రబాబు, తెలంగాణ రేవంత్ రెడ్డి గెలుపొందాక ఇరు రాష్ట్రాల సీఎంలు తెలుగు రాష్ట్రాల వేదికగా ఒక్కసారి మాత్రమే కలుసుకున్నారు.ఏపీలో చంద్రబాబు, తెలంగాణ రేవంత్ రెడ్డి గెలుపొందాక ఇరు రాష్ట్రాల సీఎంలు తెలుగు రాష్ట్రాల వేదికగా ఒక్కసారి మాత్రమే కలుసుకున్నారు. కానీ.. విదేశాల్లో మాత్రం ఇప్పటికీ రెండుసార్లు కలిశారు. వీరిద్దరు మరోసారి భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ కూడా విదేశాల్లోనే జరగనుంది. దీనికి ముహూర్తం కూడా ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లోనే

# 3 గంటలు.. 30 ప్రశ్నలు?



- చిక్కడపల్లి పోలీసుల ప్రశ్నల వర్షం..
- అల్లు అర్జున్ ఉక్కిరి బిక్కిరి అయినట్లు సమాచారం
- రోడ్‌షో..మీడియా సమావేశంపైనే ప్రశ్నలు
- మళ్లీ విచారణకు రావాల్సిఉంటుందన్న పోలీసులు
- మళ్లీ విచారణకు వస్తానని అల్లు అర్జున్ కీలక హామీ!
- సంధ్య థియేటర్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్..

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

పోలీసుల ప్రశ్నలు.. మీ కుటుంబ సభ్యులు ఎవరెవరు థియేటర్‌కు వచ్చారు? రేవతి చనిపోయిన సంగతి మీరు థియేటర్‌లో ఉన్నప్పుడు తెలియదా? ఏసీపీ, సీఐ మిమ్మల్ని థియేటర్ లో కలిశారా.. లేదా? మీతో వచ్చిన బౌన్సర్లు మొత్తం ఎంతమంది?.. ఎక్కడ నుంచి వచ్చారు? ప్రేక్షకులు, అభిమానులపై దాడి చేసిన బౌన్సర్ల వివరాలు ఏమిటి? ప్రెస్ మీట్ లో మీరు చెప్పిన విషయాలపై మీ వివరణ ఏమిటి? తొక్కిసలాట కారణంగా ఓ మహిళ చనిపోయిన విషయం ఎప్పుడు తెలిసింది? మీరు 2 గంటలకు పైగా థియేటర్‌లో ఉన్నది వాస్తవం కాదా? అనుమతి లేకుండా 850 మీటర్ల మేర రోడ్ షో ఎందుకు చేశారు? పోలీసులు చెప్పిన తర్వాత కూడా తిరిగి వెళ్లేటప్పుడు ఎందుకు కార్లో నుంచి పైకి వచ్చి అభివాదం చేశారు? థియేటర్‌కి వస్తున్నట్లు మీరు ఎవరెవరికి సమాచారం ఇచ్చారు?

తెలంగాణ రాష్ట్రంలో అల్లు అర్జున్ పైన చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసు పైన రచ్చ కొనసాగుతుంది. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్లో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడంతో అల్లు అర్జున్ ను ఈ కేసులో ఏ 11గా చేర్చారు. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు అల్లు అర్జున్ ఇక ఈ కేసులో అల్లు అర్జున్ ను అరెస్టు చేయడం ఆపైన కోర్టు ఆయనకు రిమాండ్ విధించి జైలుకు పంపడం మధ్యంతర

# బిగ్ వికెట్ అరెస్ట్..?

- బౌన్సర్ల ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్న ఆంటోని అరెస్టు
- ఆంటోని అల్లు అర్జున్ వ్యక్తిగత బౌన్సర్ కూడా
- సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటకు ఆంటోని
- ప్రధాన కారకుడిగా భావిస్తున్న చిక్కడపల్లి పోలీసులు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కష్టాలు పెరుగుతున్నట్టే కనిపిస్తోంది. ఉచ్చు మరింత గట్టిగా బిగుసుకుంటోంది. ఇప్పటికే మధ్యంతర బెయిల్‌పై ఉన్న ఆయన తాజాగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణకూ హాజరయ్యారు. అల్లు అర్జున్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో ఆయన వెంట తండ్రి అల్లు అరవింద్, మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, కొంతమంది లీగల్ టీమ్ సభ్యులు ఉన్నారు. సుమారు రెండున్నర గంటల పాటు విచారణలో ఉన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంశ్ యాదవ్, అసిస్టెంట్ పోలీస్

## ఏపీ ఫైబర్ నెట్‌లో 410 మంది ఉద్యోగులు ఔట్!

- వైసీపీ హయాంలో ఇష్టమొచ్చినట్లు ఉద్యోగుల నియామకం
- వంటమనుషులు,డ్రైవర్లను కూడా ఉద్యోగులుగా నియామకం
- ఉద్యోగుల నిర్వాకం వల్ల 10-5లకు తగ్గిన నెట్ కనెక్షన్లు
- అవసరానికి మించి ఉన్న ఉద్యోగుల తొలగింపు
- ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి సంచలన నిర్ణయం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**



ఏపీలో ఫైబర్ నెట్ పేరుతో కేబుల్ ప్రసారాలు, ఇంటర్నెట్ పంపిణీదారుగా ఉన్న ప్రభుత్వ సంస్థ అక్రమాలకు అడ్డాగా మారింది. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఫైబర్ నెట్‌ను తమ జేబు సంస్థగా వాడుకుని అందులో భారీ ఎత్తున ఉద్యోగుల్ని సిఫార్సులతో నియమించారు. వీరితో ఎలాంటి ప్రయోజనం లేకపోగా ఫైబర్ నెట్ కనెక్షన్లు 10 లక్షల నుంచి 5 లక్షలకు తగ్గిపోయాయి. దీంతో ఇందులో ప్రక్షాళన ప్రారంభించిన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ఫైబర్ నెట్ నుంచి 410మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వైసీపీ హయాంలో అక్రమ నియామకాలు జరిగాయని తెలిపారు. వైసీపీ నేతల సిఫార్సులతో అడ్డగోలు నియామకాలు

## అదానీ ఒప్పందాలను వెంటనే రద్దు చేయలేం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను ఒక్క సంతకంతో రద్దు చేసే పరిస్థితి ఉండదు
- చైనా భారత భూభాగాన్ని ఆక్రమించుకున్నా
- ప్రధాని మోడీ పట్టించుకోవడం లేదు

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**



తెలంగాణలో అదానీ పెట్టుబడుల ఒప్పందాల రద్దుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.మంగళవారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో యాదవరెడ్డి పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. యాదవరెడ్డి రాసిన 'నట్స్ అండ్ బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అదానీ పెట్టుబడుల ఒప్పందాలను వెంటనే రద్దు చేయలేమన్నారు.గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను ఒక్క సంతకంతో రద్దు చేసే పరిస్థితి ఉండదన్నారు. అనంతరం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా రెండు వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని ఆక్రమించిందని, దీనిపై మాట్లాడేందుకు ఎవరికీ ధైర్యం

# అల్లు అర్జున్‌పై విమర్శలు ఆపేద్దాం

- అల్లుఅర్జున్ విషయంలో కాంగ్రెస్ కీలక నిర్ణయం?
- కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీతో సమావేశమై చర్చించిన అల్లు అర్జున్ మామ
- వివాదాస్పద వ్యాఖ్యలు ఇక చేయబోమని హామీ
- ఈ మేరకు కాంగ్రెస్ శ్రేణులకు అందిన సమాచారం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చుట్టూ ముసురుకున్న వివాదాలు రోజురోజుకూ తీవ్ర రూపాన్ని దాల్చుతూ వస్తోన్నాయి. సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటన.. అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చిన తరువాత ఈ వ్యవహారం మొత్తం రోజుకో మలుపు తిరుగుతోంది. అల్లు అర్జున్‌ను మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చంద్రాయణగుట్ట శాసన సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ సహా పలువురు సభ్యులు ఈ తొక్కిసలాట ఉదంతంపై ఘాటుగా స్పందించారు. అదేరోజు సాయంత్రం అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడం ఈ వివాదానికి అడ్డుకట్ట వేయకపోగా మరింత ఆజ్యం పోసినట్టయింది.

## అల్లు అర్జున్ రగడకు తెర?

- అమెరికా పర్యటనలో ఉన్న ఎఫ్‌డీసీ
- ఛైర్మన్‌దిల్‌రాజు ఆఘమేఘాల మీద రాక
- వచ్చిన వెంటనే శ్రీతేజకు పరామర్శ
- చర్చలు-సంప్రదింపులతో పరిష్కారం
- త్వరలో సీఎంతో భేటి అవుతా..

2

**హైదరాబాద్-నవభూమి బ్యూరో**



తాజాగా శ్రీతేజ్‌ను ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పరామర్శించారు. తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. డాక్టర్లను కలిశారు. వారితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. హెల్త్ రిపోర్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య వివరాలు, అందుతున్న వైద్య చికిత్స గురించి ఆరా

## అత్యాచార బాధితులకు ఏ హాస్పిటలైనా ఉచితంగా చికిత్స అందించాల్సిందే

- ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ
- అత్యాచారంతో పాటు యాసిడ్ దాడి, లైంగిక వేధింపుల బాధితులకు కూడా వర్తింపు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లకు స్పష్టం చేసిన ఢిల్లీ హైకోర్ట్
- మెడికల్ పరీక్షలు కూడా ఉచితంగా
- చేయాలంటూ న్యాయస్థానం ఆదేశాలు
- ఉచిత చికిత్స నిరాకరించడం నేరమని హెచ్చరిక

2




**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

అత్యాచారం, యాసిడ్ దాడి, లైంగిక వేధింపుల బాధితులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు ఉచిత వైద్య చికిత్సను నిరాకరించడానికి వీల్లేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఉచిత వైద్యంలో భాగంగా మెడికల్ పరీక్షలు కూడా డబ్బులు తీసుకోకుండా చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

లైంగిక దాడుల బాధితులకు చికిత్స నిరాకరించడం చట్ట రీత్యా నేరమని, సంబంధిత హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, మేనేజ్‌మెంట్ జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుందని కోర్టు హెచ్చరించింది. 16 ఏళ్ల బాలికపై ఆమె తండ్రి అత్యాచారం చేసిన కేసులో ఢిల్లీ హైకోర్ట్ జడ్జిలు ప్రతిభా ఎం సింగ్, అమిత్ శర్మలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## రోడ్డుపై గోనెసంచి.. తెరిచిచూడగా షాక్



**రంగారెడ్డి-నవభూమి:** జిల్లాలోని మైలార్‌దేవ్‌పల్లిలో డెడ్ బాడీ కలకలం రేపుతోంది. గోనే సంచిలో డెడ్ బాడీ ఉన్నట్లు జీహెచ్ఎంసీ కార్మికులు గుర్తించారు. వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు కార్మికులు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న మైలార్ దేవ్ పల్లి పోలీసులు గోనె సంచిలో ఉన్న డెడ్ బాడీని పరిశీలించారు. కాగా.. ఈరోజు ఉదయం ఎప్పటిలాగే జీహెచ్ఎంసీ కార్మికులు రోడ్డు శుభ్రం చేసే పనిలో ఉన్నారు. ఇంతలో వారికి ఓ గోనె సంచి కనిపించింది. అనుమానాస్పదంగా ఉన్న గోనె సంచిని చూసిన కార్మికులు దాన్ని తెరువగా.. అందులో ఉన్న దాన్ని చూసి ఖంగుతిన్నారు. గోనె సంచిలో మృతదేహం ఉండటంతో వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తోటి కార్మికులకు తెలియజేయగా అంత వచ్చి గోనెసంచిలో డెడ్‌బాడీని చూశారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని డెడ్‌బాడీని స్వాధీనం చేసుకున్నారు. గోనెసంచిలో వ్యక్తిని ఎక్కడో చంపి సంచిలో మూటగట్టి దుర్గానగర్ నగర్‌లో దుండగులు పడేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హత్యకు గురైన వ్యక్తి ఎవరు.. ఎక్కడి నుంచి గోనెసంచిని తీసుకువచ్చారు అనే సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు పోలీసులు.వెంటనే క్లూస్ టీం కూడా అక్కడకు చేరుకుని క్లూస్‌ను సేకరిస్తున్నారు. క్లూస్ టీం ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ మృతదేహం ఎవరిది అనే కోణంలో విచారణ చేపట్టారు. ఘటనా స్థలంలో సీసీ టీవీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరు తీసుకువచ్చారు.. ఎక్కడి నుంచి తీసుకుని వచ్చారు అనే కోణంలో సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే గోనె సంచిలో మృతదేహం ఉన్నట్లు తెలుసుకున్న స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## లేడీ డాన్ నీతూబాయిని కచ్చితంగా పట్టుకుంటాం.. ఎక్సైజ్ ఈడీ



**హైదరాబాద్-నవభూమి:** గంజాయి క్వీన్, లేడీ డాన్ నీతూబాయి కోసం గాలిస్తున్నట్లు ఎక్సైజ్ ఈడీ కమలాసన్ రెడ్డి వెల్లడించారు. ఆమె కోసం ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు చెప్పారు. ఆమె గంజాయి దందాకు కొందరు ఎక్సైజ్ అధికారులు సహకరించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ ప్రారంభించినట్లు తెలిపారు. విచారణ ఆధారంగా వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్‌గా హైదరాబాద్ నగరంలో గంజాయి దందా చేస్తున్న నీతూబాయి వ్యవహారం నగరంలో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. గంజాయి దందా చేస్తున్న కోట్లు సంపాదించిన నీతూబాయి.. గత కొన్ని రోజులుగా పరారీలో ఉంది. ఎక్సైజ్ అధికారులకు ర్యాంకును బట్టి ప్రతినెలా ముడుపులు పంపించి నీతూబాయి తన దందా కొనసాగించినట్లు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో గంజాయి క్వీన్ నీతూబాయి వ్యవహారంపై సీనియర్ ఐపీఎస్, ఎక్సైజ్ కమలాసన్ రెడ్డి స్పందించారు. నీతూబాయి వ్యవహారంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ సిబ్బందిపై విచారణ మొదలైందని చెప్పారు. స్పెషల్ టీంతో విచారణ చేయిస్తున్నామని.. ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.అధికారుల అండతోనే ఆమె నానక్‌రాంగూడ కేంద్రంగా రూ.కోట్లలో గంజాయి దందా సాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కేసులో అధికారుల పాత్ర తేల్చేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీతూబాయిపై ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఇప్పటి వరకు 25 కేసులు నమోదుచేసిందన్నారు. పోలీసు శాఖ ఏడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నిసార్లు జైలుకెళ్లినా ఆమె తీరు మారలేదని.. ప్రాంతాలు మారుస్తూ గంజాయి అమ్మకాలు సాగిస్తోందన్నారు. నీతూబాయి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు. ధూల్‌పేట తరహాలో నానక్‌రాంగూడ ప్రత్యేక బృందాలు ఆమె కోసం గాలిస్తున్నాయని.. కచ్చితంగా ఆమెను అదుపులోకి తీసుకుంటామని కమాలాసన్ రెడ్డి వెల్లడించారు.ఫ్యామిలీ మొత్తం ఇదే బిజినెస్.. హైదరాబాద్ ధూల్‌పేటలో పుట్టి పెరిగిన నీతూబాయి మొదట్లో గుడుంబా వ్యాపారం చేసేది. ఎక్సైజ్ దాడులు ఎక్కువ కావటంతో ఆమె నానక్‌రాంగూడ మకాం మార్చింది. అక్కడ గంజాయి బిజినెస్ మొదలు పెట్టింది. భర్త, ఇద్దరు కుమారుల సాయంతో గంజాయి దందా నడుపుతోంది. ఒడిషా నుంచి గంజాయిని తీసుకొచ్చి 5, 10 గ్రాముల పొట్లాలుగా తయారు చేసేవారు. 5 గ్రాముల పొట్ల రూ.500, 10 గ్రాముల పొట్లం రూ.1000 చొప్పున విక్రయించేవారు. భర్త, ఇద్దరు కుమారులు ఐటీ కారిడార్‌లోని ఉద్యోగులకు వీటిని విక్రయించేవారు. ఇలా నీతూబాయి రోజుకూ రూ.3-4 లక్షల దందా చేసేది. గంజాయి ద్వారానే ఆమె దాదాపు రూ.5 కోట్లకు పైగా సంపాదించినట్లు గుర్తించారు. ఎక్సైజ్ అధికారులకు ర్యాంకును బట్టి సీఐ అయితే రూ.1.50 లక్షలు, ఎస్ఐ అయితే రూ.50 వేల చొప్పున లంచాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు కేసులు బుక్ చేసిన ఎక్సైజ్ పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య కొత్త రైల్వే లైన్.. హైదరాబాద్-విశాఖ మధ్య తగ్గనున్న దూరం..!

**హైదరాబాద్-నవభూమి:** తెలుగు రాష్ట్రాల మధ్య ట్రైన్ ప్రయాణాలు చేసేవారికి తీపి కబురు. త్వరలోనే మరో ట్రైన్ మార్గం అందుబాటులోకి రానుంది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భద్రాచలం రోడ్డు-కొవ్వూరు ట్రైన్ లైన్ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో ఈ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభం కానుండగా.. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్-విశాఖ మధ్య ప్రయాణ దూరం తగ్గనుంది.తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్‌న్యూస్. రెండు రాష్ట్రాల మధ్య మరో రైల్వే లైన్ అందుబాటులోకి రానుంది. ఈ లైన్ అందబాటులోకి వస్తే రైల్వే కనెక్టివిటీ మరింత పెరగనుంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) -కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.2,155 కోట్ల అంచనా వ్యయంతో పనులు మంజూరు చేయడంతో త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో 50 శాతం కాస్ట్ షేరింగ్ ప్రాతిపదికన ప్రాజెక్టును మంజూరు చేశారు. రాజమండ్రి ఎంపి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల లోక్‌సభలో ఈ రైల్వే ట్రాక్ నిర్మాణంపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 119 కి.మీ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో 50 శాతం కాస్ట్ షేరింగ్ ప్రాతిపదికన మంజూరు చేయబడిందని ఆయన పార్లమెంట్‌లో వెల్లడించారు. దీంతో ప్రాజెక్టుపై స్థానికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కాగా, భద్రాచలం రోడ్డు-కొవ్వూరు (ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా) రైల్వే లైను మొదటిసారిగా 1969-70లో ప్రారంభించారు. ఈ సమయంలో లొకేషన్ సర్వే కూడా జరిగింది. అయితే కొన్ని కారణాల వల్ల ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. భద్రాచలం రోడ్డు-కొవ్వూరు లైన్‌లో భాగమైన కొత్తగూడెం, సత్తుపల్లి మధ్య 56.25 కి.మీ పొడవైన రైలు మార్గం ఇప్పటికే అందుబాటులో ఉంది. రూ.990 కోట్లతో 2022 మేలో ఈ ట్రాక్ పనులు పూర్తి చేశారు. బొగ్గు రవాణాకు రైల్వే ట్రాక్ అవసరం కావటంతో ఇందులో 70 శాతం నిధులను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అందించింది. అయితే మిగిలిన పనుల పూర్తికి అనేక సర్వేలు జరిగాయి కానీ పట్టాలెక్కలేదు. 2009లో అప్పటి కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి మునియప్ప లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా.. ప్రతిపాదిత బ్రాడ్‌గేజ్ లైన్ కోసం తుది లొకేషన్ సర్వే పూర్తయిందని చెప్పారు.2012-13లో రూ.1,445 కోట్లతో ప్రాజెక్టు మంజూరు చేయగా.. ఆ తర్వాత రూ.2,154.83 కోట్లకు సవరించినట్లు అప్పటి మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ లోక్‌సభలో పలుమార్లు ప్రస్తావించారు. విశాఖపట్నం, కాకినాడ పోర్టుల నుంచి సికింద్రాబాద్, నాగ్‌పూర్ వైపు సరుకుల రవాణాకు ఈ ట్రైన్ మార్గం ఉపయోగపడుతుందని సీతారాం చెప్పారు. తెలంగాణకు తక్కువ ఖర్చుతో పోర్టు కనెక్టివిటీతోపాటు ప్యాసింజర్ ట్రైన్లను కూడా నడపవచ్చుని అన్నారు. ఈ రైలు మార్గము పూర్తయితే తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లోని దాదాపు 200 గిరిజన, మారుమూల ఏజెన్సీ గ్రామాలకు ట్రైన్ కనెక్టివిటీ వస్తుందన్నారు. దాంతో పాటుగా హైదరాబాద్-విశాఖపట్నం మధ్య 125 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, ప్రయాణ సమయం దాదాపు రెండు గంటలు ఆదా అవుతుందన్నారు.చాలా ఏళ్లుగా ఈ ప్రాజెక్టు పెండింగ్‌లో ఉందని.. ఈ రైల్వే లైన్ పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేసిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కి సీతారాం నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

### సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన..

# అల్లు అర్జున్‌కు ఈటల రాజేందర్ రిక్వెస్ట్



**హైదరాబాద్-నవభూమి:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర హాట్ టాపిక్‌గా మారింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అదే సమయంలో హీరో అల్లు అర్జున్‌కు ఈటల ఒక రిక్వెస్ట్ చేశారు. ఈనెల 4వ తేదీన పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్న 9 ఏళ్ల బాలుడు శ్రీతేజ్‌ను బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై కిమ్స్ ఆస్పత్రి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న శ్రీతేజ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈటల రాజేందర్ వెంట ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కూడా ఉన్నారు. అనంతరం బయటికి వచ్చి మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. సినిమా ఇండస్ట్రీ మొత్తాన్ని బోనులో నిలబెట్టే ప్రయత్నం.. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఈటల రాజేందర్ ఆరోపించారు. రాజకీయ నాయకులు, సినీ హీరోలు, క్రికెట్ ప్లేయర్స్‌కు భారీగా ఫాలోయింగ్ ఉంటుందని.. వారు ఎక్కడికి వెళ్లినా భారీగా జనం వస్తారు.. కాబట్టి సెలబ్రిటీల పర్యటన ఉన్నప్పుడు ముందస్తు ఏర్పాట్లు అవసరం అని ఈ సందర్భంగా ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఇక ఈ వ్యవహారంలో పోలీసులు, థియేటర్ యాజమాన్యం చెప్పేదానిలో పొంతన లేదని అన్నారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చాం అని థియేటర్ యాజమాన్యం అంటుంటే.. పోలీసులు మాత్రం తాము అనుమతి ఇవ్వలేదని చెబుతున్నారని అన్నారు. ఏది ఏమైనా, ఎవరి నిర్లక్ష్యమైనా ఒక నిండు ప్రాణం పోవడం బాధాకరమని.. వారి కుమారుడు ఇప్పుడు ప్రాణాల కోసం ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా హీరో అల్లు అర్జున్‌కు ఈటల రాజేందర్ ఒక విన్నపం చేశారు.
ంవతి కుటుంబాన్ని సంపూర్ణంగా ఆదుకోవాలని అల్లు అర్జున్‌ను కోరుతున్నట్లు ఈటల చెప్పారు. శ్రీతేజ్ మెడికల్ ఖర్చులు కూడా భరించాలని డిమాండ్ చేశారు. ఇక ఈ సంఘటన అందరికీ ఒక గుణపాఠం కావాలని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పొలిటికల్, సినిమా, క్రికెట్ స్టార్స్ మరింత బాధ్యతాయుతంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. మరోవైపు.. ఈ ఘటనను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ పెద్దలు, మరీ ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి కావాలని చేస్తున్నట్లు ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.ఇలాంటి సంఘటనలు జరగాలని కావాలని ఎవరూ కోరుకోరని పేర్కొన్న ఈటల రాజేందర్.. మళ్లీ ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలి తప్ప.. కావాలని వారిని పిలిపించి పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టడం మంచిది కాదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి వచ్చినప్పుడు ఒక పాత బిల్డింగ్ మీదికి చాలా మంది ఎక్కగా.. ఆరోజు ఆ ఇల్లు కూలి ఏదైనా జరిగితే దానికి ప్రధానిని బాధ్యుల్ని చేసేవారా అని ఈటల ప్రశ్నించారు. కుంభమేళాలో కూడా తొక్కిసలాటలు జరుగుతాయని.. అధికారం ఉంది కదా అని ప్రభుత్వాలు ఏదిపడితే అది చేయడం కరెక్ట్ కాదని పేర్కొన్నారు. ఇలాంటి ధోరణిని ప్రజలు సహించరని.. దీన్ని రాజకీయం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు.. సర్కార్ స్పెషల్ ఫోకస్.. 33 జిల్లాలకు ప్రత్యేకంగా..!




**హైదరాబాద్-నవభూమి:** ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలును రేవంత్ సర్కార్ వేగవంతం చేసింది. ఇప్పటికే ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సర్వేయర్లు ప్రతి ఇళ్లు తిరిగి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. సంక్రాంతిలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అదే సమయంలో పథకాన్ని వేగంగా అమలు చేసేందుకు 33 జిల్లాలకు ప్రత్యేకంగా ప్రాజెక్టు డైరెక్టర్లను నియమించేందుకు సిద్ధమయ్యారు.తెలంగాణలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు నిర్మించి ఇస్తామని రేవంత్ సర్కార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పథకం అమలుపై సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. విధివిధానాల ఖరారు, లబ్ధిదారుల ఎంపిక కోసం 33 జిల్లాలకు ప్రాజెక్టు డైరెక్టర్లను(పీడీ) నియమించేందుకు రెడీ అయింది. పథకం పురోగతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రజాపాలనలో 80.54 లక్షల మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోగా.. ఆయా దరఖాస్తుదారుల ఇళ్లకు సర్వేయర్లు వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.
అయితే, ఈ సర్వే ప్రస్తుతం ప్రభుత్వం ఆశించినంత వేగంగా ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు 35 శాతం మాత్రమే వివరాల నమోదు పూర్తయినట్లు తెలిసింది. సంక్రాంతికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సర్కార్ భావిస్తోండగా.. ఆలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సర్కార్ ఆదేశించింది. సర్వే పూర్తయ్యాక.. గ్రామసభలు ఏర్పాటు చేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. లబ్ధిదారుల ఎంపికకూ సమయం పట్టే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో 33 జిల్లాలకు ప్రత్యేకంగా పీడీల నియమించి పథకాన్ని స్పీడప్ చేయాలని భావిస్తున్నారు. ఆలస్యానికి తావు లేకుండా త్వరగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు వీరిని నియమించనున్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇచ్చేందుకు రెడీ అయ్యారు. తెలంగాణ తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను ఇవ్వాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుకి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వనుంది. మొత్తం 4 విడతల్లో ఈ డబ్బులు లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయనున్నారు. తొలి విడతలో స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేసేందుకు రెడీ ప్రణాళికలు రచిస్తున్నారు. మొదటి విడతలో మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లకు రూ.7,740 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి.. ఇళ్లకు నిధుల కేటాయించేలా రేవంత్ ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

# 3 గంటలు..30 ప్రశ్నలు?

**(1వపేజీ తరువాయి)** బెయిల్‌పైన అల్లు అర్జున్ జైలు నుంచి బయటకు రావడం ప్రతి ఒక్కరికి తెలిసిందే. ఇక తాజాగా ఈ కేసులో అల్లు అర్జున్ తన తండ్రి అల్లు అరవింద్‌తో పాటు మామతో కలిసి తన లాయర్లతో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు విచారణ నిమిత్తం వెళ్లారు. ' విచారణలో అల్లు అర్జున్ కు ప్రశ్నల వర్షం విచారణలో భాగంగా చిక్కడపల్లి పోలీ సులు అల్లు అర్జున్‌ను పలు అంశాలపై ప్రశ్నించి నట్టుగా ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసినట్టుగా తెలుస్తుంది. సుమారు మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ విచారణ కొనసాగింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన పైన పోలీసులు చెబుతున్న దానికి అల్లు అర్జున్ చెబుతున్న దానికి చాలా వ్యత్యాసం ఉండడంతో మళ్లీ నేడు విచారణలో భాగంగా ఆయనను పోలీసులు అనేక విధాలుగా ప్రశ్నించారు. చిక్కడపల్లి పోలీసులకు అల్లు అర్జున్ హామీ న్యాయవాదుల సమక్షంలో పోలీ సులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ సంద ర్భంగా అల్లు అర్జున్ స్టేట్మెంట్‌ను పోలీ సులు రికార్డ్ చేశారు. ఏసీపీ రమేష్ కుమార్, ఇన్స్పెక్టర్ రాజు నాయక్ సమక్షంలో ఈ విచారణ కొనసా గింది. అవసరమైతే మరోసారి విచారణకు రావాలని పోలీసులు అల్లు అర్జున్‌ను ఆదేశిం చగా, తప్పకుండా సహకారం అందిస్తా నని అల్లు అర్జున్ హామీ ఇచ్చారని తెలుస్తుంది. ఆ వీడియో ఆధారంగా ప్రశ్నాస్త్రాలు సెంట్రల్ జోన్ డిసిపి ఆకాంక్ష యాదవ్ అల్లు అర్జున్ సంధ్య థియేటర్లో జరిగిన ఘటన విషయంలో వివిధ అంశాల పైన విచారణ చేశారు. ఇటీవల పోలీసులు విడుదల చేసిన పది నిమిషాల వీడి యోను ఆధారంగా చేసుకొని నేడు పోలీసులు అల్లు అర్జున్ ను ప్రశ్నించినట్టు తెలుస్తుంది. దీంతో పాటు ఆయన నిర్వహించిన ప్రెస్ మీట్లో పేర్కొన్న అంశాల పైన కూడా విచారించినట్లు తెలుస్తుంది. విచారణకు ముందు లీగల్ టీమ్‌తో సంప్రదింపులు తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌కు పోలీసులు సోమవారం నోటీసులు ఇచ్చి మంగళవారం ఉదయం 11 గంటలకు పోలీస్ స్టేషన్లో విచారణకు రావాల్సిందిగా ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే నేడు అల్లు అర్జున్ విచారణకు హాజరయ్యారు. .అంతకుముందు పోలీసుల నోటీసులపైన అల్లు అర్జున్ తన లీగల్ టీంతో చర్చలు జరిపారు. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద భారీ బందోబస్తు మూడున్నర గంటల విచారణ తర్వాత అల్లు అర్జున్ తిరిగి జూబ్లీహిల్స్ లోని తన నివాసానికి వెళ్లారు. ఇక చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఈరోజు అల్లు అర్జున్ ను విచారిస్తున్న క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ నుంచి 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు విధించారు. వాహనాల రాకపోకలను సైతం నిలిపివేశారు.

### అత్యాచార బాధితులకు ఏ హాస్పిటలైనా ఉచితంగా చికిత్స అందించాల్సిందే

**(1వపేజీ తరువాయి)** లైంగిక దాడుల నుంచి బయటపడిన బాధితులు ఉచిత వైద్య చికిత్స విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయస్థానం విచారం వ్యక్తం చేసింది. ఉచిత చికిత్సలో భాగంగా అవసరమైన అన్ని పరీక్షలు, రోగ నిర్ధారణ టెస్టులు చేయడంతో పాటు దీర్ఘకాలిక వైద్య సంరక్షణ కూడా అందించాలని స్పష్టం చేసింది. బాధితులకు అవసరమైన కౌన్సెలింగ్ కూడా ఇవ్వాలని ఢిల్లీ హైకోర్ట్ తెలిపింది.

## ఏపీ ఫైబర్ నెట్‌లో 410 మంది ఉద్యోగులు ఔట్!

**(1వపేజీ తరువాయి)** చేశారన్నారు. ఎక్కువ మందిని అవసరం లేకున్నా నియమించారని జీవీ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా వంట మనుషులు, డ్రైవర్లను ఫైబర్ నెట్‌లో ఉద్యోగులుగా నియమించారన్నారు. వీరంతా వైసీపీ నేతల ఇళ్లలో వంట మనుషులు, డ్రైవర్లుగా పనిచేస్తు న్నారని జీవీ రెడ్డి తెలిపారు. అందుకే వీరిని గుర్తించి తొలగించినట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఫైబర్ నెట్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టాక ప్రక్షాళన చేపట్టిన జీవీ రెడ్డి.. సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా అక్రమ నియామకాలపై దృష్టిపెట్టడంతో పాటు ఫైబర్ నెట్ కనెక్షన్ల ఛార్జీల తగ్గింపు, కొత్త కనెక్షన్లను తక్కువ ధరకే ఇవ్వడం వంటి చర్యలు తీసుకుంటున్నారు.

## మరోసారి చంద్రబాబు, రేవంత్ భేటీ

**(1వపేజీ తరువాయి)** దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేత్తల వార్షిక సదస్సు జరగనుంది. ఈ సదస్సు కోసం ఇండియా నుంచి ముగ్గురు ముఖ్యమంత్రులు హాజరుకాబో తున్నారు. వీరిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఉన్నారు. వీరు ఐదు రోజుల పాటు దావోస్‌లో నిర్వహించనున్న సదస్సుకు హాజరుకానున్నారు. ప్రపంచవ్యాప్తం గా 50 మంది దేశాధినేతలు, 100 కంపెనీలకు పైగా సీఈవోలు పాల్గొంటున్నారు. ఇక్కడికి వచ్చే పారిశ్రామిక వేత్తలు, వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులతో సీఎం మాట్లాడే అవకాశం ఉంటుంది. మూడూ ఒక్కటై అలాగే.. భారత్‌లోని అనుకూల పరిస్థితులను ఆయా నేతలు ప్రెజెంట్ చేయనున్నారు. మరోవైపు ఆరు నెలల గ్యాప్‌లోనే సీఎం రేవంత్, సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. పెండింగులో ఉన్న అంశాలపై ఒకేఒక సందర్భంలో వీరు హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. అదే సమయంలో విభజన సమస్యలపై మాట్లాడుకున్నారు. అయితే.. చాలా రోజుల తరువాత వీరు మరోసారి కలుసుకోబోతున్నారు. ఈ క్రమంలో వీరి మధ్య ఎలాంటి గతంలో కేటీఆర్, జగన్ సైతం దావోస్ వెళ్లారు. వారు వెళ్లినప్పుడు ఇద్దరు ఇరు రాష్ట్రాల సమస్యలపై చర్చించుకున్నారు. మరోసారి ఇద్దరు తెలుగు రాష్ట్రాల సీఎంలు భేటీ అవుతుండడంపై ఇంకా ఏమైనా ఆసక్తికర పరిణామాలు ఉంటాయా అన్న చర్చ జరుగుతోంది. వచ్చేనెల 20న ఈ సమావేశాలు జరగనున్నాయి. చంద్రబాబు సీఎంగా పనిచేస్తున్నప్పటి నుంచి ప్రతిసారీ ఆయన దావోస్ సదస్సుకు హాజరవుతుంటారు.

## వలసల ముప్పు!?

**(1వపేజీ తరువాయి)** హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాలకు వలసలు కూడా భారీగా పెరిగే ప్రమాదం ఉందంటు న్నారు. ఇప్పుడు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి ఈ విషయాన్ని హెచ్చరించడంతో క్లైమేట్ చేంజ్, మాస్ మైగ్రేషన్ పై దేశవ్యాప్తంగా జోరుగా చర్చ జరుగుతోంది. నగరాల నుంచి నగరాలకు మాస్ మైగ్రేషన్.. మాస్ మైగ్రేషన్.. దసరాకు సొంతూళ్లకు వెళ్తాం. సంక్రాంతికి ఊరి వెళ్లి సెలబ్రేషన్ చేసుకుని నగరం చేరుకుంటాం. ఇలానే ఫ్యూచర్ లో నగరాల నుంచి నగరాలకు మాస్ మైగ్రేషన్ జరగబోతోందంటున్నారు. అది ఏదో సిటీలను చూసి నాలుగు రోజులు ఉండి రావడానికి కాదు. లైఫ్‌ని రిస్క్‌లో పెట్టడం ఎందుకని, ప్రమాదకర వాతావరణ పరిస్థితులున్న నగరాల నుంచి సురక్షితంగా అనిపించే వాతావరణ ఉన్న నగరాల్లో జీవించేందుకు భారీగా వలసలు పెరుగుతా యంటున్నారు. రాబోయే పాతికేళ్లలో గ్రామీణ ప్రాంతాలు నివాస యోగ్యతను కోల్పోతాయి. ఇప్పటికే మౌలిక వసతుల లేమి, కాలుష్యం, వాతావరణం మార్పుల ప్రభావం నగరాలపై తీవ్రంగా ఉంది. . పర్యావరణాన్ని గాలికి వదిలేస్తే విధ్వంసం తప్పదా? ఈ పాతికేళ్లలో దేశంలో వాతావరణ మార్పులు, కాలుష్యంతో ఉత్తరాదిన నగరాల నుంచి దక్షిణాది నగరాలకు భారీగా వలసలు ఉంటాయని అంటున్నారు. మరి దీన్ని ఎలా అరికట్టాలి. ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు ఏంటి? పర్యావరణాన్ని గాలికి వదిలేస్తే విధ్వంసం తప్పదా? ఎవరు దీనికి బాధ్యులు? ఈ పాతికేళ్లలో దేశంలో వాతావరణ మార్పులు, కాలుష్యంతో ఉత్తరాదిన నగరాల నుంచి దక్షిణాది నగరాలకు భారీగా వలసలు ఉంటాయని అంటున్నారు. మరి దీన్ని ఎలా అరికట్టాలి. ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు ఏంటి? పర్యావరణాన్ని గాలికి వదిలేస్తే విధ్వంసం తప్పదా? ఎవరు దీనికి బాధ్యులు?

## అదానీ ఒప్పందాలను వెంటనే రద్దు చేయలేం

**(1వపేజీ తరువాయి)** చాలడం లేదన్నారు. భారత్ కోల్పోయిన భూమి, మణిపూర్ అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు.మోదీ ప్రధాని అయ్యాక ప్రైవేటు పెట్టుబడులు పెరిగాయని ఆరోపించారు. ప్రైవేటు సంస్థల పెట్టుబడులపై విస్తృతంగా చర్చ జరగాలని పిలుపునిచ్చారు.

## అల్లు అర్జున్‌పై విమర్శలు ఆపేద్దాం

**(1వపేజీ తరువాయి)** ఈ ప్రెస్ మీట్ తరువాత ఆయనపై దాడి మరింత తీవ్రతరమైంది. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు బల్మూరి వెంకట్, విప్ ఆది శ్రీనివాస్ ఘాటుగా స్పందించారు. అల్లు అర్జున్‌లో పశ్చాత్తాపం ఎంతమాత్రం కనిపించట్లేదని విమర్శించారు. పోలీసులను సైతం తప్పు పట్టేలా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అదే సమయంలో అల్లు అర్జున్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కొద్దిసేపటి కిందటే ఆయన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు విచారణకు చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన వెంట తండ్రి అల్లు అరవింద్, మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ టీమ్ సభ్యులు ఉన్నారు. ఈ పరిణామాల మధ్య- అల్లు అర్జున్‌కు కొంత వరకు ఊరట కలిగించే ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆయనపై ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దంటూ గాంధీ భవన్ నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సమాచారం వెళ్లిందనే ప్రచారం జరుగుతోంది. అల్లు అర్జున్‌తో పాటు తెలుగు చలన చిత్ర పరిశ్రమపైనా వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దంటూ సూచించినట్లు చెబుతున్నారు. అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి.. గాంధీ భవన్‌కు వెళ్లి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపా దాస్ మున్షితో ప్రత్యేకంగా సమావేశమైన అనంతరం ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయని అంటోన్నారు. అల్లు అర్జున్‌పై ప్రధానంగా కాంగ్రెస్ నుంచే దాడి జరుగుతోందని, దీనికి ఫుల్ స్టాప్ పడేలా నిర్ణయాలను తీసుకోవాలంటూ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారని, దీని పట్ల దీపా దాస్ మున్షీ సానుకూలంగా స్పందించారని, పార్టీ వరకు ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా చేసుకుంటానని హామీ ఇచ్చారని, ఈ క్రమంలోనే పార్టీ నాయకులు, కార్యకర్తలకు పీసీసీ నుంచి సమాచారం వెళ్లిందని చెబుతున్నారు.

## బిగ్ వికెట్ అరెస్ట్..?

**(1వపేజీ తరువాయి)** కమిషనర్ రమేష్ కుమార్, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సీఐ రాజు ఆధ్వర్యంలో విచారణ సాగింది. అనంతరం పోలీసులు ఆయనను సంధ్యా థియేటర్‌కు తీసుకెళ్లారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తరలించినట్లు సమాచారం. దీని తరువాత అనూహ్య పరిణామాలు సంభవించాయి. విచారణ కొనసాగుతున్న సమయంలోనే అల్లు అర్జున్ బౌన్సర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయన పేరు ఆంటోనీ. బౌన్సర్ల ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తోన్నట్లు చెబుతున్నారు. ఇదివరకే ఆయన పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు పోలీసులు. విచారణ సందర్భంగా అల్లు అర్జున్ ఇచ్చిన వివరాల మేరకు ఆంటోనీని అరెస్ట్ చేశారని చెబుతోన్నప్పటికీ.. గురువారమే ఆయనను అదుపులోకి తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. తొక్కిసలాట ఘటనలో ఆయనను పోలీసులు ప్రధాన కారకుడిగా భావిస్తోన్నారని చెబుతున్నారు. సంధ్యా థియేటర్ వద్ద తోపులాట చోటు చేసుకోవడానికి ఆంటోనీ కారణమనే అభిప్రాయాలు ఉన్నాయి.

## అల్లు అర్జున్ రగడకు తెర?

**(1వపేజీ తరువాయి)** తీశారు. అమెరికా నుంచి.. మొన్నటి వరకు దిల్ రాజు అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన నిర్మించిన గేమ్ ఛేంజర్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అమెరికాలో నిర్వహించిన ఈవెంట్‌లో హీరో రామ్ చరణ్, దర్శకుడు శంకర్, ఇతర టెక్నీషియన్లతో కలిసి పాల్గొన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగివచ్చారు. అన్ని సర్దుకుంటాయి.. కొద్దిసేపటి కిందటే కిమ్స్‌కు వెళ్లారు. శ్రీతేజ్‌ను పరామర్శించారు. అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడారు దిల్ రాజు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగామని, ఒకట్రెండు రోజుల్లో ఆయనను కలుస్తామని అన్నారు. చిత్ర పరిశ్రమ తరఫున పెద్దలందరూ కలిసి వెళ్తామని చెప్పారు. అనంతరం అల్లు అర్జున్‌ను కూడా కలుస్తానని మధ్యేమార్గాన్ని కనుగొంటామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంపై.. ప్రస్తుతం శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌ను ఎలా ఆదుకోవాలనే విషయాన్ని పరిష్కరించాల్సి ఉందని, అన్ని విధాలుగా ఆదుకుంటామని, తానే దగ్గరుండి దీన్ని లీడ్ చేస్తానని చెప్పారు. బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవడానికే అధిక ప్రాధాన్యత ఇస్తామని, రేవంత్ రెడ్డి సైతం ఇదే విషయాన్ని తనతో చెప్పారని దిల్ రాజు వివరించారు. టాలీవుడ్ మొత్తం భాస్కర్‌కు అండగా ఉంటుందని అన్నారు. వారధిలా.. అటు చిత్ర పరిశ్రమకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యతను రేవంత్ రెడ్డి తనకు ఇచ్చారని, చర్చలు-సంప్రదింపులతో పరిష్కారాన్ని కనుగొంటామని దిల్ రాజు అన్నారు. ఆ కుటుంబ బాధ్యతను తీసుకుంటున్నానని, శ్రీతేజ్ త్వరగా రికవరీ అవుతారని పేర్కొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
బుధవారం
25। డిసెంబర్। 2024



## మీరు టీ, కాఫీ తాగుతారా.. అయితే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడ్డట్టే..

**న్యూఢిల్లీ-నవభూమి:** టీ, కాఫీ సేవనం వల్ల తల, మెడ, గొంతు, నోటి క్యాన్సర్ ముప్పు తగ్గుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా తల, మెడ క్యాన్సర్ ఏడో అతి సాధారణ క్యాన్సర్. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ఈ క్యాన్సర్ రేట్లు పెరుగుతున్నాయి. కాఫీని సేవించని వారితో పోల్చినపుడు, రోజుకు నాలుగు కప్పుల కన్నా ఎక్కువ కెఫినేటెడ్ కాఫీని తాగేవారికి తల, మెడ క్యాన్సర్ ముప్పు 17 శాతం తక్కువగా ఉంటుందని అధ్యయనం తెలిపింది.నోరు, నాలుక వంటి భాగాలకు క్యాన్సర్ ముప్పు 30%, గొంతు క్యాన్సర్ ముప్పు 22



శాతం తగ్గుతుందని, గొంతు క్రింది భాగంలో క్యాన్సర్ వచ్చే అవకాశం 41 శాతం తగ్గుతుందని వెల్లడించింది. డీకెఫినేటెడ్ కాఫీ కూడా కొంత వరకు సానుకూల ప్రభావం చూపుతుందని గుర్తించింది. టీ తాగడం వల్ల గొంతు కింది భాగంలో క్యాన్సర్ ప్రమాదం 29 శాతం తగ్గుతుంది. రోజూ ఒక కప్పు లేదా అంతకన్నా తక్కువ టీ తాగడం వల్ల తల, మెడ క్యాన్సర్ ముప్పు 9 శాతం వరకు తగ్గుతుంది. గొంతు కింది భాగంలో క్యాన్సర్ ముప్పు 27 శాతం వరకు తగ్గుతుంది. అయితే రోజుకు ఒకటి కన్నా ఎక్కువ కప్పుల టీ తాగితే, స్వరపేటిక క్యాన్సర్ ముప్పు 38 శాతం ఎక్కువగా ఉంటుంది.

## ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన శ్యామ్ బెనెగల్ అంత్యక్రియలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ అంత్యక్రియలు ముగిశాయి. మహారాష్ట్ర రాజధాని ముంబై లోని శివాజీ పార్క్ ఎలక్ట్రిక్ క్రిమటేరియంలో రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో బెనెగల్ అంత్యక్రియలు నిర్వహించారు. శ్యామ్ బెనెగల్ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు భారీ సంఖ్యలో అంత్యక్రియలకు హాజరయ్యారు. శ్యామ్ బెనెగల్ కిడ్నీ సంబంధ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మరణించారు. 1934లో హైదరాబాద్ రాష్ట్రంలోని తిరుమలగిరి ప్రాంతంలో శ్యామ్ బెనెగల్ జన్మించారు. సినీ రంగానికి అందించిన సేవలకుగాను ఆయన పద్మ శ్రీ, పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే, ఏఎన్ఆర్ జాతీయ అవార్డులను అందుకున్నారు. శ్యామ్ బెనెగల్ సికింద్రాబాద్ ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ ఎకనామిక్స్ పట్టా పొందారు.సామాజిక సమస్యలు, ఆర్థిక అసమానతలపై ఆయన సినిమాలు రూపొందించారు. ఎనిమిది సార్లు జాతీయ అవార్డులు అందుకున్నారు. శ్యామ్ బెనెగల్‌కు అంకూర్ (1974), నిషాంత్ (1975), మంతన్ (1976), భూమిక (1977), జునూన్ (1978) సినిమాలు బాగా పేరు తెచ్చిపెట్టాయి. ఆయన జబర్‌దస్త్ డాక్యుమెంటరీని రూపొందించారు. జాతీయ సినిమా అవార్డులలో హిందీ కేటగిరీలో శ్యామ్ బెనెగల్ ఏకంగా ఏడుసార్లు అత్యుత్తమ సినిమా అవార్డులు అందుకున్నారు.

## కేన్-బెట్వా నదీ అనుసంధానం ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన



**ఛాతర్‌పూర్:నవభూమి:** కేన్-బెట్వా నదీ అనుసంధానం జాతీయ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి నూరవ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ ప్రణాళికలో భాగంగా దేశంలో తొలిసారి నదీ అనుసంధానం ప్రాజెక్టు కార్యం రూపం దాల్చింది. మధ్యప్రదేశ్‌లోని ఛాతర్‌పూర్‌లో దౌదెన్ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు.కేన్ నదిలో ప్రవహించే అదనపు నీటిని.. ఉత్తరప్రదేశ్‌లోని బెట్వా నదికి తరలిస్తారు. 2021లోనే ఈ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం దక్కింది. కేబీఎల్పీ ప్రాజెక్టు కోసం సుమారు 44,605 కోట్లు ఖర్చు చేయనున్నారు. రాజకీయ, పర్యావరణ కారణాల వల్ల ప్రాజెక్టు ఆలస్యం అయ్యింది.నదీ అనుసంధానం ద్వారా యూపీలోని బెట్వా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న బుందేల?ండ్‌లో పంటల సాగును పెంచనున్నారు. సుమారు 77 మీటర్ల ఎత్తు, రెండు కిలోమీటర్ల వెడల్పుతో కేన్-బెట్వా ప్రాజెక్టు కోసం డ్యామ్‌ను నిర్మిస్తున్నారు.పన్నా టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఈ ప్రాజెక్టును కడుతున్నారు. దౌధాన్ డ్యామ్‌తో పాటు సుమారు 230 కిలోమీటర్ల కెనాల్ కూడా నిర్మించనున్నారు.

## రామేశ్వరం తీరంలో కలకలం.. దుస్తులు మార్చుకునే గదిలో రహస్య కెమెరా గుర్తించిన మహిళ..!



**న్యూఢిల్లీ-నవభూమి:** తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రామేశ్వరం ఆలయం వద్ద షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఆలయ సందర్శనకు వెళ్లిన ఓ భక్తురాలికి చేదు అనుభవం ఎదురైంది. సముద్రతీరంలో దుస్తులు మార్చుకునే గదిలో రహస్య కెమెరాలభ్యమైంది. ఇది చూసిన సదరు భక్తురాలు ఒక్కసారిగా షాక్‌కు గురైంది.పుదుకోట్టైకి చెందిన మహిళ కుటుంబ సభ్యులతో కలిసి రామేశ్వరం ఆలయ సందర్శనకు వెళ్లింది. ఆలయ ఆచారాల్లో భాగంగా అగ్నితీర్థం వద్ద సముద్రస్నానం ఆచరించింది. అనంతరం దుస్తులు మార్చుకునేందుకు తీరం వద్ద ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన గదిలోకి వెళ్లింది. అక్కడ రహస్యంగా ఉంచిన కెమెరాలను గుర్తించింది. ఈ విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు, ఆలయ అధికారుల దృష్టికిక తీసుకెళ్లింది.మహిళ ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న పోలీసులు, ఆలయ అధికారులు గదిలో రహస్యంగా అమర్చిన కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. బూత్ నిర్వాహకులు రాజేష్‌ను అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ తర్వాత సమీపంలో టీస్టాల్ నడుపుతున్న మీరా మొయిదీన్ అనే వ్యక్తిని కూడా అరెస్ట్ చేశారు. అతడు రాజేష్‌కు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

## 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లుపై వచ్చే నెల 8న జేపీసీ మీటింగ్

**న్యూఢిల్లీ-నవభూమి:** 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ వచ్చే నెల 8న తొలిసారి సమావేశం కానుంది. కమిటీ ఛైరపర్సన్‌తోపాటు సభ్యులు అంతా ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేవం అజెండాకు సంబంధించిన వివరాలను కేంద్ర న్యాయ శాఖ కమిటీ సభ్యులకు తెలియజేయనుంది. జనవరి 8న ఉదయం 11 గంటలకు సమావేశం మొదలుకానుంది. ఈ విషయాన్ని కమిటీ జాయింట్ సెక్రెటరీ గుండా శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా మీడియాకు వెల్లడించారు. 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ వచ్చే జనవరి 9న తొలిసారి సమావేశం కానుందని, సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కొడుకును స్కూల్ బస్ ఎక్కిస్తుండగా విద్యుత్ షాక్.. మహిళ పరిస్థితి విషమం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆమె రోజులాగే సోమవారం ఉదయం కూడా తన కొడుకును స్కూల్ బస్సు ఎక్కించేందుకు వెళ్లింది. బస్సు రాగానే కొడుకును ఆ బస్ ఎక్కిస్తూ విద్యుత్ షాక్‌కు గురైంది. స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించి ఆమె శరీరం నుంచి మంటలు రావడంతో భయంతో వెనుకడుగు వేశారు. ఆ తర్వాత బస్సును ముందుకు తీయించి తీవ్రంగా గాయపడిన మహిళను, ఆమె కొడుకును ఆస్పత్రికి తరలించారు.

వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని కలబురగికి చెందిన 34 ఏళ్ల మహిళ ఎప్పటిలాగానే సోమవారం కూడా అంగ వికలుడు అయిన తన కొడుకును స్కూల్ బస్సు ఎక్కించేందుకు తీసుకెళ్లింది. కాసేపు స్టాప్‌లో వేచిచూసిన తర్వాత బస్సు రావడంతో కొడుకును బస్సు ఎక్కించేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో ఆమెకు విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయింది.స్థానికులు గమనించి ఆమెను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ ఆమె శరీరం నుంచి మంటలు రావడం చూసి వెనక్కి తగ్గారు. వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేసి బస్సును ముందుకు తీయించారు. ఆ తర్వాత తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన మహిళను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఘటనలో ఆమె కొడుకుకు కూడా గాయాలయ్యాయి. అయితే అతనికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్కూల్ బస్సు ఆగిన చోట ఓ విద్యుత్ వైర్ తెగి వేలాడుతుండటమే ప్రమాదానికి కారణమని వారు తెలిపారు. తెగి వేలాడుతున్న విద్యుత్ వైర్ స్కూల్ బస్సుకు తగలడంతో.. బస్సు విద్యుత్ ప్రసరణ జరిగిందని, ఆ బస్సును బాధిత మహిళ పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురైందని పోలీసులు నిర్ధారించారు. విద్యుత్ వైర్ వేలాడుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చండీగఢ్ కార్పోరేషన్ మీటింగ్‌లో రసాభాస.. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్‌ల కొట్లాట



**న్యూఢిల్లీ-నవభూమి:** అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని కూడా ఆ తీర్మానంలో డిమాండ్ చేశారు. దాంతో ఈ తీర్మానంపై ఓటింగ్‌కు పోల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన అనిల్ మాషీ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీపై ఉన్న ఇండియా హెరాల్డ్ కేసును ప్రస్తావించారు. అది కార్పోరేషన్‌లో కాంగ్రెస్, బీజేపీల మధ్య గొడవకు దారితీసింది. ఇరు పార్టీల సభ్యులు బాహాబాహీకి దిగారు.కాంగ్రెస్ హయాంలోనే అంబేద్కర్‌కు అవమానం జరిగిందని, భారత ప్రధాని నెహ్రూ హయాంలోనే అంబేద్కర్‌ను అవమానించారని బీజేపీ కౌన్సిలర్‌లు ఆరోపించారు. దాంతో కాంగ్రెస్ కౌన్సిలర్‌లు బీజేపీపై మండిపడ్డారు. రెండు పార్టీల సభ్యులు ఒకరిపై ఒకరు బాహాబాహీగా దిగడంతో గందరగోళం నెలకొంది. ఈ గందరగోళానికి సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

## సైనికుల్ని పంపి.. ఆయుధాలిచ్చి.. ఉక్రెయిన్‌లో పారిపోతున్న ఉ.కొరియా



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలో ప్రస్తుతం రెండు దేశాల గురించి చెప్పుకోవాలి.. ఉ అంటే ఉక్రెయిన్.. ఉ అంటే ఉత్తర కొరియా. ఒకటి యుద్ధ బాధిత దేశం.. మరొకటి యుద్ధ కాంక్షతో రగిలిపోయే దేశం. భౌగోళికంగా వీటికి ఒకదానికొకటి చాలా దూరం. కానీ, ఇప్పుడు యుద్ధంలో తలపడుతున్నాయి. ఇదెలా సాధ్యం అంటే.. ఉత్తర కొరియా సైనికులు రష్యాకు సాయంగా ఉక్రెయిన్ లోకి వెళ్లడంతోనే. ఇక్కడే ఓ ట్విస్ట్ ఉంది. డ్రోన్లకు చిక్కకుండా.. పెద్ద సంఖ్యలో ఉత్తర కొరియా సైనికులు తమ దళాల చేతిలో హతం అయినట్లుగా ఇప్పటికే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ప్రకటించిన సంగతి తెలిసిందే. చాలామంది గాయపడినట్లుగా పేర్కొన్నారు. ఇలా చనిపోయినవారి ముఖాలను రష్యా సేనలు కాల్చివేసినట్లుగా ఉన్న ఫొటోలను జెలెన్ స్కీ విడుదల చేశారు. మరోవైపు ఉక్రెయిన్ డ్రోన్లను ఎదుర్కోలేక ఉత్తర కొరియా జవాన్లు పరుగులు పెట్టిన వీడియోలు బయటకు వస్తున్నాయి. రష్యాలోని కుర్స్క్ ప్రాంతంపై ఆధిపత్యం కోసం కొన్నాళ్లుగా యుద్ధం సాగుతోంది. దీనిని గతంలో ఉక్రెయిన్ స్వాధీనం చేసుకుందనే కథనాలు వచ్చాయి. ఉత్తర కొరియా 12 వేల మంది సైనికులను పంపగా.. ఇక్కడ 3 గ్రామాల్లోనే దాదాపు 10వేల మంది ఉన్నారు. భాష సమస్య కారణంగా రష్యా-ఉత్తర కొరియా దళాల మధ్య సమన్వయం లోపించి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తొలి వారాల్లోనే ప్రతి పదిమంది ఉత్తర కొరియా సైనికుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. కాగా, వీరిని ఉక్రెయిన్‌కు చెందిన కమికేజ్ డ్రోన్లు వేటాడాయి. 3 రోజుల్లో 77 మందిని చంపేశాయి. ప్రత్యేక శిక్షణ అనంతరం వీరిని కదన రంగంలోకి దింపారు. తాజాగా వేలాది కొరియన్ సైనికులు చనిపోయి ఉండడమో లేదా గాయపడడమో జరిగిందని జెలెన్‌స్కీ వెల్లడించారు. రష్యాకు 20 వేల కంటైనర్లలో ఆయుధాలు రష్యాతో పోలిస్తే ఉత్తరకొరియా చాలా చిన్న దేశం. కానీ ప్రస్తుతం ఆ దేశమే రష్యాకు ఆయుధాలకు పెద్ద దిక్కు అయిందట. ఉత్తర కొరియా నియంత కిమ్ వందల కొద్దీ ఆయుధాల ఫ్యాక్టరీలను రాత్రింబవళ్లు నడిపించి ఆయుధాలను ఉత్పత్తి చేస్తున్నారట. 200 ఆయుధ ఫ్యాక్టరీలు పూర్తిస్థామర్థ్యంతో ఉత్పత్తిని వేగవంతం చేశాయిట హ్వాసంగ్-11 శ్రేణి బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాల్లో కొత్త పరికరాలు అమర్చి ఉత్పత్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరో గమనార్హమైన విషయం ఏమంటే.. మొత్తం కార్యక్రమాన్ని అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా పరిశీలిస్తున్నారట. 34 నెలలుగా సాగుతున్న యుద్ధంలో రష్యా భారీగా సైనికులను కోల్పోయింది. దీంతో బలగాల కొరత ఏర్పడింది. పుతిన్ కోరనప్పటికీ తమ సైనికులను పంపారట కిమ్ జోంగ్ ఉన్. పరిస్థితుల రీత్యా పుతిన్ ఓకే చెప్పారట. అయితే, ప్రతిగా తమకు టెక్నాలజీ ఇవ్వాలని ఉ.కొరియా కోరుతోందట. ... ఎవరీ ఆంటోనీ? 20 వేల షిప్పింగ్ కంటైనర్లలో ఆయుధాలను తరలించినట్లు సమాచారం. వీటిలో దాదాపు 60 లక్షల శతఘ్ని గుండ్లు 122 ఎంఎం, 152 ఎంఎం రకాలున్నాయి. 100 హ్వాసంగ్-11 శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను రష్యాకు తరలించినట్లు పేర్కొంది. మరోవైపు ఉత్తర కొరియా-రష్యాల మధ్య రైళ్ల రాకపోకలు రికార్డు స్థాయిలో పెరిగాయట. తుమాన్‌గాంగ్-హాసన్ రైలు రాకపోకలు మూడు రెట్లు పెరిగాయి. రష్యా వాడుతున్న మందుగుండులో 60 ఉత్తర కొరియా తయారీనే.

## రెండు కుటుంబాల మధ్య చిచ్చు పెట్టిన కుర్‌కురే..




**న్యూఢిల్లీ-నవభూమి:** రూ.5 రూపాయల కుర్‌కురే కోసం రెండు కుటుంబాల మధ్య పెద్ద గొడవే జరిగింది ఈ ఘర్షణలో పదుల సంఖ్యలో గాయపడగా.. అరెస్ట్ భయంతో కొందరు గ్రామం నుంచి పరారయ్యారు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. దావణగెరె జిల్లాలోని చన్నగిరి తాలూకా హొన్నెబాగి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం మొదలైన ఈ గొడవ రెండు రోజుల వరకూ కొనసాగింది. గ్రామానికి చెందిన అతీఫ్ ఉల్లా కుటుంబం స్థానికంగా కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తుంటుంది. వారి దుకాణానికి దగ్గర్లోనే రోడ్డు పక్కన సద్దాం కుటుంబం హొటల్ నడుపుతుంటారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో సద్దాం కుటుంబానికి చెందిన చిన్న పిల్లలు.. అతీఫ్ దుకాణంలో కుర్‌కురే ప్యాకెట్ కొనుగోలు చేశారు. అయితే, గడువు దాటిన కుర్‌కురే అమ్మారంటూ సద్దాం కుటుంబం అతీఫ్ కుటుంబంతో గొడవకు దిగింది. ఇది కాస్తా ఘర్షణకు దారి తీసింది.ఇరు వర్గాలు కొట్టుకునే వరకూ వెళ్లారు. రెండు వాహనాల్లో వచ్చిన సుమారు 30 మంది దుకాణంలోకి ప్రవేశించి ధ్వంసం చేశారు. ఈ ఘటనతో ఆ గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ గొడవలో సుమారు 10 మంది గాయపడ్డారు. వారంతా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు చన్నగిరి పోలీస్ స్టేషన్‌లో ఇరు కుటుంబాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో అరెస్ట్ భయంతో సుమారు 25 మంది వరకూ గ్రామం విడిచి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై

## విజయవంతంగా వందే భారత్ స్లీపర్ ట్రయల్ రన్..



**గ్వాలియర్:-నవభూమి:** ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్యాసింజర్ ట్రెయిన్‌ను విజయవంతంగా పరీక్షించారు. మధ్యప్రదేశ్‌లోని కజురహో-ఉత్తరప్రదేశ్‌లోని మహోబా రైల్వే స్టేషన్ల మధ్య రెండు రోజులపాటు ట్రయల్‌రన్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం చెన్నై ఐసీఎఫ్ నుంచి కజురహో చేరిన వందేభారత్ స్లీపర్ రైలు.. శనివారం అక్కడి నుంచి మహోబాకు చేరుకున్నది. మరుసటి రోజు కజురహో నుంచి తిరిగి మహోబాకు వచ్చింది.

ఎస్ఆర్‌డీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో రైల్వే టెక్నికల్ టీమ్‌తోపాటు, ఐసీఎఫ్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా కజురహోకు వెళు న్న సమయంలో గంటకు 115 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన రైలు.. తిరుగు ప్రయాణంలో 130 కి.మీ. వేగంతో నడిచింది. ఈ సందర్భంగా అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించారు. అయితే వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు. కాగా ఈ రైలు వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకురావాలని ఇండియన్ రైల్వే భావిస్తున్నది. దీనికోసం పది రైళ్లను సిద్ధం చేస్తున్నది.వందే భారత్ స్లీపర్ రైలుకు చాలానే ప్రత్యేకలున్నాయి. విమానం తరహాలో ప్రయాణికులు ఈ రైలులో సౌకర్యాలుంటాయి. ఈ రైలు ముందు విలాసవంతమైన హొటల్స్ సైతం దిగదుడుపేనని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనున్నది. వందే భారత్ స్లీపర్ రైలులో ఒకేసారి 823 మంది ప్రయాణికులు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో ఒక ఫస్ట్ ఏసీ కోచ్, నాలుగు సెకండ్ ఏసీ, 11 థర్డ్ ఏసీ కోచ్‌లు ఉంటాయి.

## బైక్‌ను ఢీ కొట్టి ఈడ్చుకెళ్లిన ట్రక్కు.. ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు యువకులు..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అతివేగంగా వెళ్తున్న ట్రక్కు ముందు వెళ్తున్న బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. అనంతరం 100 మీటర్ల వరకూ అలాగే ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.ఆగ్రాలోని వాటర్ వర్క్స్ రోడ్డులో ఆదివారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తుండగా.. వెనుకనుంచి అతివేగంగా వస్తున్న ఓ ట్రక్కు వెనుక నుంచి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ క్రమంలో ట్రక్కు ముందు భాగంలో బైక్‌తోపాటు ఆ ఇద్దరు యువకులు చిక్కుకుపోయారు. ఓ యువకుడి తల ట్రక్ ముందు టైరుకు అడుగు దూరంలో ఉంది. ఆ ఇద్దరు యువకులు ప్రాణ భయంతో కాపాడండి అంటూ కేకలు వేస్తున్నా ట్రక్కు డ్రైవర్ అవేవీ పట్టించుకోకుండా వేగంగా వెళ్లసాగాడు.అటుగా వెళ్తున్న వాహనదారులు ఈ తతంగాన్నంతా గమనించి ట్రక్కును ఓవర్‌టెక్ చేసి ఆపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆ ఇద్దరు యువకులను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. పోలీసులు వచ్చే సరికి ఆ ట్రక్కు డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## హిమాచల్‌పై మంచు దుప్పటి.. జాతీయ రహదారులు సహా 170 రోడ్లు మూసివేత..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ కొండ ప్రాంతమైన హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా మంచు కురుస్తోంది . అక్కడ ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా మంచు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఎక్కడ చూసినా మంచు దిబ్బలే దర్శనమిస్తున్నాయి. ఇళ్లు, రహదారులు, వాహనాలు, చెట్లపై భారీగా హిమపాతం పడుతోంది. దీంతో ఆయా ప్రాంతాలు కనుచూపుమేర శ్వేత వర్ణం అలుముకున్నాయి.రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మనాలీ, రాజధాని సిమ్లా సహా తదితర ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. అక్కడ రోడ్లన్నీ శ్వేతవర్ణాన్ని తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా హిమపాతం పేరుకుపోయింది. దీంతో స్థానిక ప్రజలు, పర్యాటకులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మంచు పరిస్థితుల దృష్ట్యా అధికారులు పలు రహదారులను మూసివేశారు. మూడు జాతీయ రహదారులు సహా 174 రోడ్లను మూసివేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు.

## మనాలీలో భారీగా హిమపాతం.. చిక్కుకుపోయిన 1,000కి పైగా వాహనాలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాదిని మంచు దుప్పటి కప్పేసింది జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ లోని చాలా ప్రాంతాల్లో విపరీతంగా మంచు పడుతోంది. దీంతో ఆయా ప్రాంతాలు కనుచూపు మేర శ్వేత వర్ణంతో ఆకట్టుకుంటున్నాయి. ఎటుచూసినా మంచు దుప్పటి పరుచుకుని ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మనాలీ తోపాటు రాజధాని సిమ్లాలో దట్టంగా మంచు కురుస్తోంది. హిమపాతం భారీగా పడుతుండటంతో పర్యాటకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.విపరీతమైన మంచు కారణంగా రోహతంగ్ లోని సొలాంగ్ అటల్ టన్నెల్ మధ్య సోమ వారం రాత్రి దాదాపు వెయ్యికి పైగా వాహనాలు చిక్కుకుపోయాయి. దట్టంగా మంచు కురుస్తుండటంతో ముందు వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. 700 మందికిపైగా పర్యాటకులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## పాప్‌కార్న్‌పై జీఎస్టీ.. రేట్లపై విమర్శలు, వెక్కిరింతలు



న్యూఢిల్లీ-నవభూమి: పాప్‌కార్న్‌పై కేంద్రం నిర్ణయించిన కొత్త జీఎస్టీ రేట్లపై విమర్శలు, వెక్కిరింతలు వ్యక్తమవుతున్నాయి. శనివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాప్‌కార్న్‌పై కొత్త జీఎస్టీ రేట్లను నిర్ణయించారు. ఉప్పు, కారం, మసాలాలు కలిపిన నాన్ బ్రాండెడ్ పాప్‌కార్న్‌పై 5%, బ్రాండెడ్, ప్రీ-ప్యాక్డ్ పాప్‌కార్న్‌పై 12% జీఎస్టీ విధించారు. కారామెల్ పాప్‌కార్న్‌ను చక్కెర కలిపిన మిఠాయిగా పేర్కొం టూ 18% జీఎస్టీ నిర్ణయించారు.సులభంగా ఉండాల్సిన ట్యా క్స్ రేట్లను సంక్లిష్టంగా మార్చడాన్ని ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ మోహన్‌దాస్ పాయ్ తప్పుబట్టారు. ఈ సంక్లి ష్ట విధానం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతుందని మాజీ ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ విమర్శించారు. కొత్త జీఎస్టీ రేట్లను ఎద్దేవా చేస్తూ సోషల్ మీడియాలో మీమ్స్ వైరల్ అవుతున్నాయి. సాల్టెడ్ పాప్‌కార్న్‌కు 5%, కారామెల్ పాప్‌కార్న్‌కు 18% జీఎస్టీ అంటే రెండు కలిపిన వాటికి ఎంత జీఎస్టీ వర్తిస్తుందని ఓ నెటిజన్ ప్రశ్నించాడు.



## జీవబలం కోల్పోతున్న పుడమితల్లి

సృష్టిలోని సమస్త జీవరాశి మనుగడకు కావాల్సిన ఆహారాన్ని, ఆవాసాన్ని అందించేది నేల తల్లి. జీవనధాతువుగా నిలవాల్సిన ఆ నేలతల్లే మానవుని స్వార్ధపూరిత చర్యల వల్ల వెదజల్లబడుతున్న కాలుష్యం వల్ల తల్లడిల్లుతోంది. అభివృద్ధి పేరుతో మానవుడు చేపడుతున్న అనేక స్వార్ధపూరిత చర్యల వల్ల పర్యావరణం గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. వాతావరణంలోకి నిత్యం పెద్ద ఎత్తున విడుదలవుతున్న కలుషితాల వల్ల ఋతువులు గతి తప్పాయి. సహజవనరులు తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కోట్లాది ఎకరాల సాగు భూములు తమ సారాన్ని కోల్పోయి బీడు భూములుగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పచ్చిక బయళ్ళ ధ్వంసం కావటం వల్ల కూడా మేత లేక ఏటా లక్షలాది పశువులు మృత్యువాత పడుతున్నాయని, ఆ మూగ జీవాలను రక్షించుకోవాలంటే నేల క్షీణతను అరికట్టి, తిరిగి ఆ హరిత భూములను పునరుద్ధరించటం ఒకటే మార్గమని పర్యావరణవేత్తలు హితవు పలుకుతున్నారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం ప్రపంచ నేల దినోత్సవాన్ని 'నేలల సంరక్షణ : మెజర్, మానిటర్ అండ్ మేనేజ్' అనే థీమ్‌తో జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ప్రపంచ దేశాలను కోరింది.

భూమిని పుడమితల్లిగా పూజించే భారత్ వంటి దేశాలలో కూడా నేల క్షీణత, ఎడారీకరణ అత్యంత వేగవంతంగా సాగుతున్నాయి. వాతావరణ మార్పులు, మానవ ప్రేరిత చర్యల వల్ల భారతదేశంలో 32 శాతం నేల క్షీణతకు గురవుతుండగా, 25 శాతం భూమి ఎడారిగా మారిపోతుందని భారత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశంలో 2015 నుండి 2019 వరకూ అంటే నాలుగు సంవత్సరాల కాలంలో సుమారు 30.51 మిలియన్ హెక్టార్ల భూమి క్షీణతకు గురై బీడుబారిపోయిందని యున్కెటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ (యుఎన్‌సిసిడి) అనే సంస్థ తన నివేదికలో అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం 2019 నాటికే దేశ భూభాగంలో సుమారు 9.45శాతం భూమి క్షీణతకు గురయ్యింది. 2023లో యుఎన్‌సిసిడి విడుదల చేసిన తాజా నివేదికలో భారతదేశ జనాభాలో దాదాపు 18.39 శాతం మంది ప్రజలు భూక్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అహ్మదాబాద్‌లోని ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ 2021లో విడుదల చేసిన డిసర్టిఫికేషన్ అండ్ ల్యాండ్ డిగ్రేడేషన్ అట్లాస్ ఆఫ్ ఇండియా ప్రకారం దేశంలో సుమారు 96.40 మిలియన్ హెక్టార్లు భూమి అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 29.32 శాతం భూమి క్షీణతకు గురయ్యిందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 9రాష్ట్రాలలో భూమి క్షీణత అధికంగా కనిపిస్తుందని, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూ అండ్ కాశ్మీర్, కర్ణాటక, జార?ండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 23.95 శాతం భూమి క్షీణతకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. జార?ండ్, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాలలో విస్తీర్ణంలో 50శాతం కన్నా ఎక్కువ భూమి ఎడారీకరణకు గురవుతుంటే, కేరళ, అస్సాం, మిజోరం, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కేవలం 10 శాతం కన్నా తక్కువ విస్తీర్ణంలో భూములు ఎడారీకరణకు గురవుతున్నాయని ఈ నివేదిక తెలియచేసింది.

భారతదేశంలో ఎడారీకరణకు, నేల క్షీణతకు హరిత విప్లవం పేరుతో అనుసరించిన విధానాలు కూడా ఒక ప్రధాన కారణమే. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి సాధించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన హరిత విప్లవం నేడు నేలను నిర్జీవంగా మార్చే ప్రక్రియకు ప్రధాన కారణమవుతుంది. విచ్చలవిడిగా రసాయినిక ఎరువుల వినియోగం, యాంత్రిక వ్యవసాయీకరణ, ఏకరూపక వ్యవసాయ సంస్కృతి మన దేశానికి హరిత విప్లవం అందించిన విధానాలు. ఇవే ఇప్పుడు నేలతల్లి పాలిట శాపాలుగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా హరిత విప్లవ కాలంలో అనుసరించిన వ్యవసాయిక విధానాల వల్ల నేల నిర్మాణం పూర్తిగా మారిపోయింది. దీంతో పాటు అభివృద్ధి పేరుతో పెద్దయెత్తున సాగుతున్న అటవీ విధ్వంసం, అడ్డు అదుపూ లేకుండా సాగుతున్న పట్టణీకరణ వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (థేరీ) అంచనా ప్రకారం నేల క్షీణత వల్ల భారతదేశం ఏటా 48.8 బిలియన్ డాలర్ల మేరకు ఆర్థికంగా నష్టపోతుందని స్పష్టం చేసింది. భారతదేశం కూడా భూమి క్షీణతను తగ్గించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని 2015లో పారిస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమెట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సదస్సులో ప్రకటించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 26 మిలియన్ హెక్టార్ల నేలని తిరిగి పునరుద్ధరించే లక్ష్యంతో కాప్ పార్టీస్ చేపట్టిన బాన్ ఛాలెంజ్‌లో భారతదేశం భాగస్వామిగా చేరింది. అయితే దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎడారీకరణ, భూక్షీణతను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి ఒక స్పష్టమైన విధానం ఇప్పటికీ లేకపోవటం విచారకరం.

# అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాధికార పోరాటం



కుల వ్యవస్థ, అంటరానితనం, అస్పృశ్యత కోట్లాది ప్రజల జీవితాలకు మానవీయ హుందాను నిరాకరించాయి. ఇలాంటి వివక్షపూరిత సమాజంలో పుట్టిన ధ్రువతార డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. దళిత జాతులను కులం పేరుతో మంచినీటికి దూరం చేసిన అగ్రకుల సమాజానికి వ్యతిరేకంగా మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో 'మహాద్ చెరువు' పోరాటం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇది భారతదేశంలోనే మొదటి మానవ హక్కుల ఉద్యమం. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఆనేక కుట్రల వలన అవి ఆచరణ సాధ్యం కానప్పటికీ నేటి రిజర్వేషన్ వ్యవస్థకు మూలమైనవి.

1927లో అంబేడ్కర్ 'బహిష్కృత భారత్' అనే పత్రికలో తిలక్ అంటరానివాడిగా పుట్టి ఉంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అనేవాడు కాదు, అస్పృశ్యతా నివారణ నా ధ్యేయం, నా జన్మ హక్కు అని నినదించేవాడని రాశారు. అంబేడ్కర్ రాకతో అణచివేతపై దిగువ కులాల పోరాట ఉద్యమాలు ప్రాంతీయ పరిధిని దాటి జాతీయస్థాయికి విస్తరించాయి. అవి 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే నినాదాలతో అందరిని సంఘటితం చేశాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి సమస్యల పరిష్కారంలో గాంధీతో అంబేడ్కర్ విభేదించారు. అంటరాని కులాలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడనిదే వారి సమస్యలకు పరిష్కారం దొరకదని భావించారు. అందుకే వీరికి రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులను పొందుపరిచారు. భారత రాజ్యాంగ రచన కమిటీకి అధ్యక్షత వహించారు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రాశారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను అందులో చేర్చి 'భారత రాజ్యాంగ పిత'గా వెలుగొందాడు. పీడనకు గురైన వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్స్ కల్పించాడు. అగ్రకులాల కుట్రలు ఛేదించి అందిరికీ ఓటు హక్కును కల్పించి, రాజకీయ సమానత్వం సాధించాడు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా స్త్రీల ఆస్తి హక్కు కొరకు పోరాడారు. ఆయన అన్ని వర్గాల ప్రజల సమస్యలకు సబబైన పరిష్కారం చూపారు. జీవిత చరమాంకంలో అంబేడ్కర్ 'నా పుట్టుక నా చేతిలో లేదు కానీ, నా చావు నా చేతిలో ఉంది' అని ప్రకటించి హిందూ మతాన్ని వీడి మానవీయ విలువలతో కూడిన బౌద్ధాన్ని స్వీకరించారు. 1956 డిసెంబర్ 6న తుది శ్వాస విడిచారు.నేడు ప్రతి వ్యక్తికి అమ్మ జన్మనిస్తే... అంబేడ్కర్ రాజ్యాంగం జీవితాన్ని ప్రసాదిస్తుంది. ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంతరాలపై లక్ష పేజీల సాహిత్యాన్ని మనకు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప నాయకుడు. అందుకే ఐక్యరాజ్య సమితి అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా గుర్తించిది. ఆయన జయంతిని 'ప్రపంచ విజ్ఞాన దినోత్సవం'గా ప్రకటించడం మనందరికీ గర్వించ దగ్గ విషయం. కానీ, ఇప్పటికి ఆయనను దళిత నాయకుడుగా మాత్రమే సమాజం కీర్తించడం బాధాకరం. అన్నివర్గాలకు హక్కులు కల్పించిన విశ్వమానవుడు. నేడు మనమంతా రాజ్యాంగం కల్పించిన హక్కులతో విలాస జీవితాలు అనుభవిస్తున్నాము తప్ప, ఆయన ఉద్యమ రథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో విఫలమవుతున్నాము. అయినప్పటికీ అగ్రకుల పార్టీలు ఆర్థికంగా బలహీన వర్గాలకు 10శాతం %జుఔ% రిజర్వేషన్లు కల్పించుకొన్నాయి. ఇది వారి జనాభా కన్నా అధికం. అయినప్పటికీ వెనకడిన వర్గాలు ఈ విషయాన్నీ ప్రశ్నించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో దేశంలో మెజార్టీ జనాభా గల బీసీ, ఎస్సీ, ఎస్టీలు చేయాల్సింది రాజ్యాధికార యుద్ధం తప్ప, మరోటి కాదు. నేడు అన్నివర్గాల ఆత్మఘోషను వినిపించే భారత రాజ్యాంగ ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. అగ్రకుల పార్టీలు ఒకటై రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నంలో ఉన్నాయి. రాజ్యాంగ రక్షకులు ఒకవైపు... రాజ్యాంగాన్ని మార్చేందుకు సంకల్పించిన శక్తులు మరొకవైపుగా దేశ రాజకీయ యుద్ధం జరుగుతుంది. కావున ఎన్నికల్లో అగ్రకుల ఆధిపత్య పార్టీలకు వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికార యుద్ధం చేయాలి. అప్పుడే సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది. స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం అనే రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగుతుంది. అంబేడ్కర్ కోరుకున్నది కూడా అదే.

# కార్మికుల పెన్షన్ కార్పొరేట్ల పరం!




ఇరవై ఐదు సంవత్సరాల పాటు ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమలో పనిచేసి నెలకు ఏభై వేల రూపాయలకు పైగా జీతం పొందిన ఒక కార్మికుడు పదవీ విరమణ తర్వాత కేవలం రెండువేల రూపాయల లోపు మాత్రమే పెన్షన్ పొందడం నమ్మశక్యం కాని విషయం. కానీ ఇది వాస్తవం. ఇపిఎస్%-%95 పేరుతో దేశంలో ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం కార్మికుల పొదుపు సొమ్మును హరించి కార్పొరేట్లకు ధారాదత్తం చేసే విధాన ఫలితం.

మన దేశంలో కార్మికులకు ఉన్న హక్కులను ఒకటొకటిగా హరిస్తున్న వేళ విచిత్రంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులు కోరకుండానే వారికి ఒక పెన్షన్ పథకాన్ని చాలా ఉదారంగా ప్రవేశపెట్టింది. కార్మికులు వద్దన్నా వినలేదు. కనీసం ఇందులో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఇమ్మన్నా ఇవ్వలేదు. కార్మికులపై ఎందుకింత ప్రేమ అని కొద్దిగా పరిశీలిస్తే 1991 నుంచి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాలలో భాగమే ఈ పెన్షన్ పథకం అని సులువుగానే అర్థమవుతుంది.

1995లో నాటి పివి నరసింహారావు ప్రభుత్వం అప్పటివరకు అమలులో ఉన్న ఉద్యోగుల భవిష్య నిధి (పిఎఫ్) చట్టం 1952ను సవరించి, ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ ఇపిఎస్%-%95 పేరున ఒక కొత్త చట్టాన్ని చేసింది. ఈ పెన్షన్ చట్టం ప్రకారం అప్పటివరకు కార్మికుల భవిష్యనిధిలో ఉన్న యాజమాన్యం వాటా భాగం 8.33శాతం, ప్రభుత్వ వాటా 1.16 శాతం ఈ పెన్షన్ నిధికి మళ్ళించబడుతుంది. ఈ నిధి నుండి ప్రతినెల పిఎఫ్ డిపార్టుమెంట్ పెన్షన్లు చెల్లిస్తుంది.

ఈ పథకం వల్ల కార్మికులకు వచ్చే సంక్షేమం కంటే కార్మికులు పొదుపు సొమ్మును కోల్పోవడమే అధికంగా ఉంటుందని ఆనాడే కొన్ని కార్మిక సంఘాలు ముఖ్యంగా సిఐటియు వంటి కేంద్ర సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. కొన్ని యూనియన్లు దీనిపై దేశంలోని వివిధ రాష్ట్ర హైకోర్టులలో కేసులు కూడా వేశాయి. ఈ కేసులపై కొన్ని హైకోర్టులు ఈ పథకం అమలుపై స్టే ఉత్తర్వులు కూడా ఇచ్చాయి. ఈ కేసులన్నీ చివరకు సుప్రీంకోర్టుకు చేరాయి. దీనిని తరచూ సమీక్షిస్తూ ఉంటామని, పథకాన్ని మరింత పటిష్టపరుస్తామనే అనేక హామీలు ప్రభుత్వం ఇవ్వడంతో సుప్రీంకోర్టు ఈ పథకం అమలుకు అనుమతించింది. ఈ విధంగా కార్మికుల ఆమోదం లేకపోయినా, వివిధ యూనియన్లు ప్రతిఘటించినా ఈ పథకం 1995 నుండి అమలులోకి వచ్చింది.

ఈ పెన్షన్ పథకం ప్రత్యేకత ఏమిటంటే దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఎల్ఐసి, బ్యాంకు ఉద్యోగులకు, ఇతర సంస్థలలో ఉన్న పెన్షన్ పథకాలలోని ఒక్క అనుకూల అంశం కూడా ఇందులో లేకపోవడమే. వీటికి భిన్నంగా ప్రతికూలంగా ఉండే అనేక అంశాలు ఈ పథకంలో ఉన్నాయి.

ఉదాహరణకు మిగిలిన అన్ని పెన్షన్ పథకాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యం ఉండగా ఈ పథకంలో అది లేదు. అన్ని పెన్షన్ పథకాల్లోనూ పదవీ విరమణ సమయంలో పెన్షన్‌లోని కొంత మొత్తాన్ని కమ్యూట్ చేసుకుని, ఒకేసారి పెద్ద మొత్తాన్ని తీసుకునే అవకాశం ఉండగా, ఈ పెన్షన్ పథకంలో మాత్రం ఆ సదుపాయం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆఖరి నెల జీతం ఆధారంగా పెన్షన్ లెక్కిస్తే, ఈ పథకంలో మాత్రం కార్మికుని ఆఖరి అరవై నెలల జీతం సగటు తీసుకుని దాని ఆధారంగా పెన్షన్ లెక్కిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 సంవత్సరాల సర్వీసు పూర్తయితే పూర్తి పెన్షన్ పొందడానికి అర్హత రాగా, ఇక్కడ మాత్రం 33 సంవత్సరాల సర్వీసుకు గాని ఆ అర్హత రాదు. ఇలాంటి అనేక లోపాల వల్ల పెన్షన్ చాలా తక్కువగా ఉంటోంది.

పెన్షన్ పొందే జీతం పరిమితిని కూడా మొదట రూ.6,500గా నిర్ణయించారు. తరువాత దానిని రూ.15,000కు పెంచారు. పూర్తి జీతంపై హయ్యర్ పెన్షన్ అనుమతించాలని, సుప్రీంకోర్టు 2022 నవంబరులో తీర్పు ఇచ్చి రెండేళ్లు గడిచినా నేటికీ అమలు కాలేదు సరికదా ఈ పేరున పదిహేడున్నర లక్షల మంది పెన్షనర్ల నుండి రూ.1,86,920 కోట్లు వసూలు చేసి, ఆ సొమ్మును ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఇది పచ్చి దగా.

విచిత్రమేమిటంటే అనేక మందికి 100, 150, 200 రూపాయలు పెన్షన్ వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో చివరకు ప్రభుత్వం కనీస పెన్షన్‌ను వెయ్యి రూపాయలకు 2017లో పెంచింది. దీనివల్ల 36.4 లక్షల మంది లాభపడ్డారని ఘనంగా ప్రకటించుకుంది. కానీ దీన్ని బట్టే తెలుస్తున్నదేమిటంటే అంత మందికి అప్పటి వరకు వెయ్యి రూపాయల లోపే పెన్షన్ ఉందని. దీనికి ప్రభుత్వం సిగ్గు పడవలసింది పోయి, తిరిగి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమే. ఇప్పటికీ వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తున్నవారు కూడా ఉన్నారు. అత్యధికమందికి వచ్చే పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్ కంటే కూడా తక్కువగా ఉంటోంది.

2024లో ఈ పథకం ద్వారా 78.5 లక్షల మందికి పెన్షన్ చెల్లించారు. ఇందులో 46.6 శాతం మందికి వెయ్యి, అంతకంటే తక్కువబీ 85 శాతం మందికి రూ.2,500 లోపు మాత్రమే పెన్షన్ వస్తోందని వీరి గణాంకాలు తెలుపుతున్నాయి. ఐదు వేల రూపాయలకు పైగా పెన్షన్ పొందుతున్నవారు కేవలం 29,608 మందిబీ అంటే మొత్తం పెన్షన్ దారులలో కేవలం 0.37శాతం మంది. సగటు పెన్షన్ కేవలం రూ.1578 మాత్రమే. ఫలితంగా అనేకమంది పెన్షనర్లు కడు పేదరికంలో మగ్గుతున్నారు.

అందువల్లే దీని కార్పస్ ఫండ్ 2018లో 4లక్షల 37వేల కోట్ల రూపాయల నుంచి 2024 నాటికి 8లక్షల 88వేల కోట్లకు అంటే ఆరేళ్ల కాలంలో ఏకంగా రెట్టింపుకు పైగా పెరిగింది. ఈ సొమ్మును ప్రభుత్వం మిగిలిన పిఎఫ్ నిధులతో పాటు, వివిధ సంస్థలలో పెట్టుబడులుగా పెడుతోంది. ఇలా కార్మికుల పొదుపు కార్పొరేట్ల పాలవుతోంది. కార్మికుల ఖాతా నుంచి ఈ పెన్షన్ నిధికి మళ్లిస్తున్న సొమ్ము ఎంత, దానిపై వచ్చే వడ్డీ ఎంత, కార్మికునికి పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్ ఎంత, అనే ఈ మూడు అంశాలను పరిశీలిస్తే చాలా ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఇప్పుడు ఈ పెన్షన్ పొందే జీతం యొక్క గరిష్ఠ పరిమితి రూ.15వేలుగా ఉంది. అంటే కార్మికునికి రూ.15వేల జీతం నుండి ప్రతినెల 8.33శాతం చొప్పున పెన్షన్ ఫండ్‌కు అయ్యే జమ, ప్రభుత్వ వాటా 1.16శాతం కలిస్తే, ప్రతి నెల రూ.1420 చొప్పున 25 ఏళ్ల సర్వీసులో మొత్తం రూ.4,26,000. దీనిపై ప్రస్తుతం పిఎఫ్‌పై ఉన్న వడ్డీ రేటు 8.25 శాతం ఆధారంగా 25 ఏళ్ల చివరకు వచ్చే వడ్డీ రూ.10,25,725. అంటే%-% అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.14,51,725 అవుతుంది. దీనిపై ఇప్పుడు సీనియర్ సిటిజన్లకు బ్యాంకులలో ఉన్న వడ్డీ రేటు 8.4 శాతం రేటు చొప్పున నెలకు రూ.10,162 వడ్డీ వస్తుంది. కానీ నేడు ఇదే కార్మికుడికి ఈ పథకం ద్వారా వచ్చే గరిష్ఠ పెన్షన్ నెలకు కేవలం రూ.5,785 మాత్రమే. దీనర్థం ఏమిటంటే కార్మికుని పొదుపు సొమ్ముపై వచ్చే వడ్డీ కంటే కూడా తక్కువగా పెన్షన్ ఉంది. మరి అసలు పొదుపు సొమ్ము అంతా స్వాహా అవడం కాదా ఇది. దీనితో పాటు నాడు సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదు. సరికదా నాడున్న సౌకర్యాలనే కొన్నిటిని ఎత్తివేశారు. అందువల్ల దీన్ని కార్మికుల సంక్షేమం అనడం కంటే, కార్పొరేట్ల సంక్షేమ పథకం అనడం సబబుగా ఉంటుంది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పెద్దలు దీనిని సవరిస్తామని హామీ అయితే ఇచ్చారు కానీ, మూడోసారి అధికారం లోనికి వచ్చినా, ఇంకా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా దయాధర్మంగా ఏమీ పెన్షన్ ఇవ్వనవసరం లేదు. కార్మికుల పొదుపు సొమ్ము అయిన పెన్షన్ నిధి నుండే, అది కూడా దానిపై వచ్చే వడ్డీ నుండే వివిధ కార్మిక, పెన్షనర్ల సంఘాలు కోరుతున్నట్లుగా కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలకు పెంచడం, కరువు భత్యం చెల్లించడం, కమ్యూట్ చేసుకునే అవకాశం, ఐదేళ్లకు ఒకసారి పెన్షన్ సవరించడం వంటివి నిక్షేపంగా చేయవచ్చు. అయితే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే నయా ఉదారవాద విధానాలను మరింత స్పీడుగా అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం అలా చేస్తుందా అన్నదే అసలు ప్రశ్న. దేశానికి అనేక విధాలుగా సేవలందించిన, ఈ సీనియర్ సిటిజన్ల పొదుపును దోచుకోవడమే కాక, వారి న్యాయమైన డిమాండ్లను సైతం నిర్లక్ష్యం చేయడం క్షంతవ్యం కాదు. ఈ పని చేయకుండా సీనియర్ సిటిజన్లకు ఏదో చేసేశామని గొప్పలు చెప్పుకోవడం సభ్యత అంతకంటే కాదు.

# మనిషే ఒక సైన్యం



మనిషి గమ్యం చేరతాడు, ఒక లక్ష్యం ఉన్నప్పుడు. లక్ష్యం ఏర్పరచుకుంటాడు, సంకల్పం దృఢమైనప్పుడు. సంకల్పించుకుంటాడు, మంచి ఆలోచన రూపుదిద్దుకున్నప్పుడు. వీటన్నింటికీ మూలం ధర్మం. అది మనసులో పుట్టే కోరికలన్నింటికీ నిజమైన స్నేహితుడి వంటిది. తత్వోపదేశంలో గురువు వంటిది. యుద్ధరంగాన సైనికుడి వంటిది. ధనార్జనలో మంత్రి వంటిది. పోషణలో తల్లి వంటిది. ప్రయాణంలో తండ్రి వంటిది. చతుర్విధ పురుషార్థాల్లో ధర్మానిదే ప్రథమస్థానం. పోయేటప్పుడు మనిషి వెంట వచ్చేది ధర్మం ఒక్కటే!మనిషిలో ఉల్లాసం, ఉత్సాహం, ఆనందం, శాంతం, కార్యదీక్ష, సహనం తగ్గాయీ అంటే- అతడు ధర్మాన్ని విస్మరిస్తున్నాడన్న మాట. ధర్మం ఒక్కటే అతడికి అపూర్వమైన శక్తినిస్తుంది. అద్భుతమైన సంతృప్తి కలిగిస్తుంది.ఐహికమైన ఆనందాలు, సరదాలు చాలా ఉంటాయి. అవేమీ శాశ్వతాలు కావు. దైహిక వాంఛల వలలో పడితే, మనిషి అదే లోకమనుకుంటాడు. బావిలో కప్పలా మారతాడు. నశ్వర భోగభాగ్యాల్లో కొట్టుమిట్టాడుతుంటాడు. తన జీవితానికి అసలు కావాల్సిందేమిటి, ఎటు వెళ్లాలి, ఎలా వెళ్లాలి? ఈ ప్రశ్నలే ఉదయించవు అజ్ఞాని మనసులో! అటువంటి మనసు- తెగిన గాలిపటం. ఆకులు కప్పి ఉండే వూబి. వివేకం కొరవడినప్పుడు, మనసే మనిషిని సుడిగుండంలో పడేస్తుంది.హృదయ దౌర్బల్యాన్ని పిరికితనాన్ని విడిచి, కర్తవ్యం నిర్వహించేందుకు ముందుకు నడవాలని 'సాంఖ్యయోగం'లో అర్జునుడికి గీతాచార్యుడు చెబుతాడు. ఆ 'గీత' నుంచి ప్రేరణ పొందిన జాతిపిత బాపూజీ ఓ సందర్భంలో- 'నన్ను దైన్యం, నిరాశ, నిస్సత్తువ ఆవరించినప్పుడు గీతాపారాయణం చేస్తాను. గీతలోని ప్రతి శ్లోకమూ నాకు పోరాడే శక్తినిస్తుంది' అన్నారు.సీతకు దూరమైన స్థితిలో శ్రీరాముడు ఆత్మస్థైర్యంతో వ్యవహరించి, తన ధర్మనిర్వహణ చేశాడని వాల్మీకి ప్రశంసించాడు. అశోకవనంలో తల్లడిల్లిన సీతాదేవికి త్రిజట మాటలు, రామదూతగా హనుమ ఇచ్చిన ఆనవాలు ఎంతో ధైర్యమిస్తాయి. కష్టాలకు విసిగిపోని మనిషే ఎప్పటికైనా విజయం పొందగలడన్నది అక్షరసత్యమని హనుమతో ఆమె అంటుంది.లక్షలాది జీవరాశుల్లో దేనికీ లేని బుద్ధిని, మనసును మనిషికి భగవంతుడు ప్రసాదించాడు. ఆ బుద్ధి చేసే మార్గనిర్దేశనాన్ని మనసు అనుసరిస్తే చాలు- మనిషిని మించిన శక్తిమంతుడు ఉండడు. అతడు సర్వ శక్తిమంతుడన్నది యథార్థం. ధర్మం, కరుణ, సత్యం, ప్రేమ, అహింస, ధైర్యం తోడున్నంతవరకు అతడు సాధించలేని విజయమంటూ ఉండదు. ఎక్కలేని శిఖరమంటూ ఉండదు. ఎందరో ఇది వాస్తవమని నిరూపించారు. అనాదిగా వస్తున్న ఈ ఆర్షవాణిని ఆచరించడమే మనిషికి మంచి మార్గం చూపుతుంది. వృత్తిని దైవంగా, ప్రవృత్తిని ధర్మంగా భావించి ముందుకు సాగినప్పుడు- మనిషికి పరాజయమే ఉండదు, శత్రువులు ఉండరు. జ్ఞానం, దానం, శీలం అనే గుణాలు అతడికి అంగరక్షకుల్లా ఉంటాయి. మనిషిని చెడగొట్టేవి నాలుగు. అవి 'నేను, నాది, నువ్వు, నీది' అనే మాటలు. వాటికి మనసులో స్థానం ఇవ్వనంత వరకు, అతడు అజేయుడే! ఆధ్యాత్మిక నిబద్ధత లేని జీవితం- కవచం లేకుండా యుద్ధమైదానంలో నిలుచునే సైనికుడి లాంటిది. కోరికల్ని తగ్గించుకున్న కొద్దీ మానవుడికి నిబద్ధత పెరుగుతుంది. అదే అతడికి విజయకేతనం అందిస్తుంది. మనిషి సమాజంలో జీవిస్తున్నాడు. రుషులు ఒంటరిగా అడవుల్లో కూర్చుని సామాజిక శ్రేయస్సు కోసం తపస్సు చేశారు. సమాజం మధ్యనే బతుకుతుండే వ్యక్తి ప్రతి వస్తువుకూ ఇతరుల మీద ఆధారపడుతున్నాడు. ఆ కృతజ్ఞత అతడికి ఉండాలి. అప్పుడే ప్రేమ అంకురించి మహావృక్షమై విశ్వానికి సత్ఫలాలు ఇవ్వగలుగుతుంది. మనిషి జన్మ సార్థకమవుతుంది.

చేస్తున్న కొద్దీ పెరిగేది ధర్మం. ఇస్తున్న కొద్దీ పెరిగేది దానం. ఈ రెండూ మనిషి చేసే జీవనపోరాటంలో, అతడికి లభించిన దివ్యాస్త్రాలు. అప్పుడు మనిషి ఒంటరివాడు కాడు. అసహాయుడు అసలే కాడు. అనాథ అంతకన్నా కాడు. అతడికి ఎవరూ తోడు ఉండాల్సిన అవసరమూ లేదు. అతడే ఒక సైన్యం!

## మోడల్ స్కూల్స్‌లో...అడ్మిషన్స్



తెలంగాణలోని 194 మోడల్ స్కూల్స్‌లో ఆరు నుంచి పదో తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. 2025 జనవరి ఆరు నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఆరో తరగతిలోని అన్ని సీట్లను ఈ ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ఏడు నుంచి పదో తరగతి వరకు మాత్రం ఖాళీలను భర్తీ చేస్తారు. ఆసక్తిగల విద్యార్థులు రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారు మాత్రం రూ.125 చెల్లిస్తే సరిపోతుంది. పూర్తి వివరాల కోసం %https://telanganams.cgg.gov.in%/ వెబ్‌సైట్ చూడవచ్చు.

గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి ఉద్దేశించిన నోటిఫికేషన్ వెలువడింది. 2025 ఫిబ్రవరి 23వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఆన్‌లైన్‌లో రూ.100/- చెల్లించి దరఖాస్తు 2025 ఫిబ్రవరి 1 తేదీలోపు దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు. పాత జిల్లా ఒక యూనిట్‌గా తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రాస్పెక్టస్ కోసం %https://tgswreis. telangana.gov.in/, https://tgtwreis.telangana.gov.in/, http://tgcet.cgg.gov.in/ Ðϸ»Œý-ôÜÖ-sŒýÉ$ ^èþ*yö^èþ$a. Ìôý%§» %TGSWREIS 040&23391598, TGTWREIS 9491063511, MJPTBCREIS -040&23328266, TGREIS 040-¤%24734899 నెంబర్లను సంప్రదించవచ్చు.

# మీ చదువే మీ భవిత..

## గ్రామీణ బాలికల్లో అక్షరాల పట్ల ఆసక్తిని పెంచుతున్న సఫీనా హుస్సేన్



చదువు జీవితాల్ని మార్చగలదు. మూర్ఖపు సమాజాన్ని ఎదిరించే శక్తిని ఇవ్వగలదు. కాబట్టే, 'మీ చదువే మీ భవిత' అంటూ గ్రామీణ బాలికల్లో అక్షరాల పట్ల ఆసక్తిని పెంచుతారు 'ఎడ్యుకేట్ గర్ల్స్' వ్యవస్థాపకురాలు సఫీనా హుస్సేన్. కృత్రిమ మేధ సాయంతో అక్షర సేవ చేస్తున్న సఫీనాను ఇటీవల వరల్డ్ ఇన్నొవేషన్ సమ్మిట్ ఫర్ఎడ్యుకేషన్ (వైజ్) పురస్కారం వరించింది. ఆ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారతీయురాలు ఆమె.

కృత్రిమ మేధను కార్పొరేట్ వైద్యంలో వాడుతున్నారు. వాణిజ్య ప్రకటనల తయారీలో జొప్పిస్తున్నారు. మీడియా రంగంలోనూ ఉపయోగిస్తున్నారు. వీటివల్ల అంతిమంగా సంపన్నులు బాగుపడతారు. మరింత సంపన్నులు అవుతారు. కానీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను గ్రామీణ బాలికల కోసమూ ఉపయోగించవచ్చనీ, ఆ చిట్టితల్లులను బడిబాట పట్టించవచ్చనీ బలంగా విశ్వసించారు సఫీనా హుస్సేన్. ఆమె 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు.

జనాభా లెక్కలు, సామాజిక కార్యకర్తల సర్వేలు, స్వచ్ఛంద సంస్థల అధ్యయనాలు.. ఇలా రకరకాల మార్గాల్లో మన దగ్గర డేటా పోగవుతున్నది. వాటన్నిటినీ ఓ చోట చేర్చి.. కృత్రిమ మేధ సాయంతో వాస్తవాల్ని వెలికితీయవచ్చు. అక్షరాస్యత అతి తక్కువగా ఉన్న గ్రామాలెన్ని? బడి అంటే తెలియని బాలికల సంఖ్య ఎంత?' అన్నది నిగ్గుదేల్చవచ్చు. ఆ వివరాల ఆధారంగా కార్యకర్తలను ఆయా గ్రామాలకు పంపవచ్చు. కన్నవారిని ఒప్పించవచ్చు. అంతిమంగా పిల్లల్ని బడిబాట పట్టించవచ్చు. నిజమే, తిరుగులేని ఐడియా. ఓ గొప్ప మార్పు తీసుకురాగల ఆలోచన. ఆ ప్రభావమూ అపారమే.

దాదాపు ఇరవై ఒక్క వేలమంది వలంటీర్లు ఆ గణాంకాల ఆసరాతో గడపగడపకూ వెళ్తున్నారు. ఇప్పటికే, పద్నాలుగు లక్షలమంది అక్షరాలు దిద్దుకోని బడి వయసు పిల్లల్ని గుర్తించారు. తొలిదశలో ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్‌లోని ఇరవై నాలుగువేల గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మలిదశలో దేశమంతా విస్తరించే ఆలోచన ఉందని చెబుతారు సఫీనా. రానున్న పదేళ్లలో కోటిమంది బాలికలకు భరోసా ఇవ్వాలన్నది సంకల్పం. 'కృత్రిమ మేధకు తిరుగులేదు. నిజమే. కానీ దానికి మనిషి హృదయం తోడైనప్పుడే పరిపూర్ణ ఫలితాలు వస్తాయి. బాల్యం వికసిస్తుంది' అంటారు సఫీనా. ఆమె నేతృత్వంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ ముంబై కేంద్రంగా పనిచేస్తున్నది.



**మురికివాడల నుంచి**

సఫీనా సంపన్నుల ఇంట పుట్టలేదు. ఢిల్లీలోని ఓ మురికివాడలో జన్మించారు. ఇరుకిరుకు ఇళ్లు, నాలా ఒడ్డున నివాసాలు ఆమెకు కొత్త కాదు. పేదరికానికి చదువును మించిన పరిష్కారం లేదని నమ్ముతారామె. ఆ విశ్వాసంతోనే లండన్ స్కూల్ అఫ్ ఎకనమిక్స్ వరకూ వెళ్లారు. 'జీవితం విలువ తెలియనివారు, ఓ లక్ష్యమంటూ లేనివారు మన చుట్టూ ఉండటాన్ని మించిన శాపం లేదు. నా జీవితంలోనూ అదే జరిగింది. పేదరికం వల్ల చదువు ఆగిపోయింది. పెళ్లి చేసుకోమంటూ పోరుపెట్టారు. నేను తిరస్కరించాను. ఆరునూరైనా సరే, పెద్ద చదువులు చదువుకుంటానని చెప్పాను. ఆ ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్‌కు లొంగిపోయి ఉంటే.. నా జీవితం అక్కడితో ఆగిపోయేది. ఏ ఆడపిల్లకూ అలాంటి దుస్థితి రాకూడదని నా కోరిక. చదువుతో ఆత్మవిశ్వాసం వస్తుంది. సమస్యల్ని ఎదిరించే ధైర్యం సొంతం అవుతుంది. ప్రతి బాలికా బడికెళ్లాలని నేను పదేపదే కోరేది అందుకే' అంటూ గతాన్ని నెమరేసుకుంటారు సఫీనా. స్కాలర్‌షిప్‌లు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆమె చదువుకున్నారు.

**కార్పొరేట్ కెరీర్..**

లండన్‌లో చదువు పూర్తయిన తర్వాత కొంతకాలం సిలికాన్ వ్యాలీలోని ఓ స్టార్టప్‌లో పనిచేశారు సఫీనా. కానీ, ఆ కొలువు పెద్దగా సంతృప్తిని ఇవ్వలేదు. దీంతో నిరుపేదలకు వైద్య సేవలు అందించే ఓ ఎన్జీవోతో కలిసి పనిచేశారు. అప్పుడు, బడి బాట పట్టని బాలికల కోసం తనవంతుగా ఏమైనా చేయాలనే ఆలోచన వచ్చింది. 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్థాపించారు. రాజస్థాన్‌లోని ఓ పల్లెను బాలికా నిరక్షరాస్యతలేని గ్రామంగా తీర్చిదిద్దారు. 'ఇప్పటికి చాలా చోట్ల మేకల్ని ఆస్తిగా, ఆడపిల్లల్ని అప్పుగా భావించే మనుషులున్నారు.

ఎంత దురదృష్టకరం?' అంటారామె ఆవేదనతో. ఆ అపోహను వదలగొట్టడమే తన లక్ష్యమని అంతే స్థిరంగా చెబుతారు. సాంకేతికతను సాధనంగా వాడుకోవడం ఈ అక్షర యోధురాలికి కలిసొచ్చిన విషయం. టెక్నాలజీ పుణ్యమాని కచ్చితమైన డేటా అందుతున్నది. ఆ అంకెలతో నేరుగా నిరక్షరాస్య బాలికల గడప దగ్గరికే వెళ్తున్నారు. కన్నవారి మనసులు మారుస్తున్నారు. చిన్నారుల జీవితాన్ని తీర్చిదిద్దుతున్నారు. 'ఈ పదహారేండ్ల ప్రయాణంలో ప్రతి రోజూ అమూల్యమైందే. ప్రతి మార్పూ గుర్తుంచుకోదగిందే. ఎంతోమంది డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, సైంటిస్టులుగా, టీచర్లుగా పనిచేస్తున్నారు..' అని చెబుతున్నప్పుడు ఆమె కళ్లలో ఆనంద బాష్పాలు. గొంతుకలో తెలియని ఉద్వేగం.

ఆమె పేరు పవిత. రాజస్థాన్‌లోని ఓ గ్రామానికి సర్పంచ్. పంచాయతీ నిధులలో సగానికిపైగా విద్యా రంగానికే కేటాయిస్తారు. ప్రతి బాలికా బడికి వెళ్లాల్సిందేనంటూ ఏటా జూన్‌లో చాటింపు వేయిస్తారు. ఎవరికైనా ఆడపిల్లల పోషణ కష్టంగా ఉంటే తాను దత్తత తీసుకుంటానని మాటిస్తారు. ఇప్పటికే పదిమందిని తీసుకున్నారు కూడా. పూరి గుడిసెల్లో ఏకాగ్రతతో చదువుకునే అవకాశం ఉండదు కాబట్టి, ఇంటిగంట కొట్టగానే పంచాయతీ ఆఫీసుకు వచ్చేయమని సలహా ఇస్తారు. అక్కడే పాలు, ఫలహారం అందిస్తారు. పెద్ద చదువులకు సాయపడతారు. పదిహేనేండ్ల క్రితం.. సఫీనా హుస్సేన్ చొరవతో పవిత బడికెళ్లింది. డిగ్రీ వరకూ చదువుకుంది. రాజకీయాల్లోకి వచ్చింది.

# మక్కువతో మొదలై.. పరిశ్రమగా ఎదిగింది




ఆమె మక్కువతో నేర్చుకున్న జనపనార ఉత్పత్తుల తయారీ పని, వేల మందికి జీవనభృతిని కల్పించడానికి కారణమైంది. టిటిడి దేవస్థానానికీ, టప్పర్‌వేర్ కంపెనీకీ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి కూడా ఎదిగిపోయింది. ఆ వైనాన్నీ, జూట్ ఉత్పత్తుల శిక్షకురాలిగా తన అనుభవాల్నీ నవ్యతో ఇలా పంచుకుంది హైదరాబాద్‌కు చెందిన విక్టోరియా. ఆ ఆసక్తికరమైన విశేషాలు...

కుట్టు పనంటే నాకెంతో మక్కువ. ఆ మక్కువ కాస్తా జూట్ మీదకు మళ్లింది. దాంతో 17 ఏళ్ల క్రితం నేషనల్ జూట్ బోర్డులో జూట్ సంచుల తయారీలో శిక్షణ తీసుకున్నాను. నేర్చుకున్న రెండు నెలల నుంచే నేషనల్ జూట్ బోర్డు నిర్వహించే శిక్షణా తరగతులకు హాజరయ్యే వారికి శిక్షణ ఇవ్వడం కూడా మొదలుపెట్టాను. అలా కరీంనగర్, జగిత్యాల, మెట్టుపల్లి, ఖమ్మం మొదలైన ప్రాంతాల్లో వేల మందికి శిక్షణ ఇచ్చాను. ప్రభావన మల్టీ స్టేట్ విమెన్స్ జూట్ అండ్ ఫైబర్ ప్రొడక్ట్స్ కొఆపరేటివ్ సొసైటీ తరఫున ఏడేళ్లుగా వాళ్లు నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే వారికి శిక్షణనిస్తున్నాను. అంతకు ముందు వరకూ నేషనల్ జూట్ బోర్డు తరఫున శిక్షణ ఇచ్చాను. ప్రస్తుతం ప్రభావనలో శిక్షకురాలిగా పని చేస్తూనే ప్రొడక్షన్ పని కూడా చూసుకుంటున్నాను.

**అంధులకూ, ట్రాన్స్‌జెండర్స్‌కూ...**

నా దగ్గర జూట్ సంచుల తయారీ నేర్చుకుని, యూనిట్లు పెట్టుకునే స్థాయికి ఎదిగిన వాళ్లు చాలా మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్స్‌కూ, అంధులకూ కూడా సంచుల తయారీలో శిక్షణనిచ్చాను. ట్రాన్స్‌జెండర్స్‌కు నేర్పించే సమయంలో వాళ్ల మెప్పు పొందడం చాలా కష్టమని ఎంతో మంది నిరుత్సాహపరిచారు. కానీ సంచులు కుట్టడం దగ్గరి నుంచి సొంత వ్యాపారాలు నెలకొల్పే స్థాయికి ఎదిగే వరకూ మూడేళ్ల పాటు నేను వాళ్లతో ఉన్నాను. వాళ్లందరూ నన్ను అమ్మా అని పిలుస్తారు. నేను కూడా వాళ్లను పిల్లల్లాగే భావిస్తూ ఉంటాను. సాధారణంగా ట్రాన్స్‌జెండర్స్ అనగానే వాళ్లు మగవాళ్లు అనే భావన మనసులో కలుగుతుంది. కానీ నేను వాళ్లను మహిళల్లాగే పరిగణించి, అలాగే మెలగడంతో వాళ్లు నాకెంతో దగ్గరైపోయారు. ఒక ట్రాన్స్‌జెండర్ క్రిస్మస్ సందర్భంగా నాకోసం ఫలహారాలు, బియ్యం కూడా పంపించింది. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలోని యూనిట్‌లో అంధులకు కూడా నేను జనపనార సంచుల తయారీ నేర్పించాను. అంధులకు అర్థమయ్యేలా నేర్పించడం కోసం నేను కూడా కళ్లు మూసుకుని సంచులను కుట్టడం సాధన చేశాను. ఎలా వివరిస్తే అంధులకు సులువుగా అర్థమవుతుందో నాకు నేనుగా గ్రహించి వాళ్లకు నేర్పించాను. చేతులతో పట్టుకుని బ్యాగ్ సెంటర్ పాయింట్‌ను గుర్తించడం, అక్కడి నుంచి వేళ్లతో రెండంగులాలు కొలిచి హ్యాండిల్‌ను కుట్టడమెలాగో నేర్పించాను.

**ప్రసాదం సంచులు మావే!**

టిటిడి నుంచి మాకు విడతలవారీగా దాదాపు లక్ష సంచులు తయారు చేసి పంపించమని ఆర్డర్లు అందుతూ ఉంటాయి. ఇవన్నీ ప్రసాదం సంచులే! ప్రత్యేకించి తిరుపతి లడ్డుకు జనపనార అంటుకోకుండా ఉండడం కోసం, సంచి లోపల అల్యూమినియం ఫాయిల్‌ను కూడా ఏర్పాటు చేసి కుడుతూ ఉంటాం. ఈ సంచితో పాటు ఇతరత్రా ప్రసాదాలన్నిటికీ కలిపి ఒక పెద్ద సంచీ తయారుచేస్తాం. అలాగే విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కూ, టప్పర్‌వేర్ కంపెనీకీ పని చేస్తున్నాను. టప్పర్‌వేర్ లంచ్ బాక్సుల కవర్ల లోపల జనపనార లైనింగ్ కుట్టి అందిస్తూ ఉంటాను. జనపనార సంచులు ఆకర్షణీయంగా ఉండడంతో పాటు ఎక్కువ కాలం పాటు మన్నుతాయి. ప్లాస్టిక్‌లా కాకుండా మట్టిలో పూర్తిగా కలిసిపోతాయి. పర్యావరణ హితం పట్ల అందర్లో అవగాహన పెరగడంతో వీటికి గిరాకీ కూడా బాగా పెరిగింది. నలుగురికి ఉపయోగపడేవీ, పర్యావరణానికీ హాని కలిగించని ఉత్పత్తులను తయారుచేయడంతో పాటు, వాటి తయారీ నలుగురికీ నేర్పించి, జీవనభృతి కల్పించగలుగుతున్నందుకు నాకెంతో సంతృప్తిగా ఉంది.

**గోగుమల్ల కవిత**

మా వారు ఇమ్మానుయెల్ ఆనంద్ బాబు, అమెరికన్ రీసెర్చ్ సెంటర్‌లో ప్రోగ్రామర్‌గా పని చేశారు. ఆయన ఇప్పుడు లేరు. ఆయన ఉన్నన్ని రోజులు నేను ఇంటికే పరిమితమైపోయాను. పెద్దగా చదువుకోలేదు కాబట్టి కుట్టుపనితో కాలక్షేపం చేసేదాన్ని. ఆయన పోయిన తర్వాత, జూట్ ఉత్పత్తుల తయారీ నేర్చుకుని, శిక్షకురాలిగా మారిపోయాను. ఇప్పటికీ పండగలు, పెళ్లి వేడుకల సందర్భాల్లో నాకు ఆర్డర్లు వస్తూ ఉంటాయి. నాకు కూతురు, కొడుకు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. మా బాబు శామ్యుయెల్, స్నూకర్ బోర్డుల మరమ్మత్తు చేస్తూ ఉంటాడు.

# వేళకు తింటేనే భళా!



రోజులో అల్పాహారం చాలా ముఖ్యమైన భాగం. సుదీర్ఘ సమయం తర్వాత తీసుకునే ఆహారమిది. బ్రేక్‌ఫాస్ట్ సరిగ్గా ఉంటేనే శరీరం ఆ రోజు పనికి ఉత్సాహంగా సిద్ధమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత గంటలోపు అల్పాహారం తీసుకోవడం చాలా మంచిది. సమయం ప్రకారం.. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య టిఫిన్ చేయాలి. అప్పుడే అది ఒంట బడుతుంది. ఎప్పుడైనా ఆలస్యమైతే ఓకే! ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం పది గంటల లోపు బ్రేక్ ఫాస్ట్ ముగించాలని గుర్తుంచుకోండి. బ్రేక్‌ఫాస్ట్‌లో కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు సమృద్ధిగా అందాలి.

లంచ్ బెల్..అల్పాహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత భోజనానికి సరైన సమయం. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య భోజనం చేయాలి. ఆ సమయంలో శరీరం మంచి ఆకలి మీద ఉంటుంది. అప్పుడు తినే ప్రతి ముద్దా శరీరానికి శక్తినిస్తుంది. భోజనంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్స్, కాంప్లెక్స్ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

డిన్నర్ విన్నర్..రాత్రి నిద్రకు ఉపక్రమించడానికి రెండు గంటల ముందు డిన్నర్ చేసేలా చూసుకోవాలి. చీకటి పడినప్పుడు శరీర గడియారం చురుగ్గా మారుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. పాంక్రియాస్ కార్యాచరణ కూడా తగ్గుతుంది. పడుకోవడానికి పది నిమిషాల ముందు భోజనం చేస్తే%ొా% రక్తంలో చక్కెర పెరుగుతుంది. జీవక్రియలు కూడా మందకొడిగా సాగుతాయి. ఇది అధిక బరువుకు కారణం అవుతుంది. అందుకే, రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య డిన్నర్ చేస్తే.. మీరే విన్నర్.

# ఇరవైల్లోనే వ్యాయామం!

నేనింకా ఇరవైల్లో ఉన్నాను కదా నాకు వ్యాయామం అవసరమా అని చాలామంది అమ్మాయిలు తీసిపారేస్తుంటారు. కానీ ఆ అభిప్రాయం నిజం కాదట. ఎందుకో చూద్దాం...

ముప్పైదాటిన తర్వాత బరువు పెరుగుతున్నాం అనో, తీరైన ఆక ృతికోసమో వ్యాయామాలు మొదలుపెడతాం. వాస్తవానికి ఇరవైల్లో ఉండేవారు వ్యాయామాలు చేయడానికి అలాంటి కారణాలు అవసరంలేదు. మరి ఎందుకు చెయ్యాలి అంటారా? ఇరవైల్లో వ్యాయామాన్ని చేయడం వల్ల మన ఫిట్‌నెస్ జీవితానికి చక్కని పునాది వేసినవాళ్లం అవుతాం. పెద్దగా బాధ్యతలూ, ఒత్తిళ్లు లేని ఆ సమయంలో వ్యాయామాన్ని మొదలుపెట్టడం వల్ల శరీరం చక్కగా స్పందిస్తుంది. ముఖ్యంగా బద్ధకించకుండా జీవితాంతం వ్యాయామాన్ని మన జీవనశైలిలో భాగం చేసుకోవడానికి సాధ్యమవుతుంది. - ఈ వయసులో ఏ రకమైన వ్యాయామాలనైనా ప్రయత్నించడానికి ఆస్కారం ఉంటుంది. ఇది చేయాలి...ఇవి చేయకూడదు అనే నిబంధనలేం ఈ వయసుకి వర్తించవు. రకరకాల మేళవింపులని కూడా ప్రయత్నించవచ్చు. - ఇరవైల్లో వ్యాయామాన్ని మొదలుపెట్టడం వల్ల కండరాలు వ ృద్ధి చెందుతాయి. కొవ్వు పేరుకోకుండా ఉంటుంది. అదే ఆ వయసులో వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆస్టియోపొరోసిస్ రావడానికి ఆస్కారం ఉంది. ఈ వయసులో నడకతోపాటూ స్క్వాట్స్, చిన్‌అప్స్, పుషప్స్ మంచివి అంటున్నారు నిపుణులు.

# మసాలా ఆవడ

**కావల్సినవి:** సెనగపప్పు, కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు - అరకప్పు చొప్పున, జీడిపప్పు పలుకులు - పావుకప్పు, కొత్తిమీర, పుదీనా - కట్ట చొప్పున, పచ్చిమిర్చి - ఆరు, అల్లం - చిన్న ముక్క, కరివేపాకు - రెండు రెబ్బలు, వంటసోడా - పావుచెంచా, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా. తాలింపు కోసం: పెరుగు - మూడు కప్పులు, క్యారెట్ తురుము - పావుకప్పు, పచ్చిమిర్చి - రెండు, అల్లం తరుగు - చెంచా, ఉప్పు - తగినంత, ఆవాలు, మినప్పప్పు - చెంచా చొప్పున, నూనె - చెంచా కొత్తిమీర తరుగు- చెంచా. తయారీ: రెండు గంటల ముందుగా సెనగపప్పూ, మినప్పప్పూ, కందిప్పప్పూ, పెసరపప్పును నానబెట్టుకోవాలి. తరవాత నీళ్లు వంపేసి మెత్తని పిండిలా రుబ్బి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అలాగే జీడిపప్పూ, కొత్తిమీరా, పుదీనా, కరివేపాకూ, అల్లం, పచ్చిమిర్చి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని సెనగపప్పు ముద్దపై వేయాలి. అలాగే తగినంత ఉప్పూ, వంటసోడా కూడా వేసుకుని మరోసారి కలపాలి. ఈ పిండిని చిన్నచిన్న వడల్లా తట్టుకుని కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. వీటి వేడి కాస్త చల్లారాక వేడినీటిలో వేసి నిమిషమయ్యాక తీసేయాలి. ఈ వడల్ని ఇప్పుడు ఉప్పూ, అల్లంతరుగూ, పచ్చిమిర్చి ముక్కలూ కలిపిన పెరుగులో వేసుకోవాలి. బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేడిచేసి ఆవాలూ, మినప్పప్పు వేయించి దింపేయలి. ఈ తాలింపు వేడి చల్లారాక పెరుగుపై వేయాలి. చివరగా క్యారెట్ తురుమూ, కొత్తిమీరతో అలంకరిస్తే సరిపోతుంది.

# జీర్ణకోశ సమస్యలకు శత్రువులు



ఇరిటబుల్ బోవెల్ సింగ్రోమ్... ఈ జీర్ణకోశ సమస్య పెద్ద పేగులకు సంబంధించినది. ఈ సమస్య ఉన్నవాళ్లు తరచూ పొట్ట నొప్పి, అసౌకర్యం, మలబద్ధకం, విరోచనాలతో బాధపడుతూ ఉంటారు. అయితే ఐబిఎస్ ఉన్నవాళ్లు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే సమస్య అదుపులో ఉండే వీలుంది. వీళ్లు తినకూడదని పదార్థాలు ఏవంటే...

బీన్స్: సెనగలు, పప్పులు, బీన్స్ ఐబిఎస్ సమస్యను పెంచుతాయి. వీటి నుంచి వెలువడే వాయువులు జీర్ణ ప్రక్రియను బాధాకరంగా మారుస్తాయి. కాబట్టి వీటిని తీసుకోకపోవడమే మేలు. ఒకవేళ తినాలనిపిస్తే, తేలికగా అరిగేలా, మెత్తని ముద్ద రూపంలో తీసుకోవాలి.

వేపుళ్లు: వీటిని కొవ్వు ఎక్కువ కాబట్టి కడుపు ఉబ్బరిస్తుంది. కొన్ని సందర్భాల్లో విరోచనాలూ వేధిస్తాయి. కాబట్టి ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటివి తినాలనిపిస్తే వాటిని బేక్ చేయడం లేదా, గ్రిల్లింగ్ చేయాలి.

క్రూసిఫెరస్ కూరగాయలు: ఈ జాతికి చెందిన కూరగాయల్లో పీచు ఎక్కువ. నిజానికి జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే పీచు ఎక్కువగా ఉండే కూరగాయలకే ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ ఐబిఎస్ ఉన్నవాళ్లు ఈ రకం కూరగాయలు తినడం వల్ల, వాటిలో 'రాఫినోస్' అనే జీర్ణం కాని చక్కెరతో సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రొకొలి కూరగాయలకు దూరంగా ఉండాలి.

చక్కెర ప్రత్యామ్నాయాలు: చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడుకునే స్వీటెనర్లతో ఐబిఎస్ లక్షణాల తీవ్రత పెరుగుతుంది. పాలియోల్, సార్బిటాల్, క్జైలిటాల్, మానిటాల్ మొదలైన స్వీటెనర్లు రెడీమేడ్ ఫుడ్స్‌లో ఉంటాయి. ఇవన్నీ ఐబిఎస్ లక్షణాలను రెట్టింపు చేసేవే. కాబట్టి 'షుగర్ ఫ్రీ' అనే లేబుల్ ఉన్న రెడీమేడ్ ఆహారాలను మానేయాలి.

# బిజినెస్

## అమ్మకాల ఒత్తిడితో మళ్లీ నష్టాల్లోకి జారుకున్న మార్కెట్లు..!



**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. రూపాయి పతనంతో పాటు అమ్మకాల ఒత్తిడితో సూచీలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా మెటల్, పీఎస్‌యూలో అమ్మకాలు కనిపించాయి. అదే సమయంలో చివరి సెషన్‌లో సూచీలు అమ్మకాలతో పతనమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 78,707.37 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,877.36 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 78,397.79కి తగ్గింది. చివరకు 67.30 పాయింట్ల నష్టంతో 78,472.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 25.80 పాయింట్లు తగ్గి.. 23,727.65 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,907 షేర్లు లాభాల్లో సాగగా.. మరో 1,926 షేర్లు పతనమయ్యాయి.నిఫ్టీలో పవర్ గ్రిడ్ కార్ప్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, టైటాన్ కంపెనీ, ఎస్‌బీఐ నష్టాల్లో కొనసాగాయి. టాటా మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐషర్ మోటార్స్, బీపీసీఎల్, ఐటీసీ లాభాల్లో కొనసాగాయి.

సెక్టార్లలో ఆటో, ఎఫ్ఎంసీజీ, ఆయిల్, గ్యాస్ రంగాల షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. ఐటీ, మీడియా, మెటల్, పీఎస్‌యూ బ్యాంకులలో భారీగా అమ్మకాలు కనిపించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగింది. ఇక క్రిస్మస్ సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లు మూతపడనున్నాయి. గురువారం మళ్లీ యథావిధిగా కొనసాగనున్నాయి.




## ఇక వాయిస్, ఎస్ఎంఎస్‌లకు ప్రత్యేక ప్లాన్లు: ట్రాయ్




**న్యూఢిల్లీ-నవభూమి:** ఫీచర్ ఫోన్ యూజర్లు, వయో-గ్రామీణ కస్టమర్లను దృష్టిలో పెట్టుకొని టెలికం రెగ్యులేటర్ ట్రాయ్.. సోమవారం టారీఫ్ రూల్స్‌ను సవరించింది. దీంతో ఇకపై వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లతో కూడిన రిచార్జ్ వోచర్లను టెలికం సంస్థలు తప్పక అందుబాటులోకి తేవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ వినియోగదారులే లక్ష్యంగా రకరకాల డాటా ప్లాన్లను టెలికం కంపెనీలు పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ బండిల్డ్ ప్లాన్లలోనే అపరిమిత వాయిస్ కాల్స్‌ను, రోజుకిన్ని (100) ఎస్ఎంఎస్‌ల సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. అయితే డాటా వాడుకోని కస్టమర్లకు ఈ ప్లాన్లు భారంగా పరిణమించాయి. కాగా, రూ.10తోపాటు ఇతర డినామినేషన్లలో వాయిస్, ఎస్ఎంఎస్ వోచర్లనూ కొనసాగించాలని కంపెనీలకు ట్రాయ్ సూచించింది.

## హెూండా కొత్త ఎస్‌పీ 125 బైక్‌ని లాంచ్ చేసింది



**న్యూఢిల్లీ-నవభూమి:** హెూండా (హెచ్ఎంఎస్ఐ) సంస్థ దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త ఎస్‌పీ125 బైక్‌ను తీసుకొచ్చింది. డ్రమ్, డిస్క్ వేరియంట్లలో ఈ టూవీలర్ పరిచయమవగా, ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం డ్రమ్ వేరియంట్ ధర రూ.91,771గా, డిస్క్ వేరియంట్ రేటు రూ.1,00,284గా ఉన్నాయి.

## నిస్సాన్, హెూండా ఒక్క గూటికి.. ఎంవోయూ కుదుర్చుకున్న జపాన్ కంపెనీలు




**టోక్యో-నవభూమి:** జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటో రంగ సంస్థలు హెూండా, నిస్సాన్ ఒక్కటవుతున్నాయి. తాజాగా ఇరు కంపెనీలు ఓ అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఈ రెండింటి కలయికతో ఏర్పడబోయే కొత్త సంస్థ.. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటో రంగ సంస్థ కానున్నది. వాహన అమ్మకాలపరంగా టయోటా, ఫోక్స్‌వాగన్‌ల తర్వాత హెూండా-నిస్సాన్‌ల కంపెనీయే నిలువబోతున్నది.ప్రస్తుతం మూడో స్థానంలో హ్యుందాయ్-కియా గ్రూప్ ఉన్నది. 2026 ఆగస్టుకల్లా ఈ విలీనం పూర్తికావచ్చన్న అంచనాలున్నాయి. కాగా, ఈ మెగా విలీనంలో మిట్సుబిషి మోటర్స్ కూడా భాగం కాబోతున్నది. ఈ మేరకు టోక్యోలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పష్టమైన సంకేతాలొచ్చాయి. మిట్సుబిషిలో నిస్సాన్‌కు మెజారిటీ వాటా ఉన్న విషయం తెలిసిందే. చైనా, అమెరికా మార్కెట్లలో అమ్మకాల క్షీణత నేపథ్యంలో హెూండా, నిస్సాన్‌లు విలీనానికి సిద్ధపడడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఇప్పటికే ఉద్యోగ, ఉత్పత్తిలో కోతలకూ ప్లాన్ వేశాయి.

## మళ్లీ రూపాయి డౌన్

### 7 పైసలు దిగజారి 85.11 వద్దకు పతనం



**ముంబై-నవభూమి:** దేశీయ కరెన్సీ రూపాయి విలువ మళ్లీ పడిపోయింది. గత వారం ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారిన రూపీ.. ఆ తర్వాత బాగానే కోలుకున్నట్టు కనిపించింది. కానీ సోమవారం తిరిగి నష్టాల్లోకి జారుకున్నది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ వద్ద డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 7 పైసలు క్షీణించి 85.11 వద్ద ముగిసింది. శుక్రవారం 9 పైసలు కోలుకోగా.. అంతకుముందు రోజు గురువారం 19 పైసలు కోల్పోయి మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారి 85.13 వద్దకు మారకపు విలువ పతనం కావడం గమనార్హం.ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వచ్చే ఏడాది వడ్డీరేట్ల కోతల్ని తగ్గిస్తామని ప్రకటించిన దగ్గర్నుంచి ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్లకు డిమాండ్ మరింతగా పెరిగింది. దేశీయంగానూ దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెద్ద ఎత్తున ఆదరణ కనిపిస్తున్నది.ఫలితంగా డాలర్ ముందు రూపాయి ఏమాత్రం నిలువలేకపోతున్నదని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. అలాగే భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్‌లో పెరుగుతున్న ముడి చమురు ధరలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయంటూ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. నిజానికి ఉదయం 85.02 వద్దే మొదలైనా.. ఆఖర్లో మాత్రం ఇంకా రూపీ నేలచూపులు చూసింది.

# మార్కెట్లోకి వివో వై29 5జీ.. ధరెంతంటే..?!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ వివో తన వివో వై29 5జీ ఫోన్‌ను మంగళవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. 44వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5,500 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తోంది. ఈ మిడ్ రేంజ్ ఫోన్ 'మిలిటరీ గ్రేడ్' డ్యూరబిలిటీ కలిగి ఉంటుంది. దేశంలో నాలుగు ర్యామ్- స్టోరేజీ ఆప్షన్లలో లభిస్తుంది. వివో వై29 5జీ ఫోన్ 4 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.13,999, 6జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.15,499, 8 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.16,999, 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.18,999లకు లభిస్తుంది. ఎస్బీఐ కార్డు, ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్, యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర సెలెక్టెడ్ బ్యాంక్ క్రెడిట్ కార్డులపై కొనుగోలు చేసిన వారికి రూ.1,500 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉంది. రూ.1399తో ఈఎంఐ ఆప్షన్ కూడా ఉంది. దీంతోపాటు వీ-షీల్డ్ డివైజ్ ప్రొటెక్షన్ కూడా ఉంటది. డైమండ్ బ్లాక్, గ్లాసియర్ బ్లూ, టైటానియం గోల్డ్ రంగుల్లో లభిస్తుంది ఫోన్. వివో ఇండియా వెబ్‌సైట్ ద్వారా ఈ ఫోన్ కొనుగోలు చేయొచ్చు.

వివో వై29 5జీ (29 5+%) ఫోన్ ఆండ్రాయిడ్ 14 బేస్డ్ ఫన్ టచ్ ఓఎస్ 14 వర్షన్ పై పని చేస్తుంది. 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్ తోపాటు 6.68 అంగుళాల హెచ్డీ (720ఐ1608 పిక్సెల్స్) ఎల్‌సీడీ స్క్రీన్, 1000 నిట్స్ బ్రైట్ నెస్, 264 పీపీఐ పిక్సెల్ డెన్సిటీ ఉంటుంది. 6 ఎన్ఎం ఒక్టాకోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ఎస్వోసీ ప్రాసెసర్ తో పని చేస్తుంది. ర్యామ్ ను బట్టి వర్చువల్ గా అదనంగా 8 జీబీ ర్యామ్ పెంచుకోవచ్చు. మైక్రో ఎస్డీ కార్డు సాయంతో ఒక టిగా బైట్ వరకూ స్టోరేజీ కెపాసిటీ విస్తరించొచ్చు.వివో వై29 5జీ ఫోన్ 50-మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సర్, 0.08 మెగా పిక్సెల్ సెకండరీ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 8-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. డైనమిక్ లైటింగ్‌కు మద్దతుగా రింగ్ వంటి ఎల్ఈడీ ఫ్లాష్ యూనిట్ ఉంటాయి. 44 వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5500 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది ఫోన్. 79 నిమిషాల్లో 100 శాతం చార్జింగ్ అవుతుంది. సెక్యూరిటీ కోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటుంది. 5జీ, డ్యుయల్ బాండ్ వై-ఫై, బ్లూటూత్ 5.4, జీపీఎస్, ఓటీజీ, ఎఫ్ఎం, యూఎస్బీ టైప్ సీ పోర్ట్, 3.5 ఎంఎం ఆడియో జాక్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. యాక్సెలరో మీటర్, ఈ-కంపాస్, అంబియెంట్ సెన్సర్, ప్రాగ్జిమిటీ సెన్సర్ ఉంటాయి.

## దేశీయ స్టాక్ మార్కెట్‌లో భారీగా పెరిగిన ఇన్వెస్టర్లు.. 39 రెట్లు డీమ్యాట్ అకౌంట్లు పెరిగాయన్న ఎస్‌బీఐ రిపోర్ట్..!




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్ల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. దాంతో డీమ్యాట్ అకౌంట్ల సంఖ్య గణనీయంగా పెరగడాన్ని బట్టి తెలుస్తున్నది. గత పదేళ్లలో కొత్త డీమ్యాట్ అకౌంట్ల సంఖ్య 39 రెట్లు పెరిగిందని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. 2014లో దేశంలో 10లక్షల డీమ్యాట్ అకౌంట్లు తెరువగా.. 2024 అక్టోబర్ నాటికి రికార్డు స్థాయిలో 3.91కోట్లకు చేరింది. ఈ ఏడాది కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య నాలుగు కోట్లు దాటుతుందని అంచనా. 2021 క్యాలెండర్ ఇయర్ నుంచి ఏటా దాదాపు మూడుకోట్లకుపైగానే డీమ్యాట్ ఖాతాలు ఓపెన్ అవుతున్నాయని.. అంటే ఏటా పెద్ద సంఖ్యలో ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్‌లోకి చేరుతున్నట్లుగా నివేదిక పేర్కొంది. 2013-14లో 2.20 కోట్లుగా ఉన్న డీమ్యాట్ ఖాతాల సంఖ్య 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి 15 కోట్లు దాటుతుందని నివేదిక తెలిపింది. ఇందులో ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ల సంఖ్య 9.2 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు డీమ్యాట్ ఖాతాల సంఖ్య 17.76 కోట్లకు పెరిగింది.

మార్కెట్‌లో ఇన్వెస్టర్ల సంఖ్య పెరగడంతో 2013-14 ఆర్థిక సంవత్సరం నుంచి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (%చీూజు%) మార్కెట్ క్యాపిటల్ ఆరు రెట్లు పెరిగింది. 2013-24లో ఎన్ఎస్ఈ మార్కెట్ క్యాపిటల్ రూ.73,000 కోట్లు కాగా.. 2024-25 నాటికి అది రూ.441 లక్షల కోట్లకు పెరిగింది. ఎన్ఎస్ఈలో ఒక్కో ఇన్వెస్టర్ సగటు పెట్టుబడి ఒకటిన్నర రెట్లు పెరిగింది. 2013-14లో ప్రతి పెట్టుబడిదారుడు సగటున రూ.19,460 పెట్టుబడి పెట్టగా.. ఇప్పుడు అది 2024-25లో రూ.30,742కి ఎగిసింది. 2013-14 నుంచి 2024-25 అక్టోబర్ వరకు రైట్స్ ఇష్యూ, ఐపీఓ, ఇతర అంశాల ద్వారా 10 రెట్లు అధికంగా నిధులు సమీకరించారు. 2014లో ఇది రూ.12,008 కోట్లు కాగా, ఈ ఏడాది అక్టోబర్ నాటికి రూ.1.21 లక్షల కోట్లకు పెరిగింది. 2013-14లో మొత్తం 56 ఇష్యూలు జారీ చేయగా, ఇప్పుడు వాటి సంఖ్య 302కి పెరిగింది. వెస్ట్రన్ స్టేట్స్ అత్యధిక మూలధనాన్ని (54శాతం) సేకరించాయి. ఉత్తర భారతదేశానికి చెందిన కంపెనీలు 23.18శాతం మొత్తాన్ని సమీకరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 4.85 కోట్ల కొత్త సిప్ ఖాతాలు తెరవగా.. 2017-18లో వారి సంఖ్య 1.16 కోట్లుగా ఉంది. ఈ కాలంలో సిప్ ద్వారా పెట్టుబడి పెట్టిన మొత్తం 2017-18లో రూ.67,000 కోట్ల నుంచి రూ.1.85 లక్షల కోట్లకు చేరింది.

## అలర్ట్.. బ్యాంకులకు 4 రోజులు సెలవు




**న్యూఢిల్లీ-నవభూమి:** డిసెంబర్ ఈ వారం బ్యాంక్ సెలవులు 2024

చెక్ బుక్ పాస్ బుక్ వంటి అనేక పనులపై ప్రభావం..మీరు ఈ వారం ఏదైనా బ్యాంక్ పనికోసం వెళ్లాలని చూస్తున్నారా. అయితే ముందుగా ఈ వారం బ్యాంకు సెలవుల (%ఝఅని ప్త్రశీశ్రీఱఖఎం%) గురించి తెలుసుకోండి మరి. ఎందుకంటే రేపటి నుంచి వచ్చే నాలుగు రోజులు బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. అయితే ఏయే రోజుల్లో హాలిడే ఉంది. ఎన్ని రోజులు బ్యాంకులు బంద్ ఉంటాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. రేపు అంటే డిసెంబర్ 25, 2024న క్రిస్మస్ పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు. ఇక డిసెంబర్ 26న కూడా బాక్సింగ్ దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాలు కాకుండా పలు చోట్ల బ్యాంకులకు హాలిడే ఉంది.

**ఈరోజు మాత్రమే వర్కింగ్**

ఆ తర్వాత శుక్రవారం రోజు బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి. కానీ తర్వాత డిసెంబర్ 28, 2024న నాల్గో శనివారం, డిసెంబర్ 29, 2024న ఆదివారం బ్యాంకులకు హాలిడే. దీంతో మొత్తం ఈ వారంలో నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. మరోవైపు డిసెంబర్ 30న (సోమవారం): యు కియాంగ్ నంగ్‌బా పండుగ సందర్భంగా మేఘాలయలో బ్యాంకులు మూసివేయబడతాయి. డిసెంబర్ 31న (మంగళవారం): మిజోరం, సిక్కింలో నూతన సంవత్సర వేడుకలు/లాసాంగ్/నామ్‌సూంగ్ కారణంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది.

**ఏదైనా బ్యాంక్ పని ఉంటే**

ఈ నేపథ్యంలో మీకు ఏదైనా బ్యాంక్ సంబంధిత పని ఉంటే, ఈరోజు లేదా శుక్రవారం పూర్తి చేసుకోండి. ఎందుకంటే డిసెంబర్ చివరిలో చాలా రోజులు బ్యాంకులు మూసివేయబడతాయి. కాబట్టి ఈ సెలవుల గురించి తెలుసుకుని మీ పనులను ప్లాన్ చేసుకోండి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రతి నెలా విడుదల చేసే బ్యాంకు సెలవుల జాబితాలో జాతీయ, ప్రాంతీయ సెలవు రోజులు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల వారీగా సెలవుల ప్రకారం దేశవ్యాప్తంగా బ్యాంకులు మూసివేయబడతాయి.

**కానీ ఈ సేవలు మాత్రం..**

అయితే ఒక రాష్ట్రంలో బ్యాంకులకు సెలవు ఉంటే మరోచోట అదే సెలవులు ఉంటాయని కాదు. అయితే బ్యాంకులకు సెలవులు ఉన్నా కూడా వినియోగదారులు ఆన్‌లైన్ సేవల సహాయం తీసుకోవచ్చు. , మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలపై బ్యాంక్ సెలవులు ఎటువంటి ప్రభావం చూపవు. కాబట్టి బ్యాంక్ సెలవుల సమయంలో కస్టమర్‌లు ఆన్‌లైన్ సేవలను ఉపయోగించవచ్చు.

## వావ్.. మళ్లీ భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు



**ముంబై-నవభూమి:** దేశంలో చివరి నెల డిసెంబర్ మాసంలోని క్రిస్మస్ పండుగకు ముందు బంగారం, వెండి ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఇప్పటికే నిన్న తగ్గిన ఈ ధరలు, బులియన్ మార్కెట్లో ఈరోజు ఉదయం నాటికి పడిపోయాయి. ఈ క్రమంలో నేడు ఉదయం 6.20 గంటల నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 76,270కు చేరుకుంది. ఇది నిన్నటితో పోల్చితే 1,170 రూపాయలు తగ్గడం విశేషం.ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.69,914కు చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 76,000కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 69,667కు చేరింది. ఇక వెండి ధరల గురించి మాట్లాడితే కిలో వెండి ధర రూ. 88,760గా ఉంది. ఇది నిన్నటితో పోల్చితే రెండు వేల రూపాయలు తగ్గింది. దీంతో దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో బంగారం, వెండి ధరల గురించి ఇప్పుడు చూద్దాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)

హైదరాబాద్‌లో రూ. 76,250, రూ. 69,896
విజయవాడలో రూ. 76,250, రూ. 69,896
ఢిల్లీలో రూ. 76,270, రూ. 69,914
చెన్నైలో రూ. 76,350, రూ. 69,988
ముంబైలో రూ. 76,130, రూ. 69,786
వడోదరలో రూ. 76,230, రూ. 69,878
కోల్‌కతాలో రూ. 76,030, రూ. 69,694
బెంగళూరులో రూ. 77,190, రూ. 69,84

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కిలోకు)

ముంబైలో రూ. 88,910
చెన్నైలో రూ. 89,170
బెంగళూరులో రూ. 88,980
హైదరాబాద్‌లో రూ. 89,060
విజయవాడలో రూ. 89,060
చెన్నైలో రూ. 89,170
విశాఖపట్నంలో రూ. 89,060
కోల్‌కతాలో రూ. 88,800
ఢిల్లీలో రూ. 88,760
ముంబైలో రూ. 88,910
వడోదరలో రూ. 89,030

22, 24 క్యారెట్ల మధ్య తేడా మీకు తెలుసా?

బంగారం స్వచ్ఛతను గుర్తించేందుకు (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్క్ ఇస్తారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను 22 క్యారెట్ల బంగారంలో 9% కలిపి ఆభరణాలు తయారు చేస్తారు. 24 క్యారెట్ల బంగారం విలాసవంతమైనది అయినప్పటికీ, దీనిని ఆభరణాలు తయారు చేయడానికి ఉపయోగించుకోలేరు. అందుకే చాలా మంది దుకాణదారులు 22 క్యారెట్ల బంగారం విక్రయిస్తారు.

## ఇన్సూరెన్స్.. క్లెయిమ్ తిరస్కరణ తక్కువగా ఉన్న కంపెనీ ఇదే!




**న్యూఢిల్లీ-నవభూమి:** అత్యవసర సందర్భాల్లో ఆర్థిక ఆలంబన కోసం అనేక మంది ఇన్సూరెన్స్ తీసుకుంటారు. చేతిలో సొమ్ము ఖర్చు కాకూడదని జాగ్రత్త పడతారు. ఈ క్రమంలో ఇన్సూరెన్స్ సంస్థ తమను అత్యవసర సందర్భాల్లో ఆదుకుంటుందన్న నమ్మకంతో ప్రీమియంలు కడుతుంటారు. కానీ, పాలసీకొనుగోరుదారులు చేసే ప్రతి క్లెయిమ్‌ను ఇన్సూరెన్స్ సంస్థలు అంగీకరించవు. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ కంపెనీల క్లెయిమ్‌ల తిరస్కరణ శాతాలను వివరిస్తూ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబీఏఐ) తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది ఈ నివేదిక ప్రకారం, క్లెయిమ్ టూ సెటిల్మెంట్ రేషియో (మొత్తం క్లెయిమ్స్‌లో ఎన్నింటికి సంస్థ డబ్బులు చెల్లించిందనే నిష్పత్తి) 2022-23 ఆర్థిక సంవత్సరంలో 86 శాతంగా ఉంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఒక శాతం తగ్గింది. ఇక జనరల్ ఇన్సూరెన్స్ కేటగిరీలో మొత్తం కేసుల్లో క్లెయిమ్ తిరస్కరణ రేటు 6 శాతం పెరిగింది. మోటార్, హెల్త్, ఫైర్, మెరీన్ కార్గో ఇన్సూరెన్సులు జనరల్ ఇన్సూరెన్స్ కేటగిరీలోకి వస్తాయన్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ఇన్సూరెన్స్ సంస్థ న్యూ ఇండియా ఎసూరెన్స్‌లో క్లెయిమ్ తిరస్కరణ శాతం అత్యంత తక్కువగా కేవలం 0.2 శాతం ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. తిరస్కరణ రేటు తక్కువగా ఉన్న భారీ ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థల్లో హెడ్‌డీఎఫ్‌సీ ఎర్గో, ఫ్యూచర్ జనరాలీ, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ వంటివి ముందంజలో ఉన్నాయి.

**ఏపీ, తెలంగాణ ఎంఎస్ఎంఈలపై దృష్టి**

ఇన్సూరెన్స్ కంపెనీలు తమ క్లెయిమ్ సెటిల్మెంట్లు, తిరస్కరణల సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఐఆర్‌డీఏ నిబంధన విధించింది. ఈ సమాచారం ఆధారంగా ఐబీఏఐ తాజా నివేదిక విడుదల చేసింది. పాలసీ హెూల్డర్స్ హ్యాండ్‌బుక్ పేరిట విడుదల చేసిన ఈ నివేదికలో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను నాలుగు రకాలుగా వర్గీకరించారు. ప్రభుత్వ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలు, భారీ ప్రైవేటు రంగ సంస్థలు, ఇతర ప్రైవేటు జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలు, ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలుగా వర్గీకరణ చేసి వివరాలను పొందుపరిచారు. అయితే, హెల్త్ ఇన్సూరెన్స్ కేటగిరీలో కూడా క్లెయిమ్ సెటిల్మెంట్ రేషియో (95%) అత్యధికంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థగా న్యూ ఇండియా అసూరెన్స్ నిలిచింది. ఇక స్టాండ్ అలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కేటగిరీలో నెం.1 స్థానంలో ఉన్న ఆదిత్య బిర్లా హెల్త్ 95 శాతం సందర్భాల్లో పాలసీ దారులకు డబ్బు చెల్లించింది (సెటిల్మెంట్ రేషియో). 90 శాతం క్లెయిమ్ - సెటిల్మెంట్ రేషియోతో ఇఫ్కో, బజాజ్ అలయాన్జ్ సంస్థలు భారీ ప్రైవేటు రంగ సంస్థల కేటగిరీలో ముందు వరుసలో ఉన్నాయి.

**శ్రేయాస్‌కు మహా కుంభ మేళా ప్రకటనల హక్కులు**

అయితే, హెల్త్‌ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించి గ్రూప్ (కార్పొరేట్), వ్యక్తిగత పాలసీలను కలిపి ఈ సెటిల్మెంట్ రేషియోల డాటాను లెక్కించారు. దీనిపై నిపుణులు పలు ప్రశ్నలు సంధిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఇచ్చే గ్రూప్ పాలసీల్లో సెటిల్మెంట్ రేషియో ఎప్పటి నుంచో ఎక్కువగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. వ్యక్తిగత హెల్త్ పాలసీల వివరాలను ప్రత్యేకంగా ఎందుకు వెల్లడించట్లేదని, ఎవరి కోసం ఈ సమాచారంపై గోప్యత పాటిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

నిపుణులు చెప్పేదాని ప్రకారం, పాలసీ తీసుకునే సమయంలో తెలిసో తెలియకో తప్పుడు సమాచారం ఇవ్వడం, లేదా అసంపూర్ణ సమాచారం ఇస్తే క్లెయిమ్స్ తిరస్కరణకు గురవుతాయని చెబుతున్నారు. ఇక, ఇన్సూరెన్స్ పాలసీలపై 18 శాతం జీఎస్టీ విధించడంలో ఔచిత్యాన్నీ కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ మౌలిక వైద్య వసతులు దిగదుడుపుగా ఉన్న నేటి తరుణంలో ఈ స్థాయి జీఎస్టీ ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

## వాయిస్, ఎస్ఎంఎస్‌లకే రీచార్జ్ వోచర్లు : ట్రాయ్



**న్యూఢిల్లీ-నవభూమి:** టెలికాం ఆపరేటర్ల టారిఫ్ వోచర్ల నిబంధనలనూ టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ సవరించింది. కంపెనీలు ఇక డేటా అవసరం లేని చందాదారులకు వాయిస్, ఎస్ఎంఎస్‌లకు ప్రత్యేక రీచార్జ్ వోచర్లు జారీ చేయాలని స్పష్టం చేసింది. స్పెషల్ రీచార్జ్ కూపన్ల గడువును కూడా ప్రస్తుత 90 రోజుల నుంచి 365 రోజుకు పెంచింది. ప్రతి టెలికాం ఆపరేటర్ 365 రోజుల చెల్లుబాటయ్యేలా వాయిస్, ఎస్ఎంఎస్‌ల కోసం తప్పనిసరిగా కనీసం ఒక ప్రత్యేక టారిఫ్ వోచర్ జారీ చేయాలని స్పష్టం చేసింది. డేటా అవసరం ఉన్నా లేకపోయినా కంపెనీలు వాయిస్, ఎస్ఎంఎస్‌లతో కలిపి తమకు అంటగడుతున్నాయని చందాదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో ట్రాయ్ ఈ చర్య తీసుకుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7
హైదరాబాద్
బుధవారం
25 । డిసెంబర్ । 2024





## ఉద్యోగాలివ్వరు కానీ.. దరఖాస్తులపై జీఎస్టీ వేస్తారా?

**న్యూఢిల్లీ-నవభూమి:** యువతకు ఉద్యోగాలివ్వడం చేతకాని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఉద్యోగ నియామక దరఖాస్తు ఫారాలపైనా జీఎస్టీ వసూలు చేస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. అగ్నివీర్‌తో సహా మిగిలిన ఉద్యోగ నియామకాల దరఖాస్తు ఫారాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తోందని 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కల్యాణ్ సింగ్ సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని పలు ఖాళీల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌ను షేర్ చేసి పోస్టు చేశారు. అందులో దరఖాస్తు ఫీజుతో పాటు దానిపై జీఎస్టీ వేసిన విషయాన్ని ప్రస్తావించారు. నోటిఫికేషన్‌లో అన్ రిజర్వ్‌డ్, ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ క్యాటగిరీల వారికి 1,000, ఎస్సీ/ఎస్టీలకు రూ.600 దరఖాస్తు ఫీజు ఉండగా.. దానిపై జీఎస్టీ 18% ఉంది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చెమటోడ్చి తమ పిల్లలను చదివిస్తున్నారని, కానీ బీజేపీ ప్రభుత్వం వారి కలలను కల్లలు చేస్తోందని ప్రియాంక విమర్శించారు. కేంద్రం పేదల ఆశలను పెట్టుబడిగా మార్చుకుంటోందని దుయ్యబట్టారు. ఫీజు కట్టి పరీక్షలు రాస్తే, చివరికి పేపర్ లీకేజీలతో అవినీతి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## సీఎంపై పోటీకి దిగుతున్నదెవరంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**'ఇండియా' కూటమిలో జాతీయ స్థాయిలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్ ఆమ్ ఆద్మీ పార్టీ )లు రాబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తున్నాయి. 'ఆప్' ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ రెండో జాబితాలో 27 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. ఆప్ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి )పై పార్టీ సీనియర్ నేత అల్కా లంబాను కాంగ్రెస్ కల్కాజి నియోజకవర్గం నుంచి పోటీకి దింపుతోంది. అల్కా లంబా 2015లో 'ఆప్' టిక్కెట్టుపై చాందినీ చౌక్ నుంచి గెలిచారు. 2019లో పార్టీ నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్‌లో చేరారు.

కాగా, "ఆప్"కు దీటుగా మేనిఫెస్టో రూపొందించేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోందని ఆ పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం, 400 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అనేవి పార్టీ మేనిఫెస్టోలో చేర్చనున్నట్టు చెబుతున్నారు. మేనిఫెస్టోకు తుదిరూపం ఇచ్చేందుకు ఢిల్లీ కాంగ్రెస్ సోమవారంనాడు ఒక సమావేశం నిర్వహించింది.

తొలి జాబితాలో..కాంగ్రెస్ ఇటీవల 21 మందితో పార్టీ అభ్యర్థుల తొలిజాబితా విడుదల చేసింది. మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్‌ను న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీకి దింపింది. ప్రస్తుతం ఈ నియోజకవర్గానికి ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2013లో ఇదే నియోజకవర్గం నుంచి షీలా దీక్షిత్‌ను కేజ్రీవాల్ ఓడించి తొలిసారి ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. కాగా, తొలి జాబితాలో కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేంద్ర యాదవ్ (బద్లీ నియోజకవర్గం), హరూన్ యుసుఫ్ (బల్లిమారన్), అభిషేక్ దత్ (కస్తూర్బా నగర్), ద్వారక (ఆదర్శ్ శాస్త్రి), మాజీ ఎంపీ జేపీ అగర్వాల్ కుమారుడు ముదిత్ అగర్వాల్ (చాందినీ చౌక్) తదితరులు ఉన్నారు.

ఫిబ్రవరిలో ఎన్నికలు..ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 2025 ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్నారు. గత ఎన్నికలు 2020 ఫిబ్రవరిలో జరిగాయి. ఎన్నికల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మూడోసారి సీఎం పగ్గాలు చేపట్టారు. ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి 2025 ఫిబ్రవరి 15వ తేదీతో ముగియనుంది.

## దిండివనం వద్ద పట్టాలపై పగుళ్లు



**చెన్నై:-నవభూమి:** దిండివనం సమీపంలో రైలు పట్టాలపై పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని ఆ మార్గంలో వెళ్తున్న పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్(గుర్తించి, రైలు ఆపివేయడంతో ఘోర ప్రమాదం తప్పింది. ఎగ్మూరు రైల్వేస్టేషన్ నుంచి సోమవారం ఉదయం 6 గంటలకు పుదుచ్చేరి రైలు బయలుదేరింది. ఆ రైలు దిండివనం(సమీపం ఓంకూర్ వద్ద వెళ్తుండగా రైలింజన్ చక్రాల కింద పెద్ద శబ్దం వినిపించింది. దీంతో లోకో పైలట్ బ్రేకులు వేసి రైలు నిలిపివేశారు.

కిందకు దిగి పట్టాలను పరిశీలించగా ఓ చోట పగుళ్లు కనిపించాయి. వెంటనే ఆయన రైల్వే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. రైల్వే ఇంజనీర్లు, కార్మికులు హుటాహుటిన అక్కడికి వెళ్ళిన పట్టాలు పగిలిన చోట మరమ్మతులు చేపట్టారు. సుమారు గంట తర్వాత పట్టాల మరమ్మతులు పూర్తయ్యాయి. అప్పటివరకూ రైలులో ఉన్న ప్రయాణికులంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంట తర్వాత ఆ రైలు పుదుచ్చేరి( వైపు బయలుదేరింది.

## టెకీ దారుణం! బాస్‌తో గడపాలంటూ భార్యపై ఒత్తిడి! ఆమె ఒప్పుకోలేదని..



**న్యూఢిల్లీ-నవభూమి:**మహారాష్ట్రలో తాజాగా షాకింగ్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. పార్టీలో బాస్‌తో గడిపేందుకు తన భార్య ఒప్పుకోకపోవడంతో ఓ టెకీ ఆమెకు ట్రిపుల్ తలాక్ ఇచ్చాడు. దీంతో, అతడిపై భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శంభాజీనగర్‌లో ఈ ఘటన వెలుగు చూసింది.జాతీయ మీడియా కథనాల ప్రకారం, నిందితుడికి 45 ఏళ్లు కాగా అతడి భార్య వయసు 28. ఈ ఏడాది జనవరిలోనే వారికి వివాహమైంది. ఆ తరువాత కొద్ది నెలలు ఇద్దరూ సంతోషంగానే ఉన్నారు. ఆ తరువాత నుంచి అతడు భార్యను పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని వేధించసాగాడు. మొదటి భార్యకు విడాకులు ఇచ్చేందుకు రూ.15 లక్షలు తేవాలని కోరాడు. ఇదిలా ఉంటే..డిసెంబర్ 19న అతడు భార్యతో పాటు ఓ పార్టీకి హాజరయ్యాడు.పార్టీలో బాస్‌తో గడపాలంటూ భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు ఆమె తిరస్కరించింది. ఆ తరువాత ఆమెకు వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. పుట్టింటి నుంచి మరిన్ని డబ్బులు తేవాలంటూ ఒత్తిడి తెచ్చాడు. ఆమె మళ్లీ నిరాకరించడంతో అతడు చివరకు ఆమె ట్రిపుల్ తలాక్ ఇచ్చేశాడు. దీంతో, బాధితురాలు శంభాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 115(2), 351(2), 351(3), 352 కింద కేసు నమోదైంది. బాస్‌తో గడపనందుకు భర్త తనపై చేయి చేసుకున్నట్టు కూడా బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ట్రిపుల్ తలాక్ ఇచ్చిన తరువాత తనను ఇంట్లోంచి గెంటేసినట్టు కూడా వెల్లడించింది.ట్రిపుల్ తలాక్‌ను భారత ప్రభుత్వం 2019లో నిషేధించిన విషయం తెలిసిందే. ఈ తరహా విడాకులు రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీం కోర్టు 2017లో చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. అనంతరం, 2019లో ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. 2019 ఆగస్టు 1 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. అయితే, ఈ తరహా ఉదంతాలు అడపాదడపా వెలుగు చూస్తున్నాయి,.

## సెకనుకు రెండు బిర్యానీలు ఆర్డర్.. 97లక్షలపైగా చికెన్ బిర్యానీలు ఆర్డర్ చేసిన హైదరాబాదీలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**అది పార్టీ అయినా.. సందర్భం ఏదైనా అందరికీ మొదట గుర్తుకు వచ్చేది బిర్యానియే. ఈ వంటకం భారతీయులకు ఇష్టమైన ఎంపికగా నిలిచింది. ఈ క్రమంలో ఆన్‌లైఫుడ్ ఫుడ్ డెలివరీ రంగంలోనే బిర్యానీనే టాప్ ప్లేస్‌లో నిలుస్తూ వస్తున్నది. తాజాగా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది స్విగ్గి. వరుసగా తొమ్మిదో సంవత్సరం ఆన్‌లైన్ ఆర్డర్లలో బిర్యానీ అగ్రస్థానంలో నిలిచి.. భారతీయులకు ప్రియమైన వంటకంగా నిలిచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 22 వరకు 8.3 కోట్ల బిర్యానీలు ఆర్డర్ చేయగా.. ప్రతి నిమిషానికి 158 బిర్యానీలు, సెకనుకు రెండు బిర్యానీలు ఆర్డర్ చేశారు.

దీని తర్వాత, దోస 2.3 కోట్ల ఆర్డర్‌లతో రెండవ స్థానంలో నిలిచింది. స్విగ్గి 'ఫుడ్ ట్రెండ్ రిపోర్ట్' ప్రకారం.. బిర్యానీ వరుసగా తొమ్మిదవ సంవత్సరం అత్యధికంగా ఆర్డర్లు సాధించింది. 4.9లక్షల చికెన్ బిర్యానీ ఆర్డర్లు వచ్చినట్లుగా పేర్కొంది. ఇందులో హైదరాబాదీలు అత్యధికంగా చికెన్ బిర్యానీని 97 లక్షలకుపైగా ఆర్డర్ చేశారు. ఆ తర్వాత 77 లక్షల ఆర్డర్లతో బెంగళూరు రెండో స్థానంలో, 46 లక్షల ఆర్డర్లతో చెన్నై మూడో స్థానంలో నిలిచాయి. రాత్రి సమయంలో ఎక్కువగా తిన్న ఫుడ్‌లలో చికెన్ బర్గర్ నిలిచింది. రాత్రి 12 నుంచి 2 గంటల మధ్య 18.4లక్షల చికెన్ బర్గర్ ఆర్డర్లు వచ్చాయని స్విగ్గీ రిపోర్ట్ పేర్కొంది.

ఇక మసాలా దోసలో బెంగళూరు ఆధిపత్యాన్ని కొనసాగించింది. బెంగళూరు వాసులు జనవరి ఒకటి నుంచి నవంబర్ 22 మధ్య 25లక్షల దోసెలను ఆర్డర్ చేశారు. ఢిల్లీ, చండీగఢ్, కోల్‌కతాలో చోలే, ఆలూ పరాఠా, కచోరీలకు ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి. ఇక బెంగళూరుకు చెందిన ఓ స్విగ్గీ యూజర్ ఏకంగా ఏడాదిలో పాస్తా కోసం రూ.49,900 వెచ్చించాడు. దాదాపు 55 ఫెటుక్సిన్ ఆల్ఫ్రెడో, 40 మాక్, చీజ్.. 30 స్పఘెట్టి కోసం ఆర్డర్ పెట్టాడు.

ఈ ఏడాది లంచ్ కోసం కంటే డిన్నర్‌కి 29శాతం ఎక్కువగా 21.5 కోట్లు ఆర్డర్లు వచ్చాయి. 24.8 లక్షల ఆర్డర్‌లతో చికెన్ రోల్ అత్యంత ఇష్టపడే స్నాక్‌గా నిలిచింది. 16.3 లక్షల ఆర్డర్లతో చికెన్ మోమోస్ రెండో స్థానంలో, 13 లక్షల ఆర్డర్లతో పొటాటో ఫ్రైస్ మూడో స్థానంలో నిలిచాయి. నివేదిక ప్రకారం, %ాఉఱస్త్రస్త్రవ% డెలివరీ బాయ్స్ మొత్తం 1.96 బిలియన్ కిలోమీటర్లు ప్రయాణించారు. ఈ లెక్కన కశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు 5.33లక్షల సార్లు ప్రయాణించడంతో సమానమని పేర్కొన్నారు. ముంబయికి చెందిన కపిల్ కుమార్ పాండే అత్యధికంగా 10,703 ఆర్డర్‌లను డెలివరీ చేశారు. కోయంబత్తూరుకు చెందిన కాళీశ్వరి ఎం మహిళ 6,658 ఆర్డర్‌లను డెలివరీ చేసి అగ్రస్థానంలో నిలిచినట్లు నివేదిక పేర్కొంది.

## భారీగా కురిసిన మంచు.. చిక్కుకున్న వెయ్యి వాహనాలు, పర్యాటకులు



**న్యూఢిల్లీ-నవభూమి:**అసలే చలికాలం. ఇదే సమయంలో చలి ప్రదేశమైన హిమాచల్ ప్రదేశ్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ క్రమంలోనే మంచు కారణంగా సోమవారం రాత్రి అటల్ టన్నెల్ సమీపంలో దాదాపు వెయ్యి వాహనాలు నిలిచిపోయాయి.హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా కురుస్తున్న తెల్లటి మంచు దుప్పటితో కష్టాలు పెరుగుతున్నాయి. విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా మనాలి సోలాంగ్ నాలా, అటల్ టన్నెల్ మధ్య సుమారు 1000 వాహనాలు నిలిచిపోయాయి. రాత్రి నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అటల్ టన్నెల్ నుంచి మనాలిలోని సోలాంగ్ నాలా వరకు లేహ్ మనాలి జాతీయ రహదారిపై మంచు భారీగా కురిసింది. దీంతో వాహనాలు జారిపోయి సొరంగం దగ్గర అనేక వాహనాలను ఆపవలసి వచ్చింది. ఇదే సమయంలో మంచు దృష్యాలను చూసేందుకు అక్కడికి చేరుకున్న పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు.మరికొంత మంది అటల్ టన్నెల్ సమీపంలోని లాహౌల్ స్పితి సందర్శనకు వెళ్లాలని చూసిన పర్యాటకులను పోలీసులు నిలిపివేశారు. ఆ తర్వాత హిమపాతంలో చిక్కుకున్న పర్యాటకులను పోలీసులు రక్షించారు. లాహౌల్ స్పితిని సందర్శించేందుకు సోమవారం మనాలికి 12 వేల మంది పర్యాటకులు వచ్చారు. ఆ సమయంలో పర్యాటకులు అటల్ టన్నెల్, కోక్సర్, సిస్సు ఇతర ప్రాంతాలకు చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం తరువాత వాతావరణం మారిపోయింది. పర్యాటకులందరూ అక్కడ చిక్కుకుపోయారు. లాహౌల్ స్పితి పోలీసుల నుంచి అందిన సమాచారం ప్రకారం డిసెంబర్ 23న ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మొత్తం 6178 వాహనాలు సొరంగం దాటాయి. ఇందులో 3530 వాహనాలు పర్యాటకులవి.

మంచు కురుస్తున్న నేపథ్యంలో
రోడ్లపై మంచు కారణంగా కొన్ని ప్రదేశాలలో రోడ్లు బ్లాక్ చేయబడ్డాయి. కొన్ని చోట్ల వాహనాలు జారడం ప్రారంభించాయి. ఫలితంగా దక్షిణ పోర్టల్ నుంచి ఉత్తర పోర్టల్ ఆఫ్ అటల్ టన్నెల్ వరకు వెయ్యి మందికి పైగా పర్యాటకులు మంచులో చిక్కుకున్నారు. పోలీసులు రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి వాహనాలను తప్పించారు. దీంతో మైదాన ప్రాంతాల్లో చాలా మంది డ్రైవర్లు మంచు కురుస్తున్న సమయంలో వాహనాలు నడపలేక పోవడంతో వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.సాయంత్రం హిమపాతం ప్రారంభమైన వెంటనే మనాలి వైపు వెళ్లాలనుకునే పర్యాటకులను ఆపివేశారు. అదే సమయంలో బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు మంచు మీద డ్రైవింగ్ చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీని కారణంగా వారి వాహనాలు జారిపడి ఇరుక్కుపోతున్నాయి. దీంతో సొరంగం దగ్గర చాలాసేపు ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు 1000 వాహనాలు ఇక్కడ నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. సొరంగ మార్గం నుంచి మనాలి వైపు సోలాంగ్ నాలా వరకు చాలా చోట్ల వాహనాలు జారిపోయాయి. అతి కష్టం మీద వాహనాలకు క్రమంగా దారి మళ్లించారు. రాత్రంతా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. ఆ తర్వాత హిమపాతంలో చిక్కుకున్న పర్యాటక వాహనాలను రక్షించగలిగారు.

## బెలగావి వేదికగా సీడబ్ల్యూసీ సమావేశాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** జాతిపిత మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వేదికపై ఈ సారి సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ వెల్లడించారు. మంగళవారం న్యూఢిల్లీలో కేసీ వేణుగోపాల్ విలేకర్లతో మాట్లాడుతూ.. డిసెంబర్ 26, 27 తేదీల్లో కర్ణాటకలోని బెలగావి వేదికగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాలు బెలగావిలో జరగనున్నాయని తెలిపారు.

ఈ సమావేశాలను నవ్ సత్యాగ్రహ బైఠక్ అని పిలుస్తున్నామని పేర్కొన్నారు. ఇక డిసెంబర్ 27వ తేదీ ఉదయం 11.30 గంటలకు జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ పేరిట ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ ర్యాలీకి ఏఐసీసీ సభ్యులతోపాటు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని ఆయన వివరించారు. ఇక 27వ తేదిన మధ్యాహ్నం 2.30 గంటలకు మహాత్మాగాంధీ నగర్‌లో ఈ సీడబ్ల్యుసీ సమావేశానికి 200 మంది శాశ్వత ఆహ్వాని తులు, ప్రత్యేక ఆహ్వానితులు, రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు, సీఎల్పీ నేతలతోపాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులు సైతం హాజరుకా నున్నారని తెలిపారు. 1924, డిసెంబర్ 26వ తేదీన మహాత్మా గాంధీ నేతృత్వంలో కర్ణాటకలోని బెలగావిలో సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వంద ఏళ్ళ అనంతరం అదే స్ఫూర్తితో ఈ సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.ఇటీవల పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత, బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖలతోపాటు దేశవ్యాప్తంగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలపై చర్చించనున్నారు. అలాగా ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదా సైతం దక్కించుకొంది. దీంతో భవిష్యత్తులో పార్టీ అనుసరించవలసిన వ్యూహంపై చర్చించనున్నారు. అధికార ఎన్డీయేను ఎలా ఎదుర్కోవాలి... రానున్న ఢిల్లీ అసెంబ్లీలో ఒంటరిగా బరిలో దిగుతోన్న వేళ.. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశాలపై ఈ సందర్భంగా పార్టీ నేతలు చర్చించనున్నారని తెలుస్తోంది.కేంద్ర హోం శాఖ మంత్రి రాజీనామా చేయ్యాలని.. అలాగే ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. అలాంటి వేళ.. పార్లమెంట్‌లో రెండు రోజుల పాటు దీనిపై చర్చను ఏర్పాటు చేశారు.ఆ క్రమంలో అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని పిలవడం ఫ్యాషన్ అయిపోయిందంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. అన్ని సార్లు దేవుడి పేరు తలిస్తే.. స్వర్గం లోకం సంప్రాప్తిస్తోందంటూ ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. అమిత్ షా రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశాయి. ఆ క్రమంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల దాడితోపాటు నిరసనలు సైతం చేపట్టారు.

## ముస్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు బాహాబాహీ



**చండీగఢ్-నవభూమి:**పార్లమెంటు వెలుపల ఇటీవల అధికార బీజేపీ, విపక్ష ఎంపీల మధ్య బాహాబాహీకి దిగిన సంఘటన ఇంకా సద్దుమణగక ముందే చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో ఇదే తరహా ఘటన పునరావృతమైంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వ్యవహారం కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. దీంతో ఇరువర్గాల వారు ఆగ్రహంతో ఒకరినొకరు నెట్టుకుంటూ కలబడ్డారు. ఈ వ్యవహారం మొత్తం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది.

రాజ్యసభలో గతవారం రాజ్యాంగంపై జరిగిన చర్చల్లో అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు గాను అమిత్‌షా రాజానామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, ఆప్ ఒక తీర్మానాన్ని మున్సిపల్ సమావేశంలో ఆమోదించాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, ఆప్ మధ్య పొత్తు ఉంది. ఈ రెండు పార్టీలు చేసిన తీర్మానంపై బీజేపీ కౌన్సిలర్లు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపైకి దూసుకువచ్చారు. ఉభయవర్గాలు ఒకరినొకరు నెట్టుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది. తమ చర్యలు సీసీటీవీలో రికార్డవుతాయని తెలిసినా కొందరు కౌన్సిలర్లు ఏమాత్రం వెనక్కితగ్గకపోవడం కనిపించింది. అంబేద్కర్ పట్ల అమిత్‌షా అగౌరవంగా ప్రవర్తించారని విపక్ష పార్టీ కౌన్సిలర్లు ఆరోపించగా, బీజేజీ నేతలు ఆ వ్యాఖ్యలతో విభేదించారు.కాగా, అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై పార్లమెంటు వెలుపల కాంగ్రెస్ ఇటీవల పలు రీతిల్లో నిరసనలు తెలిపింది. ఈ క్రమంలోనే అధికార, విపక్ష పార్టీ ఎంపీల మధ్య బాహాబాహీ చోటుచేసుకోవడంతో ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడ్డారు. తమ నేత మల్లికార్జున్ ఖర్గేను కూడా నెట్టేశారంటూ కాంగ్రెస్ ఆరోపించారు. దీనిపై రెండు పార్టీలు పార్లమెంటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు నమోదు చేశాయి.

## నోటికొచ్చినట్లు మాట్లాడారు.. మహిళ అని సానుభూతి కూడా చూపలేదు



**బెంగళూరు:నవభూమి:** విధాన పరిషత్‌లో బీజేపీ సభ్యుడు సీటీ రవి అనుచితమైన వ్యాఖ్యలతో అవమానం జరిగిందని మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌విచారం వ్యక్తం చేశారు. బెళగావిలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మహిళ అనే కనీస సానుభూతి లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడి సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని సీటీ రవిపై మండిపడ్డారు. రెండురోజులపాటు ఇంటినుంచి బయటకు రాలేదని కనిపించినవారందరికీ ఏమని చెప్పుకోవాలని, ఓ మహిళగా ఎంత కుమిలిపోయానో తనకే తెలుసన్నారు.చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నకిలీ ఎన్‌కౌంటర్ పదాలు వాడుతున్నారన్నారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు తనకు జరిగిన అవమానంపై లేఖలు రాస్తానన్నారు. అవకాశం లభిస్తే రాష్ట్రపతి, ప్రధానిని భేటీ అవుతానని, పరిషత్ నిండుసభలో జరిగిన అవమానాన్ని వివరిస్తానన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీకి సిద్ధంగా లేనని, న్యాయపోరాటం చేస్తానన్నారు. కాగా సీటీ రవి వ్యాఖ్యానించినట్లుగా ఉండే ఆడియోను మంత్రి విడుదల చేశారు.పరిషత్‌లో జరిగిన ఘటనకు పోలీసుల జోక్యం చేసుకోరాదని పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి మండిపడ్డారు. సోమవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, సీటీ రవిల వివాదం ముగిసిన అధ్యాయమన్నారు. 19వ తేదీనే సభలో రూలింగ్ చేశానని, సభను నిరవధికంగా వాయిదా వేశామన్నారు. సభలో జరిగే సంఘటనలపై పోలీసులు జోక్యం చేసుకోరాదన్నారు. పంచనామా చేసేందుకు పోలీసులు కోరారని, తాను అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిషత్ తలుపులు వేశామని, పంచనామా చేసేందుకు వీలుండదన్నారు.

బయట అంశాలపై తాను జోక్యం చేసుకోనన్నారు. సభ జరిగే సమయంలో ఎటువంటి వివాదం లేదని కలాపాలు ముగిశాక జరిగే వివాదంలో తమకు సంబంధం లేదన్నారు. సీటీ రవి అరెస్టుతో తమకు నేరుగా సంబంధం లేదన్నారు. ఆడియో రికార్డు కాలేదని, సాక్ష్యాలు మాత్రమే ఉన్నాయన్నారు. రికార్డులు పరిశీలించామని, ఆడియోలో ఎటువంటి విషయాలు లభించలేదన్నారు. ఇద్దరి నుంచి ఫిర్యాదు తీసుకున్నానన్నారు. ఆరోజు రాత్రి ఒంటి గంట వరకు సీటీ రవితో మాట్లాడానన్నారు. నగర పోలీస్ కమిషనర్‌తో చర్చించానన్నారు. పరిషత్ ప్రాంగణలో సభ్యుడు సీటీ రవిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, కమిషనర్‌లకు సూచించానన్నారు.

పరిషత్ ప్రాంగణంలో సభ్యుడు సీటీ రవిపై దాడికి పాల్పడిన సంఘటనకు హిరేబాగేవాడి పోలీసులు సుమోటోగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈమేరకు వీడియోలు, ఫొటోల ఆధారంగా వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే సీటీ రవిపై అదే రోజు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు పరిపాలనా కేంద్రం సువర్ణసౌధలో సీటీ రవిపై దాడి సంబంధించి కేసు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి స్పందిస్తూ బెళగావి పోలీస్ కమిషనర్ హోదాకు అనర్హుడని మండిపడ్డారు. కాగా తన ఫిర్యాదుకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు కాకుంటే చలో బెళగావి యాత్ర చేస్తానని సీటీ రవి తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీవి కల్లబొల్లి మాటలు.. ఆ జిల్లాకు వారు చేసిందేమీ లేదు...



**బెంగళూరు- నవభూమి:** కాంగ్రెస్ నేతలు చెప్పేవి కల్లబొల్లి మాటలని, హాసన్ జిల్లాకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని, సీడీలు విడుదల చేయడమే వారి గొప్ప అని కేంద్రమంత్రి కుమారస్వామి ఎద్దేవా చేశారు. హాసన్ జిల్లాలో సోమవారం కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. జిల్లాకు దేవెగౌడ కుటుంబం చేసింది ఏమిటని ఇటీవల డీసీఎం డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు.హాసన్ జిల్లాకు కాంగ్రెస్ నాయకులు ఏం చేశారని తిరిగి ప్రశ్నించారు. సీడీలు విడుదల చేసి ఎంతో సాధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాసన్ అభివృద్ధి అనేది దేవెగౌడ రాజకీయ ప్రారంభం నుంచి కొనసాగించిన రోజునుంచే జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. వీరు ఓ ఫ్లై ఓవర్ సాధించలేదని, సిగ్గు లేకుండా మాట్లాడతారన్నారు. తాను సీఎంగా ఏమి చేశాననేది జిల్లాలో అందరికీ తెలుసునన్నారు. పలు అభివృద్ధి పనులకు తన హయాంలోనే శ్రీకారం చుట్టానన్నారు. తమ కుటుంబం ప్రజల సొమ్మును లూటీ చేయలేదన్నారు.ప్రకృతిని లూటీ చేసిన వారెవ్వరనేది అందరికీ తెలిసిందేనన్నారు. దొంగే దొంగ..దొంగ..అన్నట్లుగా కాంగ్రెస్ నేతల మాటలు ఉన్నాయన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామిచన్నరాయపట్టణ తాలూకాలోని దేవీరమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు ఆలయాలను సందర్శించారు. అనంతరం కాఫీ రైతులతో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్‌తో కలసి పాల్గొన్నారు.

# సయీ మంజ్రేకర్ బర్త్ డే స్పెషల్.. హైప్ పెంచేస్తున్న నిఖిల్ ది ఇండియా హౌస్ లుక్



టాలీవుడ్ నిఖిల్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తున్న సినిమాల్లో ఒకటి 'ది ఇండియా హౌస్' స్టార్ హీరో రాంచరణ్ సమర్పిస్తున్నఈ సినిమాకు రామ్‌వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. సయీ మంజ్రేకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.చాలా రోజుల తర్వాత మేకర్స్ ఫస్ట్ లుక్ రూపంలో ఆసక్తికర అప్‌డేట్ అందించారు. సయీ మంజ్రేకర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ మూవీ నుంచి ఆమె పాత్రను పరిచయం చేశారు. సయీ మంజ్రేకర్ ఇందులో సతి పాత్రలో నటిస్తుండగా.. నీలం రంగు చీరలో తెలుగుదనం ఉట్టిపడేలా కనిపిస్తోంది. 1905 బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో లవ్, రెవల్యూషనరీ ఎలిమెంట్స్‌తో సాగే కథాంశంతో ఈ చిత్రం రాబోతుంది. ఈ మూవీలో బాలీవుడ్ దర్శకనిర్మాత అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని వీ మెగా పిక్చర్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై విక్రమ్ రెడ్డి, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మయాంక్ సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీ కర్ణాటకలోని హంపి విరూపాక్ష దేవాలయంలో పూజా కార్యక్రమాలతో మొదలు కాగా.. ఈ వీడియో ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతోంది.






# ఆ రెండంటే చాలా చిరాకు : అనుపమ

పదేళ్ల క్రితం సినిమా ఇండస్ట్రీలో మలయాళ మూవీ 'ప్రేమమ్'తో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. ఈ పదేళ్ల కాలంలో మలయాళం, తెలుగు, కన్నడం, తమిళ్ భాషల్లో సినిమాలు చేసి అన్ని సౌత్ భాషల్లోనూ అభిమానులను సొంతం చేసుకున్నారు. ఉంగరాల జుట్టుతో వావ్ అనిపించే అందం ఈ అమ్మడి సొంతం. నటనతోనూ ఈ అమ్మడు మెప్పించిన విషయం తెల్సిందే. టాలీవుడ్‌లో యంగ్ హీరోలకి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా పేరు దక్కించుకున్న ఈ అమ్మడు గత కొంత కాలంగా లేడీ ఓరియంటెడ్ సినిమాలను చేస్తూ మంచి పేరు సొంతం చేసుకుంటూ ఉంది. ఆకట్టుకునే అందం, పాత్రల ఎంపిక విషయంలో కాస్త తెలివి చూపించడం ద్వారా పదేళ్లు అయినా ఇండస్ట్రీలో వరుస సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం ఈ అమ్మడు సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. దాదాపుగా 16 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందాల ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. కానీ ఆ ఫోటోల్లో ఎక్కువ శాతం ఇష్టం లేకుండానే తీయించుకున్న ఫోటోలుగా చెప్పుకొచ్చింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ తనకు ఫోటో షూట్స్ అంటే ఇష్టం ఉండదని చెప్పుకొచ్చింది. సినిమా ప్రమోషన్స్ కోసం ఇంటర్వ్యూలు అంటూ కెమెరా ముందు కూర్చోబెడతారు. అప్పుడు చాలా ఇబ్బందిగా ఉంటుంది. పదే పదే అవే ప్రశ్నలతో చాలా సార్లు చిరాకు తెప్పించిన సందర్భాలు ఉన్నాయి అంది. హీరోయిన్స్ అన్నప్పుడు అందాల ఆరబోత ఫోటో షూట్స్‌తో సోషల్ మీడియాలో కన్నుల విందు చేయాల్సి ఉంటుంది. అంతే కాకుండా ఎప్పుడూ వార్తల్లో ఉండాలి అంటే ఏదో ఒక మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అనుపమ మాత్రం ఆ రెండు అంటే తనకు చిరాకు అంటూ చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆమెకు ఆ రెండు అంటే చాలా చిరాకు అయినా సినిమాల ప్రమోషన్స్ కోసం ఇంటర్వ్యూలు ఇవ్వడం, ఫోటో షూట్స్ ఇవ్వడం రెగ్యులర్‌గా చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె తన మనసులో మాట బయట పెట్టడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ముందు ముందు ఆమెను ఇంటర్వ్యూలు చేసే వారు కాస్త ఆలోచించాల్సి ఉంటుంది. కార్తికేయ 2, 18 పేజెస్, బటర్‌ఫ్లై సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకున్న అనుపమ పరమేశ్వరన్ ఈ ఏడాది ఈగల్, సైరన్, టిల్లు స్వైర్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టిల్లు సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు ఆమె అందానికి మంచి మార్కులు పడ్డాయి. ఇక ఈ అమ్మడి చేతిలో ఆరు ఏడు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి తెలుగు సినిమా కాగా మలయాళ, తమిళ్ సినిమాలు ఎక్కువ ఉన్నాయి. హీరోయిన్‌గా మరో పది సంవత్సరాలు కొనసాగాలి అంటే ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటో షూట్స్‌ను ఇష్టం లేకున్నా, చిరాకు అయినా కంటిన్యూ చేయాల్సిందే. సినిమాల ప్రమోషన్స్‌కి ఇంటర్వ్యూలు ఇవ్వాల్సిందే.

## ఎయిర్ పోర్ట్‌లో విజయ్- రష్మిక.. ఎక్కడికి?

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న.. రిలేషన్ లో ఉన్నారని ఎప్పటి నుంచో వార్తలు వస్తూనే ఉన్నాయి. తమ లవ్ మ్యాటర్ పై ఇప్పటి వరకు ఇద్దరిలో ఎవరూ ఓపెన్ అవ్వకపోయినప్పటికీ అంతా మాత్రం ఫిక్సయిపోయారు. రీసెంట్ గా రష్మిక.. తాను సినీ ఇండస్ట్రీకి చెందిన సెలబ్రిటీతో రిలేషన్ లో ఉన్నట్లు పరోక్షంగా తెలిపారు. ఆ తర్వాత విజయ్ దేవరకొండ.. రష్మికతో లవ్ లో ఉన్నట్లు వస్తున్న వార్తలపై ఓ ఇంటర్వ్యూలో రెస్పాండ్ అయ్యారు. సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు తానే చెబుతానని అన్నారు. సెలబ్రిటీ కనుక.. తన పర్సనల్ లైఫ్ పై అందరికీ ఆసక్తి ఉంటుందని అన్నారు. అపరిమితమైన ప్రేమ అనేది ఉందో, లేదో తనకు తెలియదని అన్నారు. దీంతో వారిద్దరూ కామెంట్స్ ఫుల్ గా ట్రెండ్ అవుతుండగా.. రీసెంట్ గా ఫేమస్ రీల్ పోస్ట్ చేశారు విజయ్. అందులో 2025లో పెళ్లి చేసుకుంటావా అంటే నో అని చెబుతున్న వీడియోను షేర్ చేశారు. అలా వచ్చే ఏడాది తాను పెళ్లి చేసుకోవడం లేదని పరోక్షంగా



తెలిపారు. దీంతో రష్మిక, విజయ్ వివాహం ఎప్పుడు చేసుకుంటోరనని అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. అదే సమయంలో తాజాగా విజయ్, రష్మిక.. ఎయిర్ పోర్ట్ లో కనిపించారు. ముంబై విమానాశ్రయంలో సోమవారం రాత్రి మెరిశారు. ముందుగా రష్మిక.. ఎయిర్ పోర్ట్ కు వచ్చారు. ఆ సమయంలో కెమెరాకు పోజులిచ్చారు. అక్కడే ఉన్న ఫ్యాన్స్ తో పిక్స్ దిగారు. ఆ తర్వాత విజయ్ రాగా.. ఆయన కూడా అభిమానులతో ఫోటోస్ తీసుకున్నారు. ప్రస్తుతం అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే క్రిస్మస్, న్యూ ఇయర్ ఫెస్టివల్స్ వస్తున్న విషయం తెలిసిందే. దీంతో విజయ్, రష్మిక వాటిని సెలబ్రేట్ చేసుకోవడానికి వెళ్తున్నట్లు ఉన్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇద్దరూ తమ షూటింగ్స్ నుంచి బ్రేక్ తీసుకుని.. విదేశాలకు వెళ్తున్నారని చెబుతున్నారు. న్యూ ఇయర్ తర్వాత తిరిగి ఇండియా రానున్నారని అంటున్నారు. ఇక విజయ్.. ఇప్పుడు గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్టుతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న 12 మూవీ వచ్చే ఏడాది విడుదల కానుంది. మరోవైపు, రష్మిక రీసెంట్ గా పుష్ప-2తో సందడి చేయగా.. చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. నాన్ స్టాప్ గా షూటింగ్స్ లో పాల్గొంటున్నారు. మరి అప్ కమింగ్ మూవీస్ తో ఇద్దరూ ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.

# జానీ జైలు నుంచి రాగానే చరణ్ ఫోన్.. ఏమన్నారంటే?



టాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ వివాదం గురించి అందరికీ తెలిసిందే. ఆయన వద్ద అసిస్టెంట్ గా వర్క్ చేసిన ఓ లేడీ కొరియోగ్రాఫర్ జానీపై లైంగిక ఆరోపణలు చేయగా.. అరెస్టు అయ్యి జైలుకు వెళ్లారు. ఇటీవల.. బెయిల్ పై బయటకు వచ్చారు. కొద్దిరోజుల పాటు ఫ్యామిలీతో ఉన్న ఆయన.. ఇప్పుడు సినిమాలతో బిజీ అవుతున్నారు. ఇప్పటికే ఆయన కొరియోగ్రఫీ చేసిన బాలీవుడ్ మూవీ బేబీ జాన్ లోని నైన్ మాటక్క సాంగ్ చార్ట్ బస్టర్ గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రీసెంట్ గా గేమ్ ఛేంజర్ సినిమాలోని డోప్ సాంగ్ కు ఆయన కంపోజ్ చేసిన స్టెప్పులు అదిరిపోయాయి. ఆయన మార్క్ క్లియర్ గా కనిపించింది. ఇప్పుడు సాంగ్ ఫుల్ ట్రెండ్ అవుతోంది. అలా గేమ్ ఛేంజర్ లోని ఓ సాంగ్ కు వర్క్ చేసిన జానీ.. ఇప్పుడు హీరో రామ్ చరణ్ కోసం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. జైలు నుంచి బయటకు రాగానే చరణ్ తనకు ఫోన్ చేశారని తెలిపారు. తనకు ధైర్యం ఇచ్చినట్లు చెప్పారు. స్ట్రాంగ్ గా, హెల్దీగా ఉండని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. వేరే విషయాల గురించి ఏం మాట్లాడలేదని తెలిపారు. వర్క్ పై ఫోకస్ చేయమన్నారని, రిహార్సల్స్ కు వెళ్లి ప్రాక్టీస్ చేయమన్నట్లు చెప్పారు. బుచ్చిబాబుతో చరణ్ చేస్తున్న సినిమాలోని సాంగ్స్ కోసం చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. అవి చేద్దువు అని అన్నారని తెలిపారు. అప్పుడు చాలా హ్యాపీగా అనిపించిందని వెల్లడించారు. ఇప్పుడు జానీ మాస్టర్ కామెంట్స్ వైరల్ గా మారగా.. చరణ్ ఫ్యాన్స్ స్పందిస్తున్నారు. ఆరోపణలు ఉన్నా తమ అభిమాన హీరో.. జానీ మాస్టర్ టాలెంట్ కు ప్రాధాన్యమిచ్చారని కొనియాడుతున్నారు. పాన్ ఇండియా సినిమాలో అవకాశం ఇవ్వడం గ్రేట్ అని చెబుతున్నారు. సూపర్ చరణ్ అన్న అని కామెంట్లు పెడుతున్నారు. అయితే తనకు టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ముందులాగే మర్యాద దక్కుతుందని జానీ మాస్టర్ చెప్పారు. ఇప్పటికే చరణ్ నటించిన అనేక సినిమాలకు జానీ మాస్టర్ వర్క్ చేశారు. రచ్చ, నాయక్, ఎవడు, రంగస్థలం, గోవిందుడు అందరివాడేలా, బ్రూస్ లీ చిత్రాలకు పని చేశారు. ఆయా మూవీల్లో అనేక పాటలు ఇప్పటికే సూపర్ హిట్ గా నిలిచాయి. ఇప్పుడు డోప్ సాంగ్ కూడా అదిరిపోయింది. మరి బుచ్చిబాబు సినిమాలోని సాంగ్స్ ఎలా ఉంటాయో వేచి చూడాలి.

# రామ్ చరణ్ థాంక్స్ వెరీ ఇంట్రెస్టింగ్!



తనయుడికి తండ్రి..తండ్రికి తనయుడు కృతజ్ఞత చెప్పుకునే సందర్భం ఏదైనా ఉంటుందా? అంటే చాలా రేర్ కేసెస్ లోనే చోటు చేసుకుంటుంది. అదీ తండ్రికి మాత్రమే తనయుడు విధేయుడిగా ఉంటాడు తప్ప! తనయుడికి ఎప్పుడికి ఎప్పుడూ తండ్రి విధేయుడు గా ఉండడు. ఆ ఇద్దరి మధ్యా ఉండే బాండింగ్ అన్నది ఎంతో ప్రత్యేకమైనది. అలా మెగాస్టార్ చిరంజీవికి తనయుడు రామ్ చరణ్ తొలిసారి తనని ఇండస్ట్రీకి తీసుకొచ్చిన కొత్తలో కృతజ్ఞత చెప్పారు. మెగా అభిమానులకు తనయుడిని పరిచయం చేసిన సందర్భంలో ఈ సన్నివేశం చోటు చేసుకుంది. అటుపై చరణ్ స్టార్ గా ఎదిగిన తర్వాత కోట్లాది మంది అభిమానం చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబి మరోసారి డాడ్ కు థాంక్స్ చెప్పారు. ఆ తర్వాత మళ్లీ అలాంటి సన్నివేశం ఇద్దరి మధ్య చోటు చేసుకోలేదు. తండ్రికి తగ్గ తనయుడు చరణ్. నేడు రామ్ చరణ్ గ్లోబల్ స్టార్. అంతటి గ్లోబల్ స్టార్ మళ్లీ చాలా కాలానికి చిరంజీవికి థాంక్స్ చెప్పి హైలైట్ అయ్యారు. సంక్రాంతి సందర్భంగా రామ్ చరణ్ నటిస్తోన్న గేమ్ ఛేంజర్ రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ఇదే సీజన్ లో చిరంజీవి నటిస్తోన్న విశ్వంభరకూడా రిలీజ్ ప్లాన్ చేసుకున్నారు. కానీ అటుపై రిలీజ్ వాయిదా వేసుకున్నారు. సినిమాకి సంబంధించిన పనులు డిలే కావడంతోనే విశ్వంభర వాయిదా వేస్తున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. కానీ అసలు కారణం అది కాదని అమెరికా ఈవెంట్ లో రామ్ చరణ్ మాటల్ని బట్టి క్లారిటీ వచ్చింది. తనయుడు కోసం తండ్రి తన సినిమాని వాయిదా వేసుకున్నట్లు అర్ధమైంది. ఈ విషయాన్ని స్వయంగా రామ్ చరణ్ రివీల్ చేసారు. చిరంజీవి గారు..మా నాన్న కుథాంక్స్ అని చరణ్ మాట్లాడారు. అప్పుడే విషయం అర్ధమైంది తనయుడి కోసం తండ్రి వెనక్కి తగ్గారని. ఓసందర్భంలో చిరంజీవి-చరణ్ మధ్య డాన్స్ విషయంలో పోటీ రావడంతో? నీ బాబు నా రా నేను అంటారు. అందుకు చరణ్ తగ్గను డాడీ అంటాడు. నేను నీ కొడుకుని తగ్గితే ఎలా? అంటే ఆచార్య సెట్స్ లో చూసుకుందామని చిరు అంటారు. కానీ రిలీజ్ విషయంలో తనయుడు కోసం తండ్రి వెనక్కి తగ్గారు. అలా మరోసారి అన్నయ్య తనయుడి బాధ్యత తీసుకున్నారు.

# ఎవరు ఎక్కడ బ్యాటింగ్‌కి వస్తారు..? క్లారిటీ ఇచ్చిన రోహిత్ శర్మ



**న్యూఢిల్లీ- నవభూమి:** ఈ నెల 26 నుంచి భారత్-ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్ వేదికగా బాక్సింగ్ డే టెస్ట్ మొదలవనున్నది. ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం రెండు జట్లు చెరో మ్యాచ్‌ను నెగ్గగా.. మరో టెస్ట్ డ్రాగా ముగిసింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే టెస్ట్‌కు ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించాడు. నాలుగో టెస్ట్‌కు ముందు ప్రాక్టీస్ సమయంలో మోకాలికి గాయంపై వస్తున్న వార్తలను తోసిపుచ్చాడు. తాను పూర్తిగా ఫిట్‌గా ఉన్నానని చెప్పాడు. ఇక అదే సమయంలో బ్యాటింగ్ ఆర్డర్‌లో సందేహాలను సైతం నివృత్తి చేశాడు. ఆదివారం ఎంసీజీలో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో రోహిత్ ఎడమ మోకాలికి బంతికి తగలడంతో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా? అనే అనుమానాలు తలెత్తాయి.

ఈ క్రమంలో హిట్‌మ్యాన్ స్పందిస్తూ ప్రస్తుతం మోకాలు బాగానే ఉందని చెప్పాడు. ఈ సందర్భంగా పలువురు ఆటగాళ్ల ఫామ్‌పై మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు. ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా గురించి రోహిత్ మాట్లాడాడు. అతనితో చాలా సమయం గడిపానని.. ఎన్నో మ్యాచులు ఆడానని చెప్పాడు. ఈ క్రమంలో అతను ఎలా ఆలోచిస్తాడో తెలుసునని తెలిపాడు. అలాంటి ఆటగాడు ఉండడం జట్టుకు ఎంతో మేలు చేస్తుందన్నాడు. ఎవరు ఎక్కడ బ్యాటింగ్ చేస్తారోనని ఆందోళన చెందొద్దని అభిమానులకు సూచించాడు. తాను ఇక్కడ చర్చించే విషయం కాదని.. జట్టుకు ఏది మంచిదో అదే చేస్తానని కెప్టెన్ చెప్పాడు. విరాట్ కోహ్లీ ఫామ్‌పై సైతం స్పందించాడు. 'ఆఫ్ స్టంప్ వెలుపల బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడుతున్నాడు' ప్రశ్నకు.. విరాట్ ఓ గొప్ప బ్యాట్స్‌మెన్ అని.. సమస్యను అధిగమించేందుకు ఓ మార్గాన్ని కనుగొంటాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

# మనూను క్రికెటర్‌ను చేయాల్సింది.. ఖేల్‌రత్న నామినీ లిస్ట్‌లో చోటు దక్కకపోవడంపై షూటర్ తండ్రి ఆవేదన



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశ క్రీడా రంగ ప్రతిష్ఠాత్మక అవార్డు ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న విజేతలను కేంద్రం త్వరలో ప్రకటించనుంది. అయితే, ఈ పురస్కారానికి సిఫారసు చేసిన జాబితా నిన్న బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో ఈ ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన స్టార్ షూటర్ మనూ భాకర్ పేరు లేకపోవడం సంచలనం రేపుతోంది. ఈ అంశంలో కేంద్రంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. అయితే, పురస్కారానికి ఇంకా తుది ప్రతిపాదనల జాబితా సిద్ధం కాలేదని, అందులో మను పేరు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఆమె ఈ అవార్డు కోసం అసలు దరఖాస్తు చేసుకోలేదనే వార్తలు వస్తున్నాయి. కానీ మనూ ఈ అవార్డుకు దరఖాస్తు చేసిందని మర్చంట్ నేవీలో చీఫ్ ఇంజినీర్ అయిన షూటర్ తండ్రి రామ్ కిషన్ చెబుతుండడం గమనార్హం. ఈ అంశంలో రామ్‌కిషన్ తీవ్ర నిరుత్సాహానికి గురైనట్లు తెలుస్తోంది. తన కుమార్తెను షూటర్‌ను కాకుండా క్రికెటర్‌ను చేసి ఉండాల్సిందని.. అప్పుడు మనూకు మరింత గుర్తింపు వచ్చేదని వ్యాఖ్యానించారు. 'ఆమెను షూటర్‌ను చేసినందుకు చింతిస్తున్నాను. షూటర్‌కు బదులు మనూను క్రికెటర్‌ని చేసి ఉండాల్సింది. అప్పుడు తనకి అన్ని అవార్డులు, ప్రశంసలు దక్కేవి. మనూ ఒకే ఎడిషన్‌లో రెండు ఒలింపిక్ పతకాలు గెలుచుకుంది.

# వారి వల్ల నేను బతికి ఉన్నాను : వినోద్ కాంబ్లి



**న్యూఢిల్లీ- నవభూమి:** మూత్రనాళాల ఇన్‌ఫెక్షన్‌తో అతడు దవాఖానలో చేరగా వైద్య పరీక్షల్లో అతడి మెదడులో రక్తం గడ్డకట్టినట్టు తేలింది ఈ క్రమంలో తన ఆరోగ్య పరిస్థితిపై కాంబ్లి తాజాగా స్పందించారు. వైద్యుల వల్ల తాను బతికే ఉన్నానని తెలిపారు. 'ఇక్కడి డాక్టర్ల వల్ల నేను బతికి ఉన్నాను' అంటూ హాస్పిటల్ బెడ్‌పై నుంచి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ప్రస్తుతం కాంబ్లి స్టేట్‌మెంట్ వీడియో వైరల్ అవుతోంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**